ఆగష్టు, 2011

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 7 పేజీలు: 64 వెల: రూ. 20/-



## ఎందరో మహనీయుల త్యాగఫలం
## ఈనాటి మన స్వాతంత్ర్య దినం






పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో స్థాయీ సంఘ అధ్యక్షులు
శ్రీ ఎం. వెంకయ్యనాయుడు, ఇతర బృంద సభ్యులు



భూసేకరణ చట్టం, 1894 పై అపార్డులో శిక్షణ పొందుతున్న
నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఉన్నతాధికారులు

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 7

ఆగష్టు, 2011



ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**

**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**

**డా॥ వి. శివ శంకర ప్రసాద్**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్

హైదరాబాద్-500 030

ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 040-24018656

ఫ్యాక్స్ : 040-24017005

E-mail : krishna.chandramouli90@gmail.com

editorsthanikapalana@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం ........ 2

ప్రకృతి వైపరీత్యాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ పనితీరు భేష్ ........ 3

చీదేడులో వనమహోత్సవం ........ 5

చీదేడు ప్రజల ప్రవర్తనా సరళిలో మార్పు ........ 6

జీవనోపాధి అవకాశాలు పెంచిన అపార్డు 'కీ క్యాప్' ........ 7

నిరక్షరాస్యత నిర్మూలన దిశలో విద్యా పక్షోత్సవాలు ........ 9

సమగ్ర విద్యావ్యాప్తికి దోహదపడే విద్యాహక్కు ........ 10

పల్లెకన్నీరు పెడుతోంది (కథ) ........ 13

తగ్గుతున్న గ్రామీణ జనాభా ........ 17

నిరుద్యోగ యువతకు వరం ........ 20

భూకంప విపత్తు సమయంలో మెళకువలు ........ 22

చిత్తూరుకు విస్తరించిన 'కీ క్యాప్' ........ 23

త్యాగమూర్తి మహర్షి బులుసు సాంబమూర్తి ........ 24

గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపటానికి కృషి చేసిన
భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు ప్రతిభా పురస్కారాలు ........ 25

ఎన్‌టిపిసి సీనియర్ అధికారులకు 'అపార్డ్' శిక్షణ ........ 26

మహనీయురాలు మదర్ థెరిసా ........ 27

పశుగ్రాసాల సాగుతో పాడి అభివృద్ధి ........ 28

ఐకమత్యంలో ఆదర్శగ్రామంగా ........ 30

భారతదేశ సాంప్రదాయిక క్రీడ ఖోఖో ........ 32

స్వాతంత్ర్య సమరాన్ని రగిలించిన తెలుగువారు ........ 36

సహజవనరుల సంరక్షణతోనే సుస్థిర జీవనోపాధులు -
అపార్డ్ కమీషనర్ ........ 40

రాయలసీమ రాజకీయ భీష్మ కల్లూరు సుబ్బారావు ........ 41

షెడ్యూల్డు తెగల సంక్షేమానికి అమలు జరిగే పథకాలు ........ 43

ఈ ఎపిసోడ్ ఇంతేనా (కథ) ........ 47

ఆరోగ్య పరంగా వానాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ........ 49

పర్యావరణ పరిరక్షణకు పరమ ఔషధం ........ 50

అవతార పురుషుడు ఆది శంకరాచార్యులు ........ 51

గ్రామీణ మంచి నీటి సరఫరా గురించి తెలుసుకుందాం ........ 52

పారిశుద్ధ్యపు నిచ్చెన ........ 57

మహిళలకు పోషకాహార అవసరం ........ 59

సోషలిస్టు యోధుడు - రామమనోహర్ లోహియా ........ 62

మేలిముసుగును అధిగమించి గ్రామ సర్పంచ్‌గా ........ 63

# సంపాదకీయం..

ఆగష్టు, 2011

## స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో భారత నిర్మాణం

దేశంలో రెండు వందల సంవత్సరాలపాటు సాగిన బ్రిటిష్ పాలనను అంతం చేయడానికి ఆనాడు దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున లేచిన ఉద్యమం ఎప్పటికీ స్ఫూర్తి కలిగిస్తూనే ఉంటుంది. ఈ ఉద్యమంలో తెలుగు వారు పోషించిన పాత్ర మరింత సముజ్వలంగా ప్రకాశిస్తూ ఉంటుందని చెప్పక తప్పదు. మన రాష్ట్రంలో వందేమాతరం ఉద్యమంతోనే ప్రారంభమైన స్వాతంత్ర్య సమరంలో తెలుగువారు ప్రశంసనీయమైన పాత్ర పోషించారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, పింగళి వెంకయ్య, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, డాక్టర్ పట్టాభి సీతారామయ్య, ప్రకాశం పంతులు, కొండా వెంకటప్పయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, బులుసు సాంబమూర్తి, దుర్గాబాయమ్మ, కల్లూరి చంద్రమౌళి, గొట్టిపాటి బ్రహ్మయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, ఆచార్యరంగా, కాళేశ్వరరావు, నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, రావినారాయణ రెడ్డి మొదలైన తెలుగు మహనీయులు స్వాతంత్ర్య సమరంలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారు. ఈ యోధుల్లో ఒక్కొక్కరిది ఒక్కొక్క స్ఫూర్తిదాయక గాథ.

నిస్వార్ధపరులైన ఆ నాయకుల త్యాగఫలమే మనం ఈనాడు అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌకర్యాలు, ప్రగతి, సంపద. నాడు వారు తమ సర్వసుఖాలను వదిలిపెట్టి త్యాగాలు చేయకపోయి ఉన్నట్లయితే, నేడు మన జీవితాలు అధోః గతిలో ఉండి ఉండేవి.

అయితే, మనం స్వాతంత్ర్యం సముపార్జించుకుని 64 సంవత్సరాలయినా ఇంకా కొన్ని మౌలిక సమస్యలు అలాగే ఉన్నాయి. నిరక్షరాస్యత, పేదరికం, వైద్య, విద్యా సౌకర్యాల లేమి, గృహవసతి కొరత, విద్యుత్ సదుపాయాల కొరత, రోడ్ల వంటి మౌలిక సదుపాయాల కొరత మనలను పీడిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికే కేంద్రప్రభుత్వం నిర్దిష్టమైన లక్ష్యాలతో నిర్దిష్ట కాలపరిమితిలో 'భారత్ నిర్మాణ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. తొలి దశ ముగించుకుని, మలి దశలో అడుగుపెట్టిన ఈ కార్యక్రమం ప్రతిగ్రామానికి విద్యుత్ సౌకర్యం కలిగించడానికి, ప్రతి గ్రామానికి అన్ని కాలాలకు తట్టుకుని నిలిచే రోడ్డు సౌకర్యం కల్పించడానికి, ప్రతి గ్రామాన్ని టెలిఫోన్ వ్యవస్థ ద్వారా అనుసంధానించడానికి, అదనంగా నీటిపారుదల సౌకర్యాలు కల్పించడానికి, గ్రామీణుల ఇళ్ల నిర్మాణానికి ఉరకలు వేస్తూ ముందుకు సాగుతోంది.

లక్ష్యాల సాధనలో ప్రజలను ముఖ్యంగా యువతను భాగస్వాములను చేయటానికి ప్రతిగ్రామంలో 'భారత్ నిర్మాణ్ వాలంటీర్ల' పేరిట స్వచ్ఛంద కార్యకర్తలను తయారు చేసి వారి ద్వారా ప్రజల మౌలిక దృక్పథంలో మార్పు తీసుకుని రావటానికి ప్రయత్నించటం, తద్వారా అన్ని ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలలో సంపూర్ణ అవగాహన కలగచేయడానికి అపార్డ్ కీ క్యాప్ కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించింది. కొన్ని గ్రామాల్లో ఈ వాలంటీర్లు 'అపార్డు' ఆధ్వర్యంలో ఎంతో చురుగ్గా పనిచేస్తూ, ప్రజలకు పారిశుధ్యం, మద్యపానం, మరుగుదొడ్డి వాడకం, పోషకాహారం వంటి అనేక అంశాలపై అవగాహన కలిగిస్తూ, చైతన్య పరుస్తున్నారు. వీరు సాధిస్తున్న ఫలితాలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి.

అయితే, గ్రామగ్రామాన ఇటువంటి వాలంటీర్ల బృందం తయారు కావలసిన అవసరం ఉంది. ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలకు తోడుగా, 'భారత్ నిర్మాణ్' వాలంటీర్లు తమవంతు కృషి చేయవలసి ఉంది. అప్పుడే గ్రామాలను మౌలిక సమస్యలనుంచి, అవగాహనా లేమి నుంచి, నిరక్షరాస్యత నుంచి, అవిద్యనుంచి, అనేకానేక దురలవాట్లనుంచి విముక్తం చేయగలం. ఈ స్వాతంత్ర్యోద్యమ దినోత్సవ వేళ ఆ దిశలో మనం మరింత ముందడుగు వేద్దాం.

(కె. చంద్రమౌళి)




# ప్రకృతి వైపరీత్యాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ పనితీరు భేష్

**వార్తల్లో 'అపార్డ్'**

**ప్రకృతి విపత్తు వల్ల కలిగే నష్టాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పనితీరు ప్రశంసనీయంగా ఉందని పార్లమెంటరీ హెూమ్ అఫైర్స్ స్థాయీ సంఘ అధ్యక్షుడు శ్రీ ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. ప్రకృతి వైపరీత్యాల నిర్వహణలో వివిధ రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించేందుకు, కేంద్రప్రభుత్వం ద్వారా విపత్త సహాయ పునరావాస కార్యక్రమాల కోసం విడుదల అయిన నిధుల వినియోగంపై సమీక్షించేందుకు, విపత్తు నిర్వహణపై వివిధ భాగస్వాములకు శిక్షణ అందచేయటంలో రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యూహాలను సమీక్షించేందుకు గాను వెంకయ్యనాయుడు అధ్యక్షతన గల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 5-7-2011న ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించింది.**

ఈ బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోనూ, విపత్తు నిర్వహణలో నిమగ్నమైన రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా తొలుత ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, రాష్ట్రంలో విపత్తు నిర్వహణపై అపార్డు అందచేస్తున్న శిక్షణా కార్యక్రమాలను గూర్చి వివరించారు. విపత్తు నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వహించవలసిన వైద్య ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, భవనాలు, పంచాయితీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయం, పశు సంవర్థక, మత్స్య శాఖ తదితర శాఖల సిబ్బందికి అపార్డు ద్వారా అందచేస్తున్న శిక్షణా వివరాలను కమిటీ దృష్టికి తీసుకొనివచ్చారు.

## ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

అంతే కాకుండా పంచాయితీ రాజ్ సంస్థల ప్రజా ప్రతినిధుల శిక్షణా కార్యక్రమాలన్నిటిలోనూ విపత్తు నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా చేర్చి శిక్షణ అందచేస్తున్నట్లు తెలియచేసారు. విపత్తు నిర్వహణపై ప్రత్యేక డాక్యుమెంటరీ ఫిల్ములు, పుస్తకాలు, పోస్టర్లు తదితర ప్రచార సామాగ్రి ద్వారా ప్రజలలో, ప్రజాప్రతినిధులలో అవగాహన కలుగచేయటానికి అపార్డ్ కృషి చేస్తోందని ఆయన తెలియచేసారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ కమీషనర్ మరియు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రాధ, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ అనుసరిస్తున్న వ్యూహాలు, బాధితులకు అందచేస్తున్న సహాయ

పునరావాస ప్యాకేజ వివరాలు, ఇటీవల కాలంలో సంభవించిన లైలా తుఫాను ప్రభావం తదితర విషయాలపై పార్లమెంటరీ కమిటీ సభ్యులకు వివరించారు.

విపత్తుల నిర్వహణలో జి.ఐ.ఎస్./జి.పి.ఎస్ పరిజ్ఞానాన్ని వినియోగించి నష్టనివారణకు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నదీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ డైరెక్టర్ శ్రీ మృత్యుంజయ రెడ్డి మాట్లాడుతూ, వివరించారు. లైలా తుఫాను ప్రభావంపై జరిపిన పరిశోధనల ఫలితాలను ఆయన వివరించారు. ప్లానింగ్ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ శ్రీ ఎస్.పి. టక్కర్ మాట్లాడుతూ, విపత్తు నిర్వహణలో తన అనుభవాలను పార్లమెంటరీ సభ్యులకు వివరించి చెప్పటంతో పాటు పలు సూచనలు చేసారు.

రాష్ట్ర ప్రభుత్వ అధికారుల వివరణలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న విపత్తు నిర్వహణా పద్ధతులను గూర్చి విన్న పార్లమెంటరీ కమిటీ సభ్యులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు అందచేస్తున్న శిక్షణా వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. పంచాయితీ రాజ్ ముఖ్య కార్యదర్శి శ్రీ రాజీవ్ శర్మ మాట్లాడుతూ, విపత్తు నిర్వహణలో పంచాయితీ రాజ్ సంస్థల పాత్రపై వివరణ ఇచ్చారు.

సమీక్ష అనంతరం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు శ్రీ వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘమైన కోస్తాతీర ప్రాంతం ఉండటం, గోదావరీ, కృష్ణ, వంశధార, నాగావళి వంటి నదులు ఉండటంతో రాష్ట్రం తరచూ ఏదో ఒక విపత్తుకి




గురవుతుందనీ, తరచుగా సంభవించే విపత్తుల నిర్వహణ వల్ల అధికార యంత్రాగంలో అప్రమత్తత ఎక్కువై, వారి సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయని అన్నారు.

విపత్తుల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న వ్యూహాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలలో ఏమైనా మార్పులు, చేర్పులు చేయవలసిన అవసరం ఉన్నట్లయితే సూచనలు అందచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.వి. ప్రసాద్‌ను కోరారు. విపత్తు నష్ట పరిహారం ఎంత మేరకు అందచేస్తే సబబుగా ఉంటుందనే విషయంపై కూడా సలహాలు, సూచనలు కోరారు.

అపార్డును ప్రత్యేకంగా సందర్శించి మరిన్ని వివరాలు తీసుకుంటామని అన్నారు. సభ్యులు కోరిన సమాచారాన్ని త్వరలోనే క్రోడీకరించి కమిటీకి సమర్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.వి. ప్రసాద్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, అపార్డు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



అరవై రెండవ వనమహోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ శాఖ దేశ వ్యాప్తంగా 20 లక్షల మొక్కలు నాటే బృహత్ పథకాన్ని 9-7-2011నాడు ప్రారంభించింది. అపార్డ్ వారి ల్యాబ్ టు ల్యాండ్ కీ-క్యాప్ కార్యక్రమంలో భాగంగా పచ్చదనం - పరిశుభ్రత పెంపొందించేందుకు అపార్డ్ కమీషనర్ చీదేడు గ్రామస్థుల సహకారంతో సామాజిక అడవుల అభివృద్ధే ధ్యేయంగా గ్రామంలోనికి వెళ్ళే రోడ్డుకిరువైపుల మొక్కలు నాటే కార్యక్రమం తీసుకోవడం జరిగింది.



# చీదేడులో వనమహోత్సవం

దీనికనుగుణంగా అటవీశాఖ, ఇబ్రహీంపట్నం రేంజి వారు చీదేడులో వనమహోత్సవం పురస్కరించుకొని 9-7-2011 రోజున శ్రీ పి. సాగర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఇబ్రహీంపట్నం రేంజ్, శ్రీమతి యం. అనిత, సెక్షన్ ఆఫీసర్ మరియు డా. వి. లక్ష్మినారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్, ల్యాబ్ టు ల్యాండ్ ప్రోగ్రాం, అపార్డ్ తరపున గ్రామ ప్రజల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 500 మొక్కలను రోడ్డు కిరువైపుల నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి.లక్ష్మీనారాయణ, పి. సాగర్, యం. అనిత, తదితరులు చెట్ల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ మొదలైన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

వృక్షో రక్షతి రక్షిత: అన్నట్లు వృక్షాలను మనము రక్షించి కాపాడితే అవి మనకి ఎన్నో విధాలుగా రక్షణ కల్పిస్తాయి. పూర్వం అశోకుడు రోడ్ల కిరువైపుల పాదచారులు, ప్రయాణీకులు సేద తీర్చుకోవటానికి పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటించారు. నేడు రోడ్ల విస్తరణ కొరకు, కలపకొరకు, వంట చెరుకు కొరకు చెట్లను నరకడం వల్ల పర్యావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. దీని వల్ల వర్షాలు పడకపోవడం, పంటలు పండక అనావృష్టి బారిన పడి వ్యవసాయ రంగం కుంటుపడింది. అందువలన మన ప్రభుత్వం వారు ఈ సామాజిక అడవులు పెంచే కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషించదగ్గ విషయం. ప్రభుత్వం వారే కాకుండా ప్రజలందరు ఒక్కొక్కరు ఒక్కొక్క మొక్కను దత్తత తీసుకొని వృక్షంగా పెరిగే వరకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

చెట్ల వలన మనకు ఎన్నో లాభాలు ఉన్నాయి. వృక్షాలు వాతావరణంలోని కార్బన్‌డై ఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజను వదులుతాయి.



ఈ ఆక్సిజన్ ప్రాణుల మనుగడకు ఎంతో ఉపయోగపడుతుంది. చెట్లు వాతావరణంలోని వేడిని తగ్గించి వర్షాలు రావడానికి ఎంతో సహకరిస్తాయి. కొన్ని చెట్లు, మొక్కలు, ఆకులు వేర్లు ఔషధ తయారీలో ఎంతో ఉపయోగపడ్తున్నాయి. ఈ చెట్ల వలన వివిధ రకాలైన నూనెలు, మందులు తయారుచేస్తున్నారు. అనేక రకాలైన పండ్లు లభిస్తున్నాయి. ఈ విధమైన బహుళ ప్రయోజనాలున్న చెట్లను నాటి ముందుతరాలకు మంచి పర్యావరణాన్ని అందించి సస్యశ్యామల దేశంగా ఆవిర్భవించడానికి కృషి చేయాల్సిన అవసరమెంతైనా ఉన్నది. అందుకే వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు.

**వి. లక్ష్మీనారాయణ**
**ప్రాజెక్టు మేనేజర్ , ల్యాబ్ టు ల్యాండ్ (కీ - క్యాప్)**

# చీదేడు ప్రజల ప్రవర్తనా సరళిలో మార్పు

## మరుగుదొడ్ల వాడకం దిశగా ముందడుగు

**చీదేడు గ్రామంలోని ప్రజలు 2011 ఫిబ్రవరి నెల నుండి ఎయంఆర్ అపార్డు అధికారులు నిర్వహించిన పలు కార్యక్రమాల పట్ల ప్రభావితులై ముఖ్యంగా ఆరుబయట మల విసర్జన హానికరం అని గుర్తించి తదుపరి కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని ఆ దిశలో ముందుకు సాగుతున్నారు.**

| | గతంలో వారి ప్రవర్తన | ప్రస్తుతం వారి ప్రవర్తన |
|---|---|---|
| 1. | గ్రామంలోని మొత్తం నివాసం ఉంటున్న కుటుంబాలలో సుమారు 90% వరకు బహిరంగ మలవిసర్జన అలవాటుగా ఉండేది. కేవలం 10% మాత్రమే మరుగుదొడ్లు వాడేవారు. | ప్రస్తుతం ఆరుబయట మల విస్జన చేసేవారి శాతం 60%కి తగ్గినది. 40% ప్రజలు మరుగుదొడ్లు వాడుతున్నారు. |
| 2. | మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి వాడుకోవాలని సూచించగా క్రింది కారణాలు చెప్పేవారు. | ఇప్పుడు ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మాణం సాగుతోంది. |
| 3. | • ఆర్థిక సమస్య<br>• ప్రభుత్వ అధికారులు సకాలంలో సబ్సిడీ ఇవ్వడం లేదు<br>• రాతి నేల త్రవ్వడం కష్టం<br>• గుంత నిండిపోయింది.<br>• మాకు కావలసినంత మరుగు ఉంది, మొ॥నవి. | • ప్రభుత్వ సహాయం ఎప్పుడైనా రానివ్వండి, ముందు మనం మరుగుదొడ్డి కట్టుకుందాం.<br>• మరుగుదొడ్డి ఉన్న ప్రతి ఇంట్లో కుంటుంబ సభ్యులందరూ మరుగుదొడ్లు వాడటం |
| 4. | భోజనానికి ముందు, మూత్ర, మల విసర్జన అనంతరం చేతులు సబ్బుతో కడుగుకొనే అలవాటు లేదు. | ఎవరిని ప్రశ్నించినా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకుంటున్నాం అనే సమాధానం |
| 5. | గుంత తియ్యాలి కదా, ముందు 1500/- దాకా ఖర్చు అవుతుంది. మేం తియ్యలేం. | ప్రతి ఇంట్లో ముసలివారి నుండి పిల్లల వరకూ అందరూ గుంత తీయడంలో పాల్గొంటున్నారు. |

ఇవీ గ్రామస్తుల ప్రవర్తనా సరళిలో వచ్చిన మార్పునకు కొన్ని ఉదాహరణలు

**గ్రామస్తులు ఏమంటున్నారో వారి మాటల్లోనే ...**



**అనసూయ**

మా గ్రామాన్ని నవంబరు 1 నాటికి సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దుకుంటాము.



**చింతకాయల మంగమ్మ**

మేం మరుగుదొడ్డి కట్టుకున్నాం. మా ఆయన, మా పిల్లలూ, నేనూ అందరం మరుగుదొడ్డిలోకే పోతున్నాం. వానాకాలం చాలా హాయిగా ఉంది. సబ్బుతో చేతులు కడుక్కుంటున్నాం.



**రాములమ్మ**

ఇదిగోమ్మా మరుగుదొడ్డి కట్టుకున్నాం చూడు. అదిగో, పైపు మట్టానికి మెరకతోలి వాడు కుంటాం. రెండు రోజుల్లో వాడుకుంటాం. నా కొడుకు అందులోకే పోతున్నాడు.




**పి. మాధురి**
**ఫాకల్టీ, అపార్డ్**



# జీవనోపాధి అవకాశాలు పెంచిన అపార్డు 'కీ క్యాప్'

**ఎ.యం.ఆర్. అపార్డు ఆధ్వర్యంలో చీదేడు గ్రామం మంచాల మండలం, రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న కీ-క్యాప్ కార్యక్రమం ఆ గ్రామంలో జీవనోపాధి అవకాశాలను పెంచగలిగినది అంటే ఆశ్చర్యంగా ఉంది కదూ. కానీ ఇది నిజం. ఇది ఎలా సాధ్యమయిందంటే-**

ఫిబ్రవరి 2011 మాసం నుండి అపార్డు అధికారులు చీదేడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. అందులో భాగంగా సంపూర్ణ పారిశుధ్య సాధనకై ప్రజలకు కల్గించిన అవగాహన ఫలితంగా భారీ సంఖ్యలో అంటే సుమారు 110 గృహాలలో మరుగుదొడ్ల నిర్మాణం ప్రక్రియ మొదలైంది. తత్ఫలితంగా మరుగుదొడ్ల నిర్మాణానికి, పారిశుధ్య సామాగ్రికి మంచి గిరాకీ ఉంటుందని భావించిన స్థానిక నాయకులు కొందరిని ప్రేరేపించి ఈ దిశగా అడుగులు వేశారు. అందులో భాగమే చీదేడులో నూతనంగా ప్రారంభమైన

- సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్
- సిమెంట్ ఒరల యూనిట్

వీటి గురించి క్షణ్ణంగా తెలుసుకుందాం.

### 1. సిమెంట్ ఇటుకల యూనిట్ ఏర్పాటు

చీదేడు గ్రామానికి చెందిన శ్రీ హనుమాళ్ళస్వామి స్వతహాగా సిమెంట్ కట్టడాల పనిలో అనుభవజ్ఞుడు. ఇతనికి సిమెంట్ ఇటుకల తయారీ గురించిన విధివిధానం తెలుసు. స్థానిక నాయకులు ఇతనిని సంప్రదించి సిమెంట్ ఇటుకల యూనిట్ స్థాపిస్తే స్థానికంగా ఇటుకలు అందుబాటులోనికి వస్తాయని చెప్పడంతో అతను ముందుకు వచ్చాడు. అయితే, పెట్టుబడి ఎలా? అని ఆలోచించగా స్థానిక నాయకులు పెట్టుబడిలో సహకరిస్తామని, తర్వాత బ్యాంక్ మేనేజర్ గారితో కలిసి స్వయం ఉపాధి పథకం క్రింద లోను మంజూరు ఆయ్యేలా కృషి చేస్తామని చెప్పడంతో హనుమాళ్ళస్వామి ఆర్థిక వనరులు



సమీకరించుకొని ముందుకు వచ్చాడు. అయితే ఇటీవల బ్రిక్స్ యూనిట్‌ను సందర్శించిన బ్యాంక్ మేనేజర్ సంతృప్తి చెంది మంజూరుకు సమ్మతించారు.

బ్రిక్స్‌తయారీ యంత్రాన్ని రూ॥ 30,000/-లకు, దానితోపాటు 100 సెట్ల చెక్కలను, బ్రిక్ నమూనాలను, కంకర పొడిని, 100 బస్తాల సిమెంట్ బస్తాలను కొని తన గృహంలోనే యూనిట్‌ను ఏర్పాటుచేసుకున్నాడు.

దీంతో, అతను ప్రతి మూడు రోజులకు 500 సిమెంట్ ఇటుకలను తయారు చేయడం, క్యూరింగ్ చేసే ఆ మూడు రోజులూ గ్రామంలోని మరుగుదొడ్ల నిర్మాణపనులను కూడా నిర్వహించడంతో చాలా బిజీ అయ్యాడు. బయటనుండి ఒక్కో సిమెంట్ బ్రిక్ రవాణాతో సహా రూ॥ 9.50 అవుతుండగా, కేవలం రూ॥ 9.00 లకే ఒక బ్రిక్‌ను గ్రామస్థులకు అందుబాటులో ఉంచాడు. దీనితో గ్రామస్తులకు క్రింది లాభాలు చేకూరినవి.

- తక్కువ ధరకే సిమెంట్, ఇటుకలు అందుబాటులో ఉన్నాయి. రవాణా సమస్య తీరింది.
- ఎప్పుడు అవసరమైతే అపుడు సమీకరించుకోవచ్చు.
- అప్పు సౌకర్యం, వాయిదాలలో చెల్లింపునకు అవకాశం ఏర్పడింది.
- సిమెంట్ బ్రిక్స్ అందుబాటులోకి వచ్చినందున ప్రహరీ గోడలు, స్నానాల గదుల నిర్మాణాలు కూడా చేపడుతున్నారు.

హనుమాళ్ళస్వామి, బ్రిక్స్ యూనిట్ యజమానికి ఆదాయ వనరులు క్రితంలోకంటే పెరిగాయి. ప్రారంభం కనుక ఖచ్చితమైన ఆదాయం చెప్పలేనప్పటికీ కనీసం రోజుకు 500 రూ॥లు కుటుంబానికి వస్తుందని తెలిపాడు.

## 2. సిమెంట్ ఒరల యూనిట్ ఏర్పాటు

మరుగుదొడ్ల నిర్మాణంలో "పిట్" (గుంత) ప్రధానమైనది. కనుక, ఆ గుంత ఏర్పాటుకు అవసరమైన సిమెంట్ ఒరలకు గతంలో రంగాపూర్ నుండి కొనుక్కొని తెచ్చుకొనేవారు. అప్పుడు ఒక్కొక్క అర పెద్దసైజుది 170 రూ॥లు పడేది, చిన్నసైజుది 150 రూ॥లు పడేది.

పైగా 5 రోజుల ముందే అడ్వాన్స్ చెల్లించి ఆర్డర్ ఇవ్వవలసివచ్చేది. అయినా ఒక్కోసారి 5 నుండి 10 రోజుల వరకు సమయం పట్టేది. పైగా ఆ ఒరలు తీసుకురావడానికి ట్రాక్టర్ మాట్లాడు కోవడం, వాటిని పైకి ఎత్తడం, క్రిందకు దించడం, ఈ క్రమంలో పగలడం జరిగేది. ఇవన్నీ ప్రజలు భరించవలసి వచ్చేది. ఒక్కో ఇంటికి కనీసం 10 ఒరలైనా అవసరమౌతాయి. అంటే సుమారు 130 ఇండ్లు × 10 చొప్పున = 1300 ఒరలు కావాలన్నమాట.

ఇది గమనించిన సర్పంచ్ మరియు ఇతర స్థానిక నాయకులు ఎలాగైనా ఈ యూనిట్ గ్రామంలో నిర్వహించాలనే ధృఢ సంకల్పంతో విచారిస్తుండగా, ఇబ్రహీంపట్నంలో ఒరల యూనిట్ నిర్వహిస్తున్న అన్నదమ్ములు డి. అంజయ్య, డి. సైదులును సరైన వ్యక్తులుగా గుర్తించారు.

నాయకులు వారితో ముందుగానే ఒక ఒప్పందానికి వచ్చారు. కావలసిన ముడిసరుకు, పరికరాలు వారే తెచ్చుకోవాలి. గ్రామంలో ఉండడానికి కావలసిన నివాసం కల్పిస్తామని పెద్దసైజువి 140 రూ॥లకు, చిన్న సైజువి 120 రూ॥లకు సరఫరా చేయాలని మాట్లాడారు. అందుకు అంగీకరించిన సైదులు, అంజయ్యలు చీదేడు గ్రామానికి వచ్చి, కమ్యూనిటీ హాలులో సామాను చేర్చుకొని రోజుకు 25 వరకు ఒరలు వేస్తున్నారు. పెద్దసైజు వాటిలో 40 రూ॥లు, చిన్నసైజు వాటిలో 20 రూ॥లు మార్జిన్ ఉంటుందని అంటే సుమారు 1000 రూ॥ల వరకు రోజుకు ఆదాయం వస్తుందని వారు తెలిపారు.

**గ్రామస్తులకు ఏమిటి ప్రయోజనం అంటే**

- 170 రూ॥లకు బదులు 140 రూ॥లకు లభించడంతో ఒక్కొక్క ఒరకు 30 రూ॥లు మిగులుతుంది.
- రవాణాతో పనిలేదు.
- ఎవరి ఇంటి ముందు వారే ఒరలు పోయించుకుంటున్నారు.
- ఎవరికి వారే స్వయంగా క్యూరింగ్ చేసుకుంటున్నారు.
- మరుగుదొడ్ల నిర్మాణమే కాకుండా ఇంటి ముందుకు ఒరలు అదుబాటులోనికి రావడంతో నీళ్ళ తొట్టెలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు.

చీదేడులోని ప్రతి గృహం ముందు ఎటుచూసినా మరుగుదొడ్ల నిర్మాణపనులే. నవంబరు 1వ తేదీ నాటికి ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి కట్టుకొని, వాడుకోవాలనే కృతనిశ్చయంలో పనులను వేగవంతం చేస్తున్నారు. తమ గ్రామం బహిరంగ మల విసర్జనారహిత గ్రామంగా రూపుదాల్చాలనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. వారికివే మా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

**పి. మాధురి, ఫాకల్టీ, అపార్డ్**

# నిరక్షరాస్యత నిర్మూలన దిశలో విద్యా పక్షోత్సవాలు

**"నిరక్షరాస్యత దేశానికి అతిపెద్ద కళంకం - దాన్ని విధిగా తొలగించి తీరాలి" - గాంధీజీ**

**రాజీవ్ విద్యామిషన్ 'విద్యాపక్షోత్సవాలు' కార్యక్రమం జూన్ 13 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది. 'విద్వాన్ సర్వత్రా పూజ్యతే' అందుకే 'బడి మానివేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించాలి. మంచిపౌరులుగా తీర్చిదిద్దాలి, అనే లక్ష్యంతో 'విద్యాపక్షోత్సవాలు' జరుపుకుంటున్నాం.**

'చదువుకున్న పురుషుడు తనకు మాత్రమే ఉపయోగపడతాడు, అదే మహిళ చదివితే కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడుతుంది.' ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ చెప్పినమాట. అదే లక్ష్యంతో విద్యా పక్షోత్సవాలను జూన్ 13నుండి రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించడమైంది.

ఈ విద్యా పక్షోత్సవాలలో 1000 పాఠశాల భవనాలు, 3,5,6,9 అదనపు తరగతి గదులు, 75 కస్తుర్బా గాంధీ బాలల విద్యాలయాలు, 50 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించారు. 10,366 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ప్రహరిగోడలు నిర్మించటానికి కృషి చేశారు. 500 ఉన్నత పాఠశాల భవనాలకు, 355 ఆదర్శ పాఠశాల భవనాలకు శంకుస్థాపన జరిగింది.

ఈ పక్షోత్సవాల లక్ష్యం 'ప్రతి ఒక్కరిని బడికి పంపటమే. అందరు చిన్నారులతో సామూహిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించి 'బాలలందరు చదవాలని' మన ముఖ్యమంత్రి, విద్యామంత్రి ఆశించారు.

ఈ కార్యక్రమంలో ఈ క్రింది అంశాలను అన్ని గ్రామాలలో నిర్వహించడమైనది.

1. యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీచేయడం.
2. 17.6.2011న సామూహిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంనందు తల్లితండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొనడమైనది.
3. పాఠశాలలో చేరిన విద్యార్థులకు పలకలు, పెన్సిళ్ళు, నోటు పుస్తకములు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేయటం జరిగినది.
4. పాఠశాల సముదాయ స్థాయిలో 'విద్యాహక్కు' చట్టం గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేయటం జరిగినది.
5. గ్రామీణ బాలలలో సృజనాత్మక పెంపొందించడం, గోడ పత్రిక, మొదలైన వినూత్న కార్యక్రమాలు ప్రదర్శించడం.
6. బాల కార్మికులకు, బడి బయట బాల బాలికలను పాఠశాలలో చేర్పుటకు ప్రత్యేక డ్రైవ్ చేయడం జరిగింది.

గ్రామ సర్పంచ్ అధ్యక్షతన పాఠశాల యాజమాన్య కమిటి సమావేశం నిర్వహించి విద్యా వారోత్సతవాలను నిర్వహించి మిగిలివున్న బడి బయట పిల్లలను గుర్తించి కౌన్సిలింగ్ చేసి వారిని కూడా పాఠశాలలో చేర్చుకోవడం జరుగుతుంది.

## బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009

### స్థానికసంస్థల పాత్ర

భారతదేశం అత్యధిక మానవవనరుల గల దేశం. ఈ మానవ వనరులను సంరక్షించుకునే బాధ్యత మనందరి మీద ఉన్నది ఈ మానవ వనరులలో 'పిల్లలే దేశ సంపద'. పిల్లల సృజనాత్మక శక్తి ఎదుగుదలకు 'పాఠశాలలే' ప్రథమ దేవాలయాలు. కాబట్టి బాలల ఉచిత నిర్బంద విద్యాహక్కు చట్టం 2009 ఏప్రిల్1, 2010 నుంచి అమలులోనికి వచ్చింది.

### ముఖ్యాంశాలు

- 6 సం॥ నుంచి 14 సం॥ వయస్సులో ఉన్న పిల్లలందరికి ఉచితంగా విద్యను తప్పనిసరిగా అందించాలి. 8వ తరగతి పూర్తి అయ్యే విద్యను అందించాలి.
- బడి బయట పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో బడిలో చేర్పించి ప్రత్యేక శిక్షణ ద్వారా విద్యను అందించి, బడిలో కొనసాగేటట్లు చూడాలి.
- 3 సం॥ నుంచి 5 సం॥ వరకు వయసున్న పిల్లలను అంగన్ వాడీ కేంద్రంలో చేర్పించి విద్యను అందించాలి.
- విద్యార్థులను అదే తరగతిలో ఒకటి కంటే ఎక్కువ సంవత్సరాలు కొనసాగించడం, బడి నుంచి తీసేయడం నిషేధం.
- ప్రవేశ రుసుము, ప్రవేశ పరీక్ష నిషేదం.
- బాల బాలికలను శారీరకంగా, మానసికంగా శిక్షించడం చట్టరీత్యా నేరం.

### స్థానిక సంస్థల పాత్ర

- గ్రామ పంచాయితీ పరిధిలోని 0-14 సం॥ వయస్సు గల పిల్లలందరికీ రికార్డు నిర్వహించాలి.
- పాఠశాల యాజమాన్య కమిటి (SMC) సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలి. ఈ యాజమాన్య కమిటి ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి.
- పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా అన్ని మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించాలి.
- క్రమం తప్పకుండా ప్రతినెల యాజమాన్యకమిటీ సమావేశాలను నిర్వహించాలి. కార్యాచరణ రూపొందించాలి.

ఈ చట్టం అమలు చేసే రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో 'విద్యా పక్షోత్సవాలు' విజయవంతంగా నిర్వహించడమైనది.

'విద్య పిల్లల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసి వారి ఊహాలకు జీవం పోస్తుంది. వారి బతుకు బాటను బంగారు మయం చేస్తుంది. ఎందరో జాతి నిర్మాతలను ఈ సమాజానికి అందిస్తుంది.'

**– కె. కోటేశ్వరరావు,**
**ఎంపిడివో, బీమడోలు మండలం పశ్చిమగోదావరి జిల్లా**

# సమగ్ర విద్యావ్యాప్తికి దోహదపడే విద్యాహక్కు

**"విద్యా విహీనః పశుః" అన్నాడు భర్తృహరి. విద్యలేని వాడు పశువుతో సమానమని అర్థం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలు పూర్తయినా, ఇంకా అనేక మిలియన్ల మంది పిల్లలకు సామాజిక, ఆర్థిక కారణాల వల్ల విద్యనభ్యసించే అవకాశం కలగడం లేదు. మన దేశ జనాభాలో సుమారు 40 శాతం మంది 18 సంవత్సరాలలోపు పిల్లలు. వీరి జనాభా సుమారు 400 మిలియన్లు. ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల వయస్సున్న బాలలలో సగం కంటే తక్కువ మంది పాఠశాలకు వెడుతున్నారు.**

పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరిన పిల్లల్లో కేవలం 1/3 వంతు కంటె తక్కువ మంది బాలలు మాత్రమే 8వ తరగతి వరకు నుండి ఐదవ తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. మూడవ తరగతి నుండి ఐదవతరగతిని అభ్యసించే వారిలో ఎక్కువమంది తమ విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇందులో 50శాతం మంది బాలురు 58 శాతం మంది బాలికలు. ఈ రకంగా జరగడానికి ప్రధానంగా మూడు కారణాలను పేర్కొనవచ్చు.

1. పాఠశాలలు నివాస స్థలాలకు దూరంగా ఉండడం.
2. ప్రయివేటు పాఠశాలల్లో పిల్లలను చదివించే ఆర్థిక స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడం.
3. పేదరికం కారణంగా అనివార్యంగా కుటుంబ ఆర్థికభారాన్ని మోయడం కోసం విద్యార్జన చేయవలసిన బాలురు చదువుమాని బాలకార్మికులుగా మారుతున్నారు.

చదువుతున్నారు. భారతదేశంలో కేవలం 53 శాతం ఆవాస ప్రాంతాలలో మాత్రమే పాఠశాలలున్నాయి. ఇందులో కేవలం 20 శాతం ప్రాంతాలలో సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. ఆవాసయోగ్యమైన 22 శాతం ప్రాంతాలలో 3 కిలోమీటర్ల దూరంలో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు 60 శాతం ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో ఇద్దరికంటె తక్కువ మంది అధ్యాపకులు ఉన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలోను సగటున ముగ్గురికంటె తక్కువమంది అధ్యాపకులు ఉన్నారు. ప్రతినిత్యం వీరు ఒకటవ తరగతి




### నిర్బంధ విద్య

ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలన్న సత్సంకల్పంతో భారత ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం 2010వ సంవత్సరం ఏప్రిల్ మొదటి తేదీ నుండి అమలులోకి వచ్చింది. 1960వ సంవత్సరం నాటికే పద్నాలుగు సంవత్సరాలలోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను అందించాలని భారత రాజ్యాంగంలోని ఆధునిక సూత్రాలలోని 45వ అధికరణంలో పేర్కొనడం జరిగింది. అయితే ఇది ఆచరణకు నోచుకోలేదు. 1993వ సంవత్సరంలో ఉన్ని కృష్ణన్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని 45వ అధికరణ 21వ అధికరణతో కలిపి చూడాలని వివరించడంతో విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించే ప్రయత్నాలకు అంకురార్పణ జరిగింది. విద్యాహక్కు కోసం 2002వ సంవత్సరంలో 86వ రాజ్యాంగ సవరణ గావించినప్పటికీ, దీన్ని చట్టంగా రూపొందించడానికి ఏడు సంవత్సరాలు పట్టింది.

విద్యాహక్కు మానవ హక్కులలో భాగం. జాతి, కులం, రంగు, లింగ భేదం లేకుండా 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలకూ విద్యనభ్యసించే సదుపాయం విధిగా కల్పించాలి.

మనోవికాసానికి, గౌరవప్రదమైన జీవనం కొనసాగించడానికి విద్యా హక్కు దోహదం చేస్తుంది. విద్యా హక్కు చట్టం అమలులోనికి వచ్చి సంవత్సరం దాటినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహ అనేక రాష్ట్రాలలో చట్టం అమలుకు సంబంధించిన అంశాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

విద్యాహక్కు చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రయివేటు పాఠశాలలు ప్రవేశస్థాయిలో 25 శాతం సీట్లను పేదవర్గాలకు కేటాయించాలి. క్యాపిటేషన్ ఫీజు, ప్రవేశ పరీక్షలు రద్దుచేయాలి. విద్యాహక్కు చట్టంలోని అంశాలు అందరినీ ఆకర్షించాయి. మన రాష్ట్ర ప్రభుత్వంతో సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు సంబంధించిన అంశాలపై ఎటువంటి చర్యలు గైకొనలేదు. 25శాతం కోటాలో ప్రయివేటు పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి రాష్ట్రప్రభుత్వం ప్రతినెల కనీసం 500 రూపాయలు సంవత్సరంలో పదిమాసాలు చెల్లించాలి. భారీ వ్యయంతో కూడుకున్న ఈ విధానం అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి కనబరచటంలేదు. నిధులతో నిమిత్తం లేకుండా విద్యాహక్కు చట్టాన్ని అమలుపరచడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేయవలసిన ఆదేశాలలో కూడా జాప్యం జరుగుతోంది. పాఠశాలల్లో ప్రవేశ పరీక్షల రద్దు, డొనేషన్ల నిషేధం వంటి అంశాలపై ఇంకా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయవలసి ఉంది. విద్యాహక్కు చట్టం అమలు జరగాలంటే ప్రభుత్వ రాయితీల ద్వారా స్థలాలు పొందిన పాఠశాలల్లో యాభై శాతం వరకు సీట్లు పేద వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ప్రయివేటు విద్యాసంస్థలు ఈ సామాజిక బాధ్యతను నిర్వర్తించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

### అధ్యాపకుల బాధ్యతే ఎక్కువ

విద్యార్థుల భవిత ఉపాధ్యాయుల నేర్పు సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. సమాజంలో ప్రముఖ వ్యక్తి ఉపాధ్యాయుడు. విద్యార్థులను బాధ్యత గల భావిభారత పౌరులుగా తీర్చిదిద్దవలసిన గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉంది. అయితే, మన దేశంలో సరైన అర్హతలున్న అధ్యాపకుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతోంది. ఇందుకు కారణం మనదేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న ఉపాధ్యాయ - విద్యా పాఠ్య ప్రణాళిక లోపభూయిష్టంగా ఉండడం. అధ్యాపకులను వృత్తి నిపుణులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ విద్యను రూపొందించాలి. ఈ రకంగా చేయడం వలన పిల్లల్లో కనిపించే విద్యావిషయక లోపాలను సరిదిద్దడానికి వీలు కలుగుతుంది.

విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి పరీక్షలతో నిమిత్తం లేకుండా వరుస ఉత్తీర్ణత విధానాన్ని అమలుపరచాలి. ఎనిమిదోతరగతి వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించరాదు. పరీక్షలు లేకుండా వరస ఉత్తీర్ణత విధానంలో విద్యార్థి ఎనిమిదవ తరగతి వరకు బాగా చదవాలంటే ఉపాధ్యాయులు నాణ్యమయిన విద్యాబోధన గావించాలి. విద్యార్థుల




ప్రతిభా సామర్థ్యాలను నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలి. సామర్థ్యం కలిగిన అధ్యాపకులకే ఇది సాధ్యం.

విద్యాహక్కు చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వం విద్యావిషయకమైన ప్రాధికార సంస్థను నియమిస్తుంది. ఈ సంస్థ ఉపాధ్యాయులకు అవసరమయిన అర్హతలను నిర్ణయిస్తుంది. ఈ అర్హతలు లేకుండా ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న అధ్యాపకులు ఐదు సంవత్సరాలలోగా ఈ అర్హతను పొందాలి. విద్యా విషయక ప్రాధికార సంస్థ ఉపాధ్యాయుల జీతభత్యాలు, సర్వీసు నిబంధనలకు సంబంధించిన నియమ నిబంధనలను రూపొందిస్తుంది. విద్యాహక్కు చట్టాన్ననుసరించి అధ్యాపకులు సక్రమంగా విధులకు హాజరుకావాలి. నిర్దిష్ట కాలవ్యవధిలో పాఠాలను బోధించాలి. పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని అంచనావేయాలి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా సదుపాయం కల్పించాలి. బాలల పురోగతికి సంబంధించిన అంశాలను తల్లితండ్రులకు లేదా సంరక్షకులకు తెలియచేయాలి. అవసరానుగుణంగా చట్టం నిర్దేశించిన ఇతర బాధ్యతలను కూడా ఉపాధ్యాయులు నిర్వర్తించాలి. తప్పుచేసిన ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన అంశాలను విద్యాహక్కు చట్టంలో ప్రస్తావించారు. ఏ పాఠశాలలోనూ నిర్ధారిత సంఖ్యలో పదిశాతానికి మించి ఉపాధ్యాయులు కొరత ఉండకుండా సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలి. విద్యాహక్కుచట్టం పొందుపరచిన అంశాల వల్ల విద్యార్థుల ప్రతిభా పాఠశాలను పెంపొందించడానికి వీలు కలుగుతుంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు అనేక విధులను అప్పగించడం వలన వారు విద్యాబోధన చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన అంశాన్ని విద్యాహక్కు చట్టంలో ప్రస్తావించారు. ఇకమీదట ఉపాధ్యాయులను జనాభా లెక్కల సేకరణకు, ఎన్నికల విధుల నిర్వహణ, అపత్ సమయాలలో సహాయక చర్యల అమలు వంటి పనులను నిర్వహించడానికి మాత్రమే ఉపయోగించాలి. ఉపాధ్యాయులు ప్రయివేటు ట్యూషన్లు చెప్పరాదని విద్యాహక్కు చట్టంలో పేర్కొనడం ఆహ్వానించదగ్గ పరిణామం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియమించే

విద్యావిషయక ప్రాధికార సంస్థ రాజ్యాంగంలో పేర్కొన్న విలువల కనుగుణంగా బాలుర విజ్ఞానాన్ని పెంపొందించి వారిలో ప్రతిభా పాఠశాలను వెలికితీసేలాగ, భయాందోళనలు తొలిగిపోయి వారిలో సంపూర్ణ శారీరక భౌతిక వికాసం కలిగేలా పాఠ్య ప్రణాళికను రూపొందించి, మూల్యాంకనం గావించాలి.

### తప్పనిసరిగా ఉచిత విద్య

బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి ఒడంబడికను రూపొందించింది. భారతదేశం ఒడంబడికపై సంతకం చేసింది. ఈ బడంబడిక ప్రకారం పద్దెనిమిది సంవత్సరాలలోపు వయస్సు కలిగిఉన్న వారందరికి విద్యను ఉచితంగా అందించవలసిన బాద్యత ప్రభుత్వంపై ఉంది. విద్యాహక్కు చట్టం ఆరు సంవత్సరాలలోపు పిల్లలను, 14 సంవత్సరాల వయస్సు పైబడిన పిలల్ని విస్మరించింది. అనేక పాఠశాలల్లో విద్యార్థులకు కనీస అవసరాలను తీర్చే సదుపాయాలు లేవు, అన్ని పాఠశాలల్లోను త్రాగునీటిని, మరుగుదొడ్లను, అవసరమయినన్ని తరగతి గదులను ఏర్పాటు చేయాలి. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేని కారణంగా బాలికలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల గైరు హాజరును తగ్గించడం కోసం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుపరచాలి. అన్ని పాఠశాలలకు పక్క భవనాలు నిర్మించాలి. ఎస్సీ, ఎస్టీ, బి.సి, విద్యార్థులకు సకాలంలో యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు అందించాలి. బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసిన అవసరం ఉంది. ఎందుచేతనంటే సుమారు యాభై శాతం మంది బాలికలు పాఠశాలల్లో చేరడం లేదు. పాఠశాలల్లో చేరిన బాలికల్లో ఎక్కువ మంది 12 సంవత్సరాల తరువాత బడి మానేస్తున్నారు. విద్యాహక్కు చట్టం ఈ పరిస్థితిలో మార్పు తేవాలి. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కొరత కారణంగా విద్యాహక్కు చట్టాన్ని అమలు పరచలేమంటున్నాయి. అందరికి ప్రాథమిక విద్య తప్పనిసరిగా అందజేయాలన్న నిబద్ధతను నిరూపించుకోవాలంటే ఈ చట్టం అమలుకు అవసరమయిన నిధులను కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మంజూరు చేయాలి.

### అక్షరాస్యత విషయంలో రాష్ట్రం వెనుకంజ

అక్షరాస్యత విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణ భారతదేశంలో చివరిస్థానంలో ఉంది. ఈ రకమయిన పరిస్థితికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ పాఠశాల విద్యకూ అవసరమయినన్ని నిధులు కేటాయించకపోవడం. కేంద్రం అందించే నిధులను సద్వినియోగించుకోవడంలో కూడా మనం విఫలమయ్యాము.

ఒక అంచనా ప్రకారం, మన రాష్ట్రంలో 97 వేల తరగతి గదుల కొరత ఉంది. ముప్పయి ఏడు వేలకు పైగా పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల వసతిలేదు. పదివేలకు పైగా పాఠశాలల్లో త్రాగునీటి వసతిని కల్పించలేదు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనకు గడచిన




రెండు మూడేళ్ళలో గావించిన ప్రయోగాలు సఫలీకృతం కాలేదు. ప్రభుత్వ అంచనాల ప్రకారం మన రాష్ట్రంలో విద్యనభ్యసించవలసిన ప్రాయంలో ఉన్న లక్షాపదిహేను వేలమంది బాలబాలికలు పాఠశాలలకు దూరంగా ఉన్నారు. ఈ పరిస్థితిలో మార్పును తేవడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో రూ. 300 కోట్ల వ్యయంతో 700 ఆదర్శ విద్యా సంస్థలను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ విద్యా సంస్థలలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ విద్యాబోధన జరుగుతుంది. రానున్న మూడు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా 4000 ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ మంత్రి ప్రకటించడం ముదావహం. ఇప్పటివరకూ ఏరకమయిన నియంత్రణ లేని రెసిడెన్షియల్ పాఠశాలల నియంత్రణకు ప్రభుత్వం అవసరమయిన చర్యలు గైకొన్నట్లు తెలుస్తోంది. మన రాష్ట్రంలో విద్యావ్యాప్తికి కృషిచేయాలన్న ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు తెరచిన అనంతరం జూన్ మొదటి వారంలో 'విద్యా పక్షోత్సవాలు' నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యా విషయాలకు సంబంధించిన పలు ముఖ్యమయిన అంశాలైన విద్యాహక్కు, మధ్యాహ్నభోజన పథకం, పాఠ్యపుస్తకాల పంపిణీ, సామూహిక అక్షరాభ్యాసం, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షాఅభియాన్ వంటి అంశాలపై దృష్టిని సారించడం అభినందనీయం. ఈ అంశాలను మరిచిపోకుండా విద్యా పక్షోత్సవాల అనంతరం కూడా గుర్తుంచుకుని వాటి అమలుకు కృషిచేయాలి. ముఖ్యంగా పాఠశాల విద్యకు ప్రాధాన్యతను కల్పించినప్పుడే విద్యాహక్కు చట్టంలో అందించినట్లుగా సమగ్ర విద్యావ్యాప్తి సంభవం. గత విద్యాసంవత్సరంలో విద్యాహక్కు చట్టాన్ని మనరాష్ట్రంలో అమలు చేయలేదు. ఈ విద్యాసంవత్సరంలో విద్యాహక్కు చట్టం మన రాష్ట్రంలో పూర్తిగా అమలవుతుందని ఆశిద్దాం.

**- డాక్టర్ పి. మోహన్‌రావు**

*అసోసియేట్ ప్రొఫెసర్ , రైల్వే డిగ్రీ కళాశాల, లాలాగూడ,, హైదరాబాద్*

# పల్లె కన్నీరు పెడుతోంది...

## కె.కె. భాగ్యశ్రీ



**'అమ్మకి సీరియస్‌గా ఉంది. మిమ్మల్ని చూడాలనుకుంటోంది. వెంటనే బయలుదేరి రండి.'**

**తమ ఊరి కరణం శివరామ్ ఫోన్ కాల్ వచ్చినప్పటి నుంచీ ఒకటే ఆందోళనగా ఉంది అన్నదమ్ములు ముగ్గురికీ.**

**వెంటనే ఒకళ్ళకొకళ్ళు ఫోన్‌లు చేసుకొని మాట్లాడు కొన్నారు.**

**''అమ్మకెలా ఉందోనని కంగారుగా ఉందిరా..'' అన్నాడు మీనాక్షమ్మ పెద్ద కొడుకు వీరశంకర్ తమ్ముళ్ళిద్దరితో.**

**"అవునన్నయ్యా... నాన్నపోయిన తరువాత ఎన్నో బాధలుపడి మనలనింతవారిని చేసింది.... " గద్గదికంగా అన్నాడు రెండో కొడుకు రమణ.**

"నేనిప్పుడే మా మేనేజర్‌ని సెలవడిగి బయలు దేరుతున్నాను" కబుర్లతో కాలాన్ని వృధా చేయడం ఇష్టం లేని మూడో కొడుకు ముకుంద్ అన్నాడు.

"అవునురా... మేమూ అదేపనిలో ఉంటాం" అన్నారు మిగిలిన ఇద్దరు కూడా.

వెంటనే ఇళ్లకు ఫోన్లు చేసి, భార్యాబిడ్డలను తయారుగా ఉండమని చెప్పి తలా నాలుగురోజులు లీవ్‌కి అప్లై చేసుకొని, తమ సొంత వాహనాల్లో బయలుదేరారు వెంటనే. ప్రయాణం సాగుతున్నంతసేపూ వారి మనసులు కలత చెందుతూనే ఉన్నాయి.

తండ్రి విశ్వనాథం మరణానంతరం ఆవిడ ఎన్నో కష్టనష్టాలకోర్చి పిల్లలను పెంచుకొచ్చింది. ముగ్గురూ కూడా తమ కాళ్ల మీద తాము నిలబడేలా తీర్చిదిద్ది ప్రయోజకుల్ని చేసింది.

వీరశంకర్, రమణ ఇద్దరూ ప్రభుత్వరంగ సంస్థల్లో ఉన్నతోద్యోగాల్లో ఉంటే, ఆఖరివాడు ముకుంద్ మాత్రం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

ముగ్గురికీ పెళ్ళిళ్లయ్యాయి. చదువుకున్న, సంస్కారవంతులైన, సంసారపక్షంగా ఉన్న కోడళ్ళని ఏరికోరి తెచ్చుకుంది మీనాక్షమ్మ. కొడుకులు ఉన్నత స్థాయిల్లో ఉన్నా తన మూల స్థానాన్ని మాత్రం విస్మరించలేదు.

ఏ నేల తల్లిని నమ్ముకొని తన భర్త నిత్య కృషీవలుడిగా జీవనం సాగించాడో... ఏ బంగారు భూమి ఆపత్సమయంలో ఆధారమై నిలచి తనకు పట్టెడన్నం పెట్టిందో... ఆ భూమినే ఇప్పటికి నమ్ముకొని బతుకుతున్న అచ్చమైన మహిళారైతు మీనాక్షమ్మ. ఈ వయసులోనూ పలుగుపార పట్టుకొని పొలానికి వెళ్తుంది ఆవిడ. కూలివాళ్లతో సమానంగా తానూ శ్రమిస్తూ, తన లాభాల్లో వాళ్లకు వాటా పంచుతూ వాళ్లని కన్నబిడ్డల్లా చూసుకుంటుంది.

ఆంధ్రరాష్ట్రంలో గల చాలా గ్రామాలు కరువు రక్కసి కబంధ హస్తాల్లో చిక్కుకుని, పండని పంటపొలాలతో, బీడువారిన భూములతో కళావిహీనంగా మారిపోయాయి. అతివృష్టి, అనావృష్టిల ప్రభావానికి సారవంతమైన భూములు కూడా దిగుబడినివ్వకుండా బిడ్డ -పాప లేక అల్లాడుతున్న స్త్రీ మూర్తుల్లా నిస్తేజంగా తయారవుతున్నాయి.

**కన్సొలేషన్ బహుమతి పొందిన గ్రామీణ కథ**

కాని, సుందరాపురం మాత్రం అక్కడక్కడ కనిపించే పచ్చదనంతో, అప్పుడప్పుడు కురిసే వర్షపు జల్లులని ఆధారంగా చేసుకొని పండే పంటలతో, కాస్తంత నీటినన్నా తమలో ఇముడ్చుకున్నామన్న గర్వంతో అలరారే చెరువులతో, 'పల్లె' అన్న తన అస్తిత్వాన్ని కొంచెమన్నా నిలుపుకుంది.

ఆ పల్లెనూ నిర్వీర్యం చేయడానికి, దాని ఉనికిని సమూలంగా నాశనం చేయడానికి కొందరు స్వార్థపరులు బయలుదేరారు. టోకున భూములు కొని వాటిని రొయ్యల చెరువులుగానూ, చేపల చెరువులు గానూ మార్చడానికి విపరీతంగా ప్రయత్నించారు కొందరు పట్నం బాబులు.

కాని, మీనాక్షమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా ఒకేమాట మీద నిలబడి మూకుమ్మడిగా వారిని తరిమికొట్టారు. పల్లె ఉనికిని నిలబెట్టారు.

గ్రామానికంతటికీ తలలో నాలుకలా నడుచుకునే మీనాక్షమ్మంటే ఆ ఊరి ప్రజలందరికీ దేవతతో సమానం. ఎవరికే కష్టం వచ్చినా 'తానున్నానంటూ' ఆదుకునే ఆపద్బాంధవి. ఊరంతటికీ తలమానికైన తమ మాతృమూర్తిని తలచుకుని గర్వంతో ఉప్పొంగిపోతారు ఆ తనయులు ముగ్గురూ కూడా.

అలాంటి తల్లికి ఇప్పుడు ఆరోగ్యం బాగాలేదంటే... గుండె కలిచివేస్తోంది వాళ్ళకి.

* * * * *

తెల్లతెల్లవారుతూ ఉండగా పల్లెపొలిమేరల్లోకి ప్రవేశించాయి వారు ప్రయాణిస్తున్న వాహనాలు. పుష్యమాసపు మంచు దట్టంగా అలముకుని ఉంది ఆ పరిసరాల్లో. ఎన్ని స్వెట్టర్లు, మంకీ కాప్స్ ధరించినా చలి తీవ్రతకి ఒళ్ళు బిగుసుకుపోతోంది. ఐసుగడ్డలా

ఆ ఉషోదయ సమయాన తోవలో ఉన్న బంతి, చేమంతి తోటలు పచ్చగా విరబూసి నేత్రానందాన్ని కలిగించడంతోపాటు, హరితవర్ణ రంజితమైన హేమంత ఋతుశోభను చాటిచెప్తున్నాయి.

దాదాపు ప్రతిముంగిలిలోనూ పేడనీళ్లతో కళ్ళాపుజల్లి. రంగు రంగుల రంగవల్లికలు వేయబడి ఉన్నాయి. ఒకపక్క చలిగాలికి ఒళ్లు కొయ్యబారిపోతున్నా, వారి మనసులు మాత్రం ప్రకృతి అందాలకి పరవశించిపోతున్నాయి. అంతలోనే మీనాక్షమ్మ ఆరోగ్యం గురించి దిగులు ములుకై వారి మదిని కెలుకుతోంది.

కార్లు మూడూ వెళ్లి మీనాక్షమ్మ ఇంటివాకిలిలో ఆగాయి. ఒక్క ఉదుటున కారు దిగి లోపలికి వెళ్ళారు వాళ్లు. వాకిట్లోనే వారికి ఎదురుపడింది ఆ ఇంటి పనిమనిషి వజ్రమ్మ.

''వజ్రమ్మా... అమ్మకెలా ఉంది?'' ఆమెను చూసి కంగారుగా ప్రశ్నించాడు వీరశంకర్.

''శానా దూరం పయనం సేసొచ్చారు. పెరట్లోకెల్లి కాల్లు సేతులు కడుక్కురండయ్యా...'' అతడగినదానికి సమాధానం చెప్పకుండా అంది వజ్రమ్మ.

''అబ్బబ్బ... వజ్రమ్మా... అత్తయ్యకెలా ఉందంటే కాళ్ళు చేతులు కడుక్కురండంటావేం?'' పెద్దకోడలు వసంత కసురుకుంది.

అదేం పట్టించుకోక ''ఎల్లండమ్మా...'' అంది వజ్రమ్మ చిరునవ్వుతో.

'అమ్మకి ఒంట్లో బాగా లేకపోవడంతో ఈ వజ్రమ్మకి మతి చలించినట్లుంది'. తల్లికి, ఆమెకి గల సాన్నిహిత్యాన్ని ఎరిగిన వారు జాలిగా అనుకుంటూ పెరట్లోకి దారితీశారు.

అప్పుడర్థమైంది వజ్రమ్మ తమతో అలా ఎందుకు చెప్పిందో. పెరట్లో కట్టెలపొయ్యి దగ్గర పెద్ద రాగి డేగిశాతో నీళ్లు కాస్తున్న మీనాక్షమ్మ కనబడింది వారి కళ్లకు. శివరామ్ వర్ణించినట్టుగా ఆమెలో అనారోగ్య లక్షణాలేమీ కనబడలేదు. పైపెచ్చు చాలా హుషారుగా, ఉత్సాహంగా కనబడుతోంది.

''అమ్మా...'' అయోమయంగా తల్లి చెంతకు నడుస్తూ పిలిచాడు వీరశంకర్.

''ఏరా శంకూ... బాగున్నావా?'' ఆప్యాయంగా పలకరించింది మీనాక్షమ్మ.

''మేం బాగానే ఉన్నాం కాని, శివరామ్ అన్నయ్యేంటి అలా ఫోన్ చేశాడు! నీకు ఒంట్లో బాగాలేదని, వెంటనే రమ్మని...'' ఆశ్చర్యంగా అడిగాడు రమణ.

''అవునురా... అలా అంటేగాని మీరు రారని నేనే అలా ఫోన్ చేయించాను'' మందస్మిత వదనంతో చెప్పింది మీనాక్షమ్మ.

''ఏంటమ్మా... ఈ కుఠ్రచేష్టలు! మేమెంత హడలిపోయామో తెలుసా? ప్రాజెక్టు మధ్యలో సెలవిచ్చేదిలేదని మా మేనేజర్ ఎంతగా భీష్మించాడో...'' కాస్త విసురుగా అన్నాడు ముకుంద్.

ఆ కోపతాపాలని పరిగణనలోకి తీసుకోలేదు మీనాక్షమ్మ. బిడ్డల ప్రవర్తనలో సహజత్వం ఉందనుకుందేమో. కోడళ్లు ముగ్గురికి మాత్రం సరదాగానే ఉంది. అక్కడికొస్తే మీనాక్షమ్మ వాళ్లని కన్నతల్లిలా చూసుకొని అన్నీ చేసి పెడుతుంది.

పిల్లలు పొయ్యి చుట్టూ మూగారు. వణికించేస్తున్న చలిని తరిమికొట్టేందుకు ఆ కట్టెల పొయ్యిలోంచొచ్చే వెచ్చదనాన్ని ఆశ్రయించారు వాళ్లు. ఎంచక్కా చలికాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఏ రూమ్ హీటర్లూ, ఫైర్ ప్లేస్‌లూ ఇవ్వలేని సహజమైన వెచ్చదనం అది.

''ఏంటమ్మా...మమ్మల్నింత కంగారు పెట్టేసి అలా నవ్వుతావేం?'' కస్సుబుస్సులాడాడు వీరశంకర్.

''మిమ్మల్ని అసౌకర్యానికి గురిచేస్తే నన్ను క్షమించడ్రా.... కాని, పండుగ కోసం మీరు ఇలా ఊరొచ్చి ఎన్నేళ్లయ్యిందో గర్తు చేసుకోండి. ఎప్పుడో వీలు కుదిరినప్పుడు ఆదరా బాదరా వచ్చి రెండు పూటలుండి పారిపోవడమే తప్ప, విశ్రాంతిగా, ప్రశాంతంగా ఎప్పుడన్నా గడిపారా?'' అడిగింది మీనాక్షమ్మ పాలేరు పిండి అందించిన పాల చెంబు అందుకుంటూ.

మరి నోరెత్తలేదు వీరశంకర్. అయోమయంగా బుర్రగోక్కున్నాడు ముకుంద్. ఆమె అన్నదాంట్లో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.

తమకి అవకాశం చిక్కినప్పుడు పిల్లలకి సెలవులు దొరక్కపోవడం, వాళ్లకి సెలవులిచ్చినప్పుడు తమకి కుదరకపోవడంతో గత నాలుగేళ్లుగా

పండగను పట్నంలోనే జరుపుకుంటున్నారు.

చిన్నతనంలో తాము అనుభవించిన ఈ మధురానుభూతులను తమ పిల్లలు 'మిస్ అవుతున్నారే' అన్న బాధ అప్పుడప్పుడు గుండె తొలిచేస్తున్నా... ఉద్యోగంలో ఇంకా మీదకి ఎగబాకాలన్న తపన తమని, ర్యాంకుల వేటలో నిరంతరం రేసుగుర్రాల్లా పరుగెడుతూ అందరికన్నా ముందుండాలన్న యాతన పిల్లలను పట్టిపీడించడంతో ఇలా పల్లెను దర్శించే వీలు చిక్కడం లేదు.

ఆ పరుగు అనివార్యమని తాము భావించడమే అందుకు కారణమని తెలిసినా ఏమీ చేయలేని అసహాయత వారిని ఆవరించింది. తిరిగి ఇన్నేళ్ల తరువాత తాము పుట్టిపెరిగిన ఆ పల్లెల్లో పండుగను జరుపుకోబోతున్నామంటే ఏదో తెలియని ఆనందంగా అనిపిస్తోంది. ఆ భాగ్యాన్ని తమకి అందించాలని తాపత్రయపడుతున్న తల్లి పట్ల గౌరవంతో మది నిండిపోయింది.

"పదండర్రా పిల్లలూ... స్నానాలు చేసి టిఫిన్లు చేద్దురుగాని. ఒరేయ్... శంకూ, రమణా, ముకుందూ ముఖాలు కడుక్కురండి. కాఫీ ఇస్తాను. అమ్మాయిలూ మీరు కూడా...." అంటూ చెప్తూనే లోపలికి నడిచింది మీనాక్షమ్మ చేతిలో పాలచెంబు సహితంగా.

అంతక్రితమే తీసుంచిన ఫిల్టర్ డికాక్షన్‌తో, తాజా పాలను కలిపి తయారు చేసిన కాఫీని ఒక్కో గుటకా చప్పరిస్తూ ఉంటే సాక్షాత్తు స్వర్గమే ఇలకు దిగి వచ్చిన అనుభూతి కలిగింది వారికి ఆ శీతకాల ప్రాతఃసంధ్యలో.

స్నానాలు పూర్తిచేశాక వేడివేడి దూదుల్లాంటి ఇడ్లీలు, రోట్లో రుబ్బిన కొబ్బరిపచ్చడి, కారప్పొడి వాటికి అనుపానంగా ఘుమఘుమలాడే ఆవు నెయ్యి... ప్రతిరోజు హడావుడిగా, ఉరుకులు పరుగులు నడుమ ఏదో తిన్నాంలే అనిపించే ఉదయపు అల్పాహారాన్ని అలా తీరుబడిగా కూర్చుని ఆరగిస్తూంటే చాలా హాయిగా అనిపించింది వాళ్లకి.

మధ్యాహ్న భోజనం కూడా అంతే కమ్మని రుచులను పంచింది వారికి. సాయంత్రమయ్యేసరికి పిల్లలకి, పెద్దలకి అందరికీ కూడా అంతక్రితమే చేసి డబ్బాల్లో దాచి ఉంచిన చిరుతిళ్లను పెట్టింది మీనాక్షమ్మ.

చేగోడీలు, మురుకులు, మినపసున్ని, లడ్డూ, కారప్పూస అసలు సిసలైన మజానిచ్చే ఆ చిరుతిళ్ళను గంతులు వేసి మీరీ తిన్నారు పిల్లలు.

"ఇవన్నీ ఎప్పుడు చేశారత్తయ్యా?" పటుక్కుమని ఓ చేగోడీని పంటకొరికి ప్రశ్నించింది చిన్న కోడలు శ్రీవాణి.

"మీరూ, పిల్లలు వస్తారని శివరామ్ భార్య లక్ష్మిని సాయం రమ్మని నేనే చేశాను".

తాను ఎంతో కష్టపడి చేసిన పిండివంటల రుచి, అందరి వదనాల్లో సంతృప్తిగా మారి ప్రతిఫలిస్తూంటే ఆ మాతృ హృదయం ఆనందంతో పొంగిపోయింది.

'అత్తయ్యకి తన సంతానమన్నా, వాళ్ల కన్న సంతానమన్నా ఎంత మక్కువో! అందుకే ఈ వయస్సులో కూడా రెక్కలు ముక్కలు చేసుకొని తన వాళ్ళకోసం ఇవన్నీ తయారు చేసింది' కళ్లు చెమర్చగా అనుకుంది మూడో కోడలు సరోజ.

ఇలా అందరి ఆనందోత్సాహాల నడుమ, అచ్చమైన పల్లె వాతావరణంలో... స్వచ్ఛమైన పండుగ సంబరాలు అంబరాన్నంటేలా జరిగాయి.

భోగిమంటలు, నీళ్ళపోతలు, పసిపిల్లలకు భోగిపళ్ళు పోయడాలు, గొబ్బెమ్మలు, హరిదాసుల సంకీర్తనలు, పెద్దలకు తర్పణాలు వదలడాలు, మకర సంక్రమణ పుణ్యకాలం దాటిపోకుండా ముత్తైదువలకు పసుపుకుంకుమలు పంచి పెట్టుకోవడాలు, కనుమనాడు పశువులకి పసుపుకుంకుమలద్ది పూజలు చేయడాలు, కనుమ స్నానాలాచరించడాలు... ఇలా అన్ని రకాల ఆర్భాటాలతో మూడు రోజులు పండుగ అత్యంత రమణీయంగా ముగిసింది.

ఈ నాలుగురోజులూ బొంగరంలా గిరగిరా తిరుగుతూ అందరికీ అన్నీ అమర్చిన మీనాక్షమ్మ వాళ్లు వెళ్లే సమయం దగ్గర పడడంతో స్తబ్దుగా తయారయ్యింది. పిల్లలు మళ్ళీ తననుంచి దూరంగా తరలిపోతారంటే ఏదో... గుబులుగా అనిపిస్తోంది. మనిషి కాస్త డీలా పడిపోయింది.

అది గమనించారు అందరూ.

"ఒరే రమణా... ఇన్నాళ్ళు మనం పెద్దగా అబ్జర్వ్ చేయలేదు కాని, ఈ సారి అమ్మెందుకో డల్‌గా కనిపిస్తోందిరా..." అన్నాడు వీరశంకర్ తల్లి వాలకం గమనించి.

"అవునురా అన్నయ్యా... అమ్మ ఇప్పటికే మన కోసం బాగా కష్టపడింది. ఇకనైనా అమ్మని సుఖపెట్టడం బిడ్డలుగా మన ధర్మం. అమ్మని మనతోపాటు తీసుకెళ్దాం..." సూచించాడు రమణ.

"అవునురా చిన్నన్నా... ఎప్పుడు రమ్మన్నా సరే ఏదో కారణం చూపి రానని కొట్టిపారేస్తోంది అమ్మ. ఈ సారి మాత్రం అమ్మ రానన్నా తీసుకెళ్ళే తీరాలి. ఆవిడకెక్కడ ఉండాలనిపిస్తే అక్కడ ఉంటుంది" అన్నాడు ముకుంద్.

వారి భార్యలు, పిల్లలు కూడా ఆ అభిప్రాయాన్నే బలపరచడంతో అందరూ కలిసికట్టుగా తల్లి దగ్గరకెళ్లి తమ ఉద్దేశ్యాన్ని ఏక స్వరంతో వినిపించారు.

మీనాక్షమ్మ ముఖం ఆనందంతో వెలిగిపోయిందొక్కసారి. తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటామంటున్న తన బిడ్డలను చూసి గర్వించింది ఆమె. ఈ రోజుల్లో ఎంతమంది కొడుకులిలా ఉంటున్నారు. ముసలివాళ్లని ఎందుకూ కొరగాని వాళ్లలా ట్రీట్ చేసే పిల్లలున్న ఈ రోజుల్లో అందుకు భిన్నంగా తనని ఆదరిస్తామంటున్న తన బిడ్డలు నిజంగా రత్నాలు.

"అమ్మ మీద మీరు కనబరుస్తున్న అభిమానానికి కృతజ్ఞతలురా పిల్లలూ... మీరు నా పట్ల కనబరుస్తున్న శ్రద్ధ చూస్తే ముచ్చటేస్తోంది. కాని, నేను మీతో రాలేకపోతున్నందుకు క్షమించండి" అంది పిల్లలను దగ్గరగా పొదువుకుంటూ.

"ఎందుకమ్మా... మా పంచన చేరితే నిన్ను చులకనగా చూస్తామని భయమా! లేకపోతే నిన్ను నిర్లక్ష్యం చేస్తామన్న దిగులా... ఎందుచేత నువ్వు మాతో రానంటున్నావు?" ఆవేదనగా ప్రశ్నించాడు వీరశంకర్.

"ఛ...ఛ... అదేం కాదురా... మిమ్మల్ని శంకించి నా పెంపకాన్ని నేను అవమానించుకోలేను" అంది మీనాక్షమ్మ పెద్దకొడుకు భుజం మీద చేయి వేసి లాలనగా తడుతూ.

"నిన్ను వదిలి ఉండాలంటే మా కెంత బాధగా ఉందో తెలుసా! కని

పెంచిన అమ్మని విడిచి ఉండాలంటే ఎంత కష్టంగా అనిపిస్తోందో...'' బుంగమూతి పెట్టి అమ్మ దగ్గర ముద్దులు గునిశాడు రమణ.

"మరి నేను మాత్రం మా అమ్మని విడిచి ఉండగలనట్రా?''

"మీ అమ్మా!'' ఆశ్చర్యపోతూ సంయుక్తంగా అరిచారు ముగ్గురూ.

"అవునురా... ఇన్నాళ్ళూ నన్ను పోషించి, నాకు పిడికెడన్నం పెట్టిన ఈ 'నేలతల్లే' మా అమ్మ...'' మీనాక్షమ్మ కంఠంలో ఏదో తాదాత్మ్యం నిండింది. తల్లికి ఆ పల్లెతోటి, ఆ మట్టితోటి గల అనుబంధం వాళ్ళకి తెలియనిది కాదు. కాని తమకి తల్లి మీదున్న ప్రేమాభిమానాలను ఆమెకు ఈ నేల మీదున్న ప్రేమాభిమానాలతో సరిపోల్చడం వాళ్ళకి నచ్చలేదు.

"ఏంటమ్మా నువ్వు! ఏదేదో మాట్లాడుతున్నావు? చేసినవాళ్ళు చాకిరీ చేశావు... ఇంకా ఈ భూమిని పట్టుకు వేలాడతాననంటావేంటి! పైగా మునుపటిలా దిగుబడులు కూడా ఏమంత ఆశాజనకంగా లేవు. రాత్రి పగలు ఒళ్ళు చితక్కొట్టుకున్నా పంట చేతికందుతుందో లేదో చెప్పలేని అనిశ్చిత పరిస్థితి. ఇంకా నువ్వూ నేలనే పట్టుకుని వేలాడతానని అనడం అవివేకం...'' ముకుంద్ లోని ఉడుకురక్తం అతడిని ఆవేశపడేలా చేసింది.

''అంటే.... ఉపయోగం లేని వస్తువుని వదిలించుకోవడమే ఉత్తమమంటావు...'' అడిగింది మీనాక్షమ్మ సూటిగా.

అవునన్నట్లు తలూపాడు ముకుంద్.

"అయితే... రేప్పొద్దున్న ఒంట్లో ఓపిక ఉడిగిపోయిన తరువాత... నా పరిస్థితి అంతేనన్నమాట!''

నిర్ఘాంతపోయారందరూ.

"ఎంతమాటన్నావమ్మా... నవమాసాలు మోసి, కనిపెంచిన నిన్నలా భావిస్తామా! కన్నతల్లిని విస్మరిస్తే పుట్టగతులుండవు మాకు...'' ముగ్గురు కొడుకులకీ కళ్లంట నీళ్ళు తిరిగాయి.

"ఎప్పుడో... చిన్నతనంలో పాలిచ్చి, మీకు సేవ చేసిన ఈ కన్నతల్లికి ద్రోహం చేయడం మహాపాపమని భావిస్తున్నారు. మీరు మరి కొన్నేళ్లపాటు నా వెతలు దీర్చి, అన్ని విధాలా నన్నాదుకున్న ఈ నేల తల్లిని విడిచిపెడితే నాకెంత పాపం చుట్టుకుంటుందో ఊహించారా!'' పదునుగా ప్రశ్నించింది మీనాక్షమ్మ.

ఏం చెప్పాలో తెలియక మౌనాన్నాశ్రయించారు వారు.

కాస్సేపాగి అన్నాడు ముకుంద్... "నువ్వన్నది నిజమే కావచ్చునమ్మా... కాని, ప్రస్తుతం రైతు పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఒక రైతుగా నీకు తెలియనిది కాదు. పండుతాయో, పండవో తెలియని పంటల కోసం ఆరాటపడుతూ ఇక్కడే ఉండడం దేనికి?'

తన ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్న కడసారపు కొడుకు తలని అప్యాయంగా నిమురుతూ "అందరు రైతులూ అలా భావిస్తే... మనం తినే ప్రతి బియ్యపు గింజనూ పక్క రాష్ట్రాల నుంచో, పొరుగు దేశాల నుంచో దిగుమతి చేసుకోవలసిన దుస్థితి ఏర్పడి ఉండేదెన్నడో... కష్టమో... నిష్టూరమో... రైతు తెగించి పంటలు పండించకపోతే మీలాంటి ఉద్యోగస్తులందరూ తిండెలా తింటారు? ఇక అనిశ్చితంటావా! అది ఏరంగంలో లేదు కనుక?

నీకు గుర్తుందా చిన్నోడా.. ఆ మధ్య అమెరికాలో ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం కారణంగా, ఇక్కడ నీ ఉద్యోగం ఎక్కడూడిపోతుందోనని ఒకటే కంగారు పడిపోయావు! ఎప్పుడో ఒకప్పుడు ఊడిపోతుందని నువ్వు నీ ఉద్యోగాన్ని వదిలేసి వచ్చేశావా? లేదు కదా! ఏనాటికైనా చక్కబడుతుందని అక్కడే ఓపిగ్గా ఎదురు చూస్తూ ఉన్నావు కదా...

రైతు అంతే... తాను నమ్ముకున్న పుడమి తల్లి ఏనాటికైనా తనను కరుణిస్తుందన్న ఆశతో... అక్కడే... ఆ పల్లెలోనే జీవిస్తాడు. అయినా అందరూ అలా అనుకొని పట్నాలకు తరలిపోతే భవిష్యత్తులో 'పల్లె' అన్న పదమే మనకు వినిపించదు. నిఘంటువులలో మాత్రమే మిగిలిపోతుంది.... గత వైభవానికి సాక్ష్యంగా.

'పల్లెలు దేశ సౌభాగ్యానికి పట్టుగొమ్మలు' అన్నారు జాతిపిత. అటువంటి పల్లె అభివృద్ధి చెందాలన్నదే నా ఆకాంక్ష...'' సుదీర్ఘంగా చెప్పినా మీనాక్షమ్మ మాటలలో మృదుత్వం ఉంది.

ఐదో తరగతి మాత్రమే చదువుకున్న ఆమెలో అంతటి విశ్లేషణా సామర్థ్యం ఉండడం చూసి ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టారందరూ.

''కాని, అమ్మా ఇప్పటిదాకా ఎంతగానో కష్టపడ్డావు... అందుకే నీకు విశ్రాంతినిద్దామన్న తలంపుతోనే అలా మాట్లాడడం తప్ప వేరే ఏ ఉద్దేశ్యమూ లేదు...'' నొచ్చుకున్నట్లుగా అన్నాడు వీరశంకర్ రుద్ధమైన స్వరంతో.

''మీ మంచితనానికి ఒక అమ్మగా చాలా సంతోషిస్తున్నానురా... ఇంకా నా ఒంట్లో ఓపికుంది. మరికొన్నాళ్లు శ్రమించగల సామర్థ్యముంది. అటుపైన ఆలోచిద్దాంలెండి.

ఇప్పటికే మన గ్రామాలు చాలా దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నాయి. ఆర్థికరంగంలో మొదలైన సంస్కరణల ప్రభావం పల్లెల మీద కూడా పడడం మీరు గమనిస్తూనే ఉన్నారు కదా... చాలా మంది భూములనమ్మేసుకొని పని కోసం వేరే తావులకు తరలిపోతున్నారు.

భగవంతుని దయవలన మన పల్లెకు ఆ ముప్పులేదు. ప్రకృతి దయ చేత కాస్తో కూస్తో పంటలు పండుతున్నాయి. అలాంటప్పుడు ఈ పల్లెని వదిలేసి వెళ్తే ఈ నేలతల్లి ఎంతగానో క్షోభిస్తుంది. లేనిచోట ఎలాగు లేదు... కనీసం పండే భూములన్నా పదికాలాల పాటు పచ్చగా ఉంచడం రైతన్న ధర్మం కాదా చెప్పండి!

కనిపించని కుట్రలకి దగా పడుతున్న ఈ ధరణిమాత ఎంతగా దుఃఖిస్తోందో కదా! అందుకే... నాకు ఓపికున్నన్నాళ్ళూ నేనీ నేలకోసం, నా పల్లెకోసం పరితపిస్తూనే ఉంటాను. నా తదనంతరం కూడా ఈ భూముల ను అమ్మే ప్రసక్తిలేదు. మన గ్రామంలోఉన్న రైతులే దీన్ని సాగు చేస్తారు... అలా అయితేనే ఈ నేలతల్లి సంతోషంగా ఉంటుంది. మరికొన్ని పల్లెలు సజీవంగా మిగులుతాయి'' స్థిరంగా పలికింది మీనాక్షమ్మ.

ఆమె వాదనలో ఉన్న వాస్తవికత, పటుత్వం ఆమె తనయులను మరి నోరెత్తనీయలేదు.

ఎక్కడనుండో 'పల్లె కన్నీరు పెడుతోంది... కనిపించని కుట్రల...' అంటూ పాట వినిపిస్తోంది.

☆

# తగ్గుతున్న గ్రామీణ జనాభా

**దేశంలో పట్టణీకరణ పెరిగి గ్రామీణ జనాభా తగ్గుతోంది. ఈ విషయం 2011లో నిర్వహించిన జనాభా లెక్కలలో ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. 2001 జనాభా లెక్కల ప్రకారం 27.81 శాతం ఉన్న పట్టణ జనాభా 2011 నాటికి 31.16 శాతానికి చేరింది. ఇదే సమయంలో గ్రామీణ జనాభా 72.19 నుండి 68.84 శాతానికి తగ్గిపోయింది. గత పది సంవత్సరాలలో జనాభా సగటున 17.64 శాతం పెరగగా, దానిలో 12.18 శాతం గ్రామీణ ప్రాంతాలలోను, 31.80 శాతం పట్టణ ప్రాంతాలలోను నమోదు అయింది.**

| జనాభా | 1901 | 1951 | 2011 |
|---|---|---|---|
| గ్రామీణ జనాభా | 89.2% | 82.7% | 68.8% |
| పట్టణ జనాభా | 10.8% | 17.3% | 31.2% |

1991 నుంచి గ్రామీణ జనాభా వృద్ధి రేటు తిరోగమనంలో పయనిస్తోంది.

### తగ్గిన వృద్ధి రేటు

1991-2001 మధ్య పదేళ్ళలో దేశ జనాభా సంఖ్య 21.5 కోట్లు పెరిగితే 2001-2011 మధ్య పదేళ్ళలో 17.6 కోట్లు మాత్రమే పెరిగింది. అంటే వృద్ధిరేటు 3.9 శాతం తగ్గింది. ఈ కాలంలో.. గ్రామీణ జనాభా వృద్ధి రేటు 5.9 శాతం తగ్గింది. కానీ పట్టణ జనాభా వృద్ధి మాత్రం 0.3 శాతం పెరిగింది. దీన్ని బట్టి మన పల్లెలు ఎంతగా కుచించుకుపోతున్నాయో, అదే సమయంలో పట్టణాలు ఎంత జనసమర్ధంగా మారిపోతున్నాయో తేలికగానే అర్థం చేసుకోవచ్చు. పల్లె జనాభా తగ్గి, పట్టణ జనాభా సంఖ్య పెరగటానికి పట్టణ సహజ వృద్ధితో పాటు..పల్లెల నుంచి పట్టణాలకు వలసలు గణనీయంగా పెరగటం, నగర శివారుల్లోని పల్లెలు కూడా క్రమేపీ పట్టణ రూపు సంతరించుకుంటుండటం ముఖ్య కారణాలు కాగా.. తాజా గణాంకాల్లో మరో ఆసక్తికరమైన విషయం ప్రస్ఫుటమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో కంటే కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు గ్రామాల్లోనే సమర్థవంతంగా అమలవుతుండటం కూడా పల్లె జనాభా తగ్గుతుండటానికి ఒక ముఖ్య కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2001-2011 మధ్య కాలంలో గ్రామాల్లో పిల్లల సంఖ్య 89 లక్షలు తగ్గగా, పట్టణాల్లో 39 లక్షలు పెరిగింది.

### మన రాష్ట్రంలో పెరిగిన పట్టణ జనాభా

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ జనాభా అనూహ్యంగా పెరిగిపోతోంది. జాతీయ సగటు ప్రకారం గత పదేళ్ళలో రాష్ట్ర జనాభా 11.10 శాతం పెరిగింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుదల కేవలం 1.64 శాతం మాత్రమే కాగా.. పట్టణాల్లో ఇది 36.26 శాతంగా నమోదైంది. 2001 లెక్కల ప్రకారం రాష్ట్రంలో పట్టణాల్లో 27.30 శాతం మంది నివసిస్తుండగా 2011 నాటికి అది 33.49 శాతానికి చేరింది.

| | మొత్తం | పురుషులు | స్త్రీలు |
|---|---|---|---|
| జనాభా | 8,46,65,533 | 4,25,09,881 | 4,21,55,652 |
| గ్రామీణులు | 5,63,11,788 | 2,82,19,760 | 2,80,92,028 |
| పట్టణవాసులు | 2,83,53,745 | 1,42,90,121 | 1,40,63,624 |

- వెయ్యిమంది పురుషులకు గ్రామాల్లో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 1047 మంది, రంగారెడ్డి జిల్లాలో 968 మంది మహిళ లున్నారు.
- వెయ్యిమంది పురుషులకు పట్టణాల్లో అత్యధికంగా విజయనగరం జిల్లాలో 1037 మంది, హైదరాబాద్ జిల్లాలో 943 మంది మహిళలు ఉన్నారు.
- ఆరేళ్ళలోపు బాలలు గ్రామీణ ప్రాంతాల్లో 10.39 శాతం కాగా పట్టణాల్లో 9.84 శాతం ఉన్నారు. అన్ని జిల్లాల్లో గత పదేళ్ళలో ఆరేళ్ళలోపు బాలల శాతం తగ్గింది.
- గ్రామీణ బాలల్లో వెయ్యి మంది బాలురకు, బాలికల సంఖ్య పశ్చిమగోదావరి తప్ప అన్ని జిల్లాల్లో తగ్గింది.
- పట్టణ బాలల్లో 3 జిల్లాలు తప్ప మిగతా అన్ని జిల్లాల్లో బాలికల సంఖ్య తగ్గింది.
- రాష్ట్రంలో అక్షరాస్యత శాతం : 67.66



- గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత శాతం : 61.44
- పట్టణాల్లో అక్షరాస్యత శాతం : 80.54
- రాష్ట్రంలో హైదరాబాద్ ఒక్కటే పూర్తిగా పట్టణ జనాభా ఉన్న జిల్లా. ఇతర జిల్లాలను పరిశీలిస్తే, రంగారెడ్డి జిల్లాలో 70.32 శాతం పట్టణ జనాభా ఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలో 15 శాతమే ఉన్నారు.

### పెరిగిన అక్షరాస్యత :

2011 జనాభా లెక్కల ప్రకారం చదువుల్లో పల్లెలు ముందున్నాయి. గత పదేళ్ళలో అక్షరాస్యత శాతం దేశవ్యాప్తంగా సగటున 68.8 నుంచి 74 శాతానికి పెరిగింది. 9.2 శాతం వృద్ధి రేటు నమోదైంది.

ఈవృద్ధిరేటు పట్టణ ప్రాంతాల కంటే గ్రామాల్లోనే అధికం కావడం విశేషం. 2001 లెక్కల్లో గ్రామీణ అక్షరాస్యత శాతం 58.7 శాతం ఉండగా 2011 నాటికి అది 68.9 శాతానికి చేరింది. అంటే 10.2 శాతం వృద్ధి నమోదైంది. పట్టణ అక్షరాస్యత 79.9 నుంచి 85 శాతానికి చేరి కేవలం 5.1 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లో ఇది 12.7 శాతం వృద్ధి చెందింది. రెట్టింపు వృద్ధి నమోదు అయింది. 2001లో పట్టణ - గ్రామీణ అక్షరాస్యతల మధ్య 21.2 శాతం తేడా ఉండగా 2011నాటికి అది 16.1 శాతానికి తగ్గిపోయింది.

అక్షరాలు నేర్వడంలో పురుషుడు ఒకడుగు వేస్తే మహిళలు రెండడుగులు ముందుకేస్తున్నారు. గత పదేళ్ళలో పురుషుల అక్షరాస్యత సగటు 6.8 శాతం పెరిగితే మహిళల సగటు 11.8 శాతం వృద్ధి చెందింది. ఈ విషయంలో పట్టణ వాసుల కంటే గ్రామీణులే ముందున్నారు. 2001-2011మధ్య కాలంలో పట్టణ పురుషుల్లో అక్షరాస్యత 3.4 శాతం పెరిగితే గ్రామాల్లో అది 7.9 శాతం ఉంది. అదే విధంగా పట్టణ మహిళల్లో అక్షరాస్యుల సంఖ్య 7 శాతం పెరిగితే గ్రామీణ ప్రాంతాల్లో ఇది 12.7 శాతం వృద్ధి చెందింది.




## రాష్ట్ర జనాభా - 2011
### ( జిల్లాల వారీగా)

| క్ర.సం | జిల్లా | మొత్తం | గ్రామీణ | పట్టణ |
|---|---|---|---|---|
| 1. | అదిలాబాద్ | 2,737,738 | 1,979,912 | 757,826 |
| 2. | నిజామాబాద్ | 2,552,073 | 1,964,273 | 587,800 |
| 3. | కరీంనగర్ | 3,811,733 | 2,817,507 | 994,231 |
| 4. | మెదక్ | 3,031,877 | 2,303,756 | 728,121 |
| 5. | హైదరాబాద్ | 4,010,238 | 0 | 4,010,238 |
| 6. | రంగారెడ్డి | 5,296,396 | 1,572,032 | 3,724,364 |
| 7. | మహబూబ్‌నగర్ | 4,042,191 | 3,435,768 | 606,423 |
| 8. | నల్గండ | 3,483,648 | 2,821,905 | 661,743 |
| 9. | వరంగల్ | 3,522,644 | 2,524,498 | 998,146 |
| 10. | ఖమ్మం | 2,798,214 | 2,142,540 | 655,674 |
| 11. | శ్రీకాకుళం | 2,699,471 | 2,263,124 | 436,347 |
| 12. | విజయనగరం | 2,342,868 | 1,852,446 | 490,422 |
| 13. | విశాఖపట్టణం | 4,288,113 | 2,250,655 | 2,037,458 |
| 14. | తూర్పుగోదావరి | 5,151,549 | 3,836,952 | 1,314,597 |
| 15. | పశ్చిమ గోదావరి | 3,934,782 | 3,126,191 | 808,591 |
| 16. | కృష్ణ | 4,529,009 | 2,671,718 | 1,857,291 |
| 17. | గుంటూరు | 1,889,230 | 3,232,485 | 1,656,745 |
| 18. | ప్రకాశం | 3,392,764 | 2,730,648 | 662,116 |
| 19. | శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | 2,966,082 | 2,103,773 | 862,309 |
| 20. | వై.యస్.ఆర్ | 2,884,524 | 1,900,788 | 983.736 |
| 21. | కర్నూల్ | 4,046,601 | 2,902,877 | 1,143,724 |
| 22. | అనంతపురం | 4,083,315 | 2,936,359 | 1,146,956 |
| 23. | చిత్తూరు | 4,170,468 | 2,941,581 | 1,228,887 |
| | ఆంధ్రప్రదేశ్ | 84,665,533 | 56,311,788 | 28,353,745 |

| అంశం | 2001 | 2011 |
|---|---|---|
| పట్టణ జనాభా శాతం | 27 | 33.49 |
| గ్రామీణ జనాభా శాతం | 73 | 66.51 |
| వెయ్యి మంది పురుషులకు మహిళలు | | |
| గ్రామాల్లో | 983 | 995 |
| పట్టణాల్లో | 965 | 984 |

| పురుషులు, మహిళల మధ్య అక్షరాస్యత వ్యత్యాసం శాతం | | |
|---|---|---|
| గ్రామాల్లో | 19.85 | 18.19 |
| పట్టణాల్లో | 14.45 | 10.97 |
| మహిళల్లో అక్షరాస్యుల శాతం | | |
| గ్రామాల్లో | 43.50 | 52.05 |
| పట్టణాల్లో | 68.74 | 75.02 |

## జిల్లాల వారీగా జనాభా గణాంకాలు

| క్ర. సం. | జిల్లా | జనాభా - 2011 మొత్తం | పురుషులు | స్త్రీలు | దశాబ్ద వృద్ధిరేటు | | లింగ నిష్పత్తి | | జనసాంద్రత | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| | ఆంధ్రప్రదేశ్ | 84665533 | 42509881 | 42155652 | 14.59 | 11.10 | 978 | 992 | 277 | 308 |
| 1. | అదిలాబాద్ | 2737738 | 1366964 | 1370774 | 19.47 | 10.04 | 989 | 1003 | 154 | 170 |
| 2. | నిజామాబాద్ | 2552073 | 1252191 | 1299882 | 15.12 | 8.80 | 1017 | 1038 | 295 | 321 |
| 3. | కరీంనగర్ | 3811738 | 1897068 | 1914670 | 14.96 | 9.16 | 998 | 1009 | 295 | 322 |
| 4. | మెదక్ | 3031877 | 1524187 | 1507690 | 17.64 | 13.55 | 974 | 989 | 275 | 313 |
| 5. | హైదరాబాద్ | 4010238 | 2064359 | 1945879 | 21.74 | 4.71 | 933 | 943 | 17649 | 18480 |
| 6. | రంగారెడ్డి | 5296396 | 2708694 | 2587702 | 40.09 | 48.15 | 944 | 955 | 477 | 707 |
| 7. | మహబూబ్‌నగర్ | 4042191 | 2046247 | 1995944 | 14.20 | 15.03 | 972 | 975 | 191 | 219 |
| 8. | నల్గొండ | 3483648 | 1758061 | 1725587 | 13.88 | 7.26 | 966 | 982 | 228 | 245 |
| 9. | వరంగల్ | 3522644 | 1766257 | 1756387 | 15.15 | 8.52 | 973 | 994 | 253 | 274 |
| 10. | ఖమ్మం | 2798214 | 1393936 | 1406278 | 16.39 | 8.50 | 975 | 1010 | 161 | 175 |
| 11. | శ్రీకాకుళం | 6299471 | 1340430 | 1359041 | 9.33 | 6.38 | 1014 | 1014 | 435 | 462 |
| 12. | విజయనగరం | 2342868 | 1161913 | 1180955 | 6.55 | 4.16 | 1009 | 1016 | 344 | 358 |
| 13. | విశాఖపట్టణం | 4288113 | 2140872 | 2147241 | 16.66 | 11.89 | 985 | 1003 | 343 | 384 |
| 14. | తూర్పుగోదావరి | 5151549 | 2569419 | 2582130 | 7.93 | 5.10 | 993 | 1005 | 454 | 477 |
| 15. | పశ్చిమగోదావరి | 3934782 | 1963184 | 1971589 | 8.13 | 3.45 | 991 | 1004 | 491 | 508 |
| 16. | కృష్ణా | 4529009 | 2268312 | 2260697 | 13.22 | 8.15 | 978 | 997 | 480 | 519 |
| 17. | గుంటూరు | 4889230 | 2441128 | 2448102 | 8.72 | 9.50 | 984 | 1003 | 392 | 429 |
| 18. | ప్రకాశం | 3392764 | 1712735 | 1680029 | 10.88 | 10.90 | 971 | 981 | 174 | 192 |
| 19. | పొట్టిశ్రీరాములు నెల్లూరు | 2966082 | 1493254 | 1472828 | 11.55 | 11.15 | 984 | 986 | 204 | 227 |
| 20. | వైఎస్సార్ కడప | 2884524 | 1454136 | 1430388 | 14.78 | 10.87 | 974 | 984 | 169 | 188 |
| 21. | కర్నూలు | 4046601 | 2040101 | 2006500 | 18.72 | 14.65 | 965 | 984 | 200 | 229 |
| 22. | అనంతపురం | 4083315 | 2064928 | 2018387 | 14.34 | 12.16 | 958 | 977 | 190 | 213 |
| 23. | చిత్తూరు | 4170468 | 2083505 | 2086963 | 14.86 | 11.33 | 982 | 1002 | 247 | 275 |

• లింగ నిష్పత్తి ( వెయ్యి మంది పురుషులకు ఉన్న మహిళలు)

**- డాక్టర్ సి. కృష్ణమోహనరావు**
*సెంటర్ హెడ్, రీసెర్చ్ & ట్రైనింగ్*

# నిరుద్యోగ యువతకు వరం

## గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు

**భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలలో నిరుద్యోగ సమస్య ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత జాబ్‌మార్కెట్‌లోనికి ప్రవేశిస్తున్నారు. కానీ సరియైన ఉపాధిని పొందలేక పోతున్నారు. మనదేశంలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలకు, వాటికి అవసరమైన అభ్యర్థుల సామర్థ్యాలకు మధ్య చాలా అగాధం ఉంది. ఇటువంటి పరిస్థితులలో నిరుద్యోగ యువతకు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.**

అంతేగాక స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలపై శిక్షణనివ్వవలసిన అవసరం కూడా ఉంది. ఒకసారి సరియైన శిక్షణను పొందిన యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడమే కాక, లాభదాయకమైన పరిశ్రమలను స్థాపించి, జీవన విధానాన్ని మెరుగు పరచటం, జాతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు తోడ్పడటం వంటివి చేయగలుగుతారు. దేశ విదేశాలలోని వలు రంగాలలో కూడా వీరు సేవలను అందించవచ్చు.

యువతలో నిరుద్యోగ సమస్య తీవ్రతను తగ్గించే ఉద్దేశ్యంతో 1982వ సంవత్సరంలో కర్నాటక రాష్ట్రంలోని ధర్మస్థల దగ్గరలో ఉజిరే వద్ద శ్రీమంజునాథ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, సిండికేట్ బ్యాంక్, కెనరాబ్యాంక్ సంయుక్త నిర్వహణలో "గ్రామీణ అభివృద్ధి మరియు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ"ను (RUDSETI) నెలకొల్పడం జరిగింది. ఈ సంస్థ ముఖ్యలక్ష్యం గ్రామీణ నిరుద్యోగ యువతకు సరియైన ప్రోత్సాహాన్ని అందించి, వివిధ ట్రేడ్‌లలో ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ, మార్గదర్శకత్వం ఇవ్వటం పరిశ్రమల స్థాపన, ఉద్యోగ అవకాశాలకు తోడ్పాటు నందించడం.

ప్రస్తుతం ఈ సంస్థ 14 రాష్ట్రాలలో 24 యూనిట్లను స్థాపించింది. ఈ సంస్థ నుండి శిక్షణ పొందిన వారిలో ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా అవార్డు పొందిన వారున్నారు. ఇప్పటివరకు 2.41 లక్షల మంది యువతకు శిక్షణ నివ్వడం జరిగింది. వీరిలో 1.69 లక్షల మంది స్వయం ఉపాధి వెంచర్ల ద్వారా స్థిర పడ్డారు. 70% సెటిల్‌మెంట్ రేటు, నాణ్యతతో కూడిన సేవలద్వారా ఈ సంస్థ ఎన్నో అవార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ దృష్టిని కూడా ఆకట్టుకుంది. ఈ సంస్థ సాధించిన విజయాల స్ఫూర్తితో దేశంలోని అన్ని జిల్లాలలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇదే తరహా సంస్థలను నెలకొల్పాలని భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ నిశ్చయించింది. ఈ క్రమంలో నెలకొల్పబడ్డవే గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు (RSETIS).

### గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు

- RUDSETI విజయాల స్ఫూర్తితో, అదే భావనతో ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బ్యాంకులచే నిర్వహించబడుతున్న సృష్టి RSETI.
- కేంద్ర ప్రభుత్వం ప్రతి RSETI కి భవన నిర్మాణం, ఇతర వసతుల కోసం ఒక కోటి రూపాయలు మంజూరు చేస్తుంది. భవన నిర్మాణాన్ని బ్యాంకు చేపడుతుంది.
- రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని బ్యాంకుకు లీజుకు ఇస్తుంది.
- స్పాన్సరింగ్ బ్యాంకు ఈ సంస్థ నిర్వహణను చేపడుతుంది. స్థల కేటాయింపు, భవన నిర్మాణం పూర్తయేలోపు ఈ సంస్థ కార్యకలాపాలను అద్దె భవనాలలో నిర్వహించవచ్చు.



**ఈ సంస్థ లక్ష్యాలు :**

- యువతకు స్వయంఉపాధి ఏర్పాటుకు అవసరమైన నైపుణ్యాలను శిక్షణ ద్వారా అందించడం.
- దారిద్ర్యరేఖకు దిగువనున్న గ్రామీణ యువతకు ప్రాముఖ్యత నివ్వడం.
- శిక్షణ పొందే వారికి ఉచిత భోజన వసతి ఏర్పాటు కల్పించడం.
- డిమాండ్ కనుగుణమైన శిక్షణ నివ్వడం. అభ్యర్థి వైఖరిని బేరీజు వేసిన తర్వాతనే తదనుగుణంగా శిక్షణనందించడం.
- బ్యాంకుల నుండి క్రెడిట్ లింకేజి ఏర్పాటు.
- సూక్ష్మ పరిశ్రమలను స్థాపించే ట్రైనీలకు 2 సం॥ల వరకు ఎస్కార్టు సర్వీసులను అందించడం.

## సిబ్బంది...

- స్పాన్సర్డ్ బ్యాంకు నుండి స్కేల్ II లేదా III స్థాయి ఆఫీసరు, గ్రామీణ బ్యాంకులలో పనిచేసిన అనుభవం కల్గిన వారిని డెప్యూటేషన్‌పై ఈ సంస్థ డైరక్టరుగా నియమిస్తారు.
- సపోర్టింగ్ ఫ్యాకల్టీ బ్యాంకు నుండి డెప్యుటేషన్‌పై కానీ లేదా కాంట్రాక్టు పద్ధతిపై గానీ నియమిస్తారు. NIRD నుండి కూడా రూరల్‌డెవలవ్‌మెంట్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్‌లను నియమించవచ్చు.

## మౌలిక వసతులు....

- ప్రతి RSETI లో ఈ క్రింది కనీస వసతులు ఉంటాయి.
- 2-3 తరగతి గదులు (టాయిలెట్ సౌకర్యంతో)
- 2 వర్క్‌షాపులు, 2 డార్మిటరీలు, కిచెన్, డైనింగ్‌హాల్
- డైరెక్టర్ రూం, అడ్మినిస్ట్రేటరీ రూం, స్టోర్‌రూం, 2 గెస్ట్ రూంలు
- 3స్టాఫ్ క్వార్టర్లు (ఒకటి డైరక్టర్, రెండు స్టాఫ్ కొరకు), రిసెప్షన్ కౌంటర్, కామన్ రూం,

## శిక్షణా కార్యక్రమ వివరాలు

స్థానిక అవసరాల కనుగుణంగా డిమాండ్ ఉన్న రంగాలలో నిర్వహించవలసిన శిక్షణా కార్యక్రమాలు సంస్థచే నిర్వహించబడుతాయి. శిక్షణా కార్యక్రమం పాఠ్య ప్రణాళిక అన్ని సంస్థలలో ఒకే విధంగా ఉండేలా నోడల్ ఏజన్సీ అయిన RUDSETI, జాతీయ గ్రామీణాభివృద్ధి తోడ్పాటుతో రూపొందిస్తుంది. అన్ని RSETI లలో 2 రకాలైన శిక్షణా పాఠ్యప్రణాళికలు ఉంటాయి.

1. స్వర్ణజయంతి గ్రామేస్వరోజ్‌గార్ యోజన పథకానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల గ్రూపులకు బేసిక్ ఓరియంటేషన్ కార్యక్రమాలు.
2. సూక్ష్మ పరిశ్రమలు, వేతన ఉపాధి / ప్లేస్‌మెంట్‌కు సంబంధించిన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు.

సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనింగ్ అన్ని శిక్షణా కార్యక్రమాలలో అంతర్భాగంగా ఉంటుంది. బ్యాచ్‌సైజ్ 20-30 మంది అభ్యర్థులతో ఉంటుంది. గ్రామీణ అభ్యర్థులను శిక్షణకు స్పాన్సర్ చేసే బాధ్యత DRDA కు స్పాన్సరింగ్ బ్యాంకు బ్రాంచీలకు ఉంటుంది. కనీసం 70% మంది అభ్యర్థులు గ్రామీణ ప్రాంతానికి చెంది దారిద్ర్యరేఖకు దిగువనున్న వారై ఉండాలి. వీరికి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ DRDA ద్వారా స్పాన్సర్ బ్యాంకులకు ఒక అభివృద్ధికి ఒక రోజుకు రూ. 200 చొ॥న 4 వారాల శిక్షణకు గరిష్టంగా రూ. 4000/-, 4 వారాల మించి వ్యవధి గల శిక్షణకు రూ. 5000/- అందజేస్తుంది. బలహీన వర్గాలకు, స్త్రీలకు, అంగవైకల్యం గల వారికి SGSY మార్గదర్శకాల ననుసరించి రిజర్వేషన్ ఉంటుంది.

## శిక్షణ అంశాలు

ఒక ఆర్థిక సంవత్సరంలో 30-40 నైపుణ్య అభివృద్ధి కార్యక్రమలు RSETI లలో జరుగుతాయి. దాదాపుగా అన్ని కార్యక్రమాలు 1 నుండి 6 వారాల వ్యవధిలో ఉంటాయి.

ఈ క్రింది రంగాలలో శిక్షణా కార్యక్రమాల నిర్వహించబడుతాయి.

**1. వ్యవసాయ, అనుబంధ కార్యక్రమాలు:** డైరీ, పౌల్ట్రీ, ఎపికల్చర్, పండ్లతోటల పెంపకం, సెరికల్చర్, పుట్టగొడుగుల పెంపకం, పూలతోటల పెంపకం, ఫిషరీస్ మొ॥నవి.

**2. ఉత్పత్తి కార్యక్రమాలు :** డ్రస్ డిజైనింగ్, అగరుబత్తీ తయారీ, పుట్‌బాల్ తయారీ, బ్యాగ్‌లు, బేకరీ ఉత్పత్తులు, లీఫ్‌కప్ తయారీ, పేపరీ రీసైక్లింగ్, రెగ్జిన్ వస్తువుల తయారీ మొదలైనవి.

**3. ప్రోసెస్ ప్రోగాంలు :** ద్విచక్ర వాహనాల రిపేరు, రేడియో / టి.వి. రిపేర్లు, మోటారు రీవైండింగులు, ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు, వ్యవసాయ పంపుసెట్టు రిపేరు, ట్రాక్టరు మరియు పవరు టిల్లర్ రిపేర్, సెల్‌ఫోన్ రిపేరు, బ్యుటీషియన్ కోర్సు, ఫొటొగ్రఫీ, వీడియోగ్రఫీ,స్క్రీన్ ప్రింటింగ్, ఫొటో లామినేషన్, గృహవిద్యుత్ ఉపకరణాల రిపేరు, కంప్యూటర్ హార్డువేరు, డిటిపి.

**4. ఇతర కార్యక్రమాలు :** స్త్రీలకు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, లెదర్, నిర్మాణం, హాస్పిటాలిటికి సంబంధించిన రంగాలలో స్థానిక అవసరాలకు అనుగుణమైనవి.

**- బొల్లినేని శ్రీలక్ష్మి**
**ఫ్యాకల్టీ మెంబర్, సిడిపిప, అపార్డ్**

**భూకంపాల తీవ్రత ఓ అసాధారణ స్కేలు ఆధారంగా కొలుస్తారు. దీనిపై అతి సూక్ష్మ నుంచి భారీ సూచీలుంటాయి. ఆరు అంతకంటే ఎక్కువ తీవ్రత కలిగిన భూకంపాలను ప్రబల భూకంపాలుగా పరిగణిస్తారు. వీటి వల్ల అపార నష్టం సంభవిస్తుంది. ఏడు అంతకంటే ఎక్కువ తీవ్రత గల భూకంపాలను విధ్వంసక భూకంపాలుగా పిలువవచ్చు. స్కేల్లో ఒక్క యూనిట్ తేడాతోనే భూకంప శక్తిలో చాలా తేడా వుంటుంది. తీవ్రత 7 ఉన్న భూకంపాల తీవ్రత 5 గల భూకంపాల కంటే సుమారు వెయ్యి రెట్లు శక్తివంతమైనది.**

భూకంపం సంభవించే సమయంలో పశు, పక్ష్యాదులు విపరీతంగా ప్రవర్తిస్తాయని పరిశోధనలో తేలింది.

* కుక్కలు అదే పనిగా అరుస్తున్నా
* పశువులు మేత మేయడానికి నిరాకరిస్తున్నా
* గుర్రాలు అశ్వశాల నుంచి బయటకు ఉరికేందుకు ప్రయత్నిస్తున్నా నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే జాగ్రత్త పడాలి.

ఇవి సలహాలకు, సహాయాలకు ఉపయోగపడతాయి.

*భూకంపం సంభవించినప్పుడు లోపల ఉంటే తీసుకోవలసిన జాగ్రత్తలు-*

* శబ్దం చేయకుండా ఉండాలి.
* గాజు కిటికీలకు, ద్వారాలకు, అల్మెరాలకు, అద్దాలకు దూరంగా ఉండాలి.
* మంచం క్రింద గానీ, టేబుల్ క్రింద గానీ ఉండాలి. అలా ఉండటం వల్ల ఏమైనా రాలి పడే వస్తువుల వల్ల దెబ్బతినే ఛాన్స్ ఉండదు.

*భూకంపం సంభవించినప్పుడు వెలుపల ఉంటే తీసుకోవలసిన జాగ్రత్తలు-*

* మైదానం ప్రదేశాలకు వెళ్ళాలి.
* ఎత్తయిన భవనాలు, చిమ్నీలు, ఏవైనా ఎత్తుగా ఉన్న భవంతుల పరిధిలో ఉండరాదు.
* వీధులలో తిరగరాదు. హోర్డింగుల దగ్గర, విద్యుత్ దీపాల దగ్గర ఉండరాదు.

# భూకంప విపత్తు సమయంలో మెళకువలు

నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ 2004లో హిందూ మహాసముద్రంలో సునామి వచ్చినప్పుడు జంతువులు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళినట్లు గుర్తించాయి. వీటికి శాస్త్రీయ ఆధారం పూర్తిగా లేనప్పటికీ వీటిపై పరిశోధన జరగవలసిన అవసరం ఎంతైనా వుంది.

మానవుని వినికిడి సామర్థ్యం 20-20,000 హెర్జ్ ఉంటుంది. కానీ జంతువుల వినికిడి సామర్థ్యం చాలా సూక్ష్మంగానూ, అధికంగాను ఉండటం బట్టి అవి ప్రకృతిని సంబంధించిన తేడాలను చాలా సునిశితంగా పసిగట్టగలవు.

భూకంపాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన మెళకువలను ప్రజలను విశదీకరించాలి. అవి-

* దెబ్బతిన్న ప్రదేశాలలో గుంపులు గుంపులుగా మూగరాదు.
* నీటిని వృధా చేయకూడదు బాగా దెబ్బతిన్న వ్యక్తులను కదల్చరాదు. (వైద్య బృందం వచ్చేవరకు)
* వదంతులకు దూరంగా ఉండాలి. అవి ఉన్న సమస్యను జటిలం చేస్తాయి.
* చిన్న చిన్న దెబ్బలు తగిలిన వారికి మెడికల్ ఎయిడ్ ఇవ్వాలి. దారులను క్లియర్ చేసి, ఎమర్జెన్సీ సర్వీసును ఉపయోగించు కునేటట్లు చేయాలి.
* కరెంటును సంబంధించినవన్నీ వెంటనే ఆర్పివేయాలి. గ్యాసు సిలిండరును కూడా ఆపివేయాలి.
* బ్యాటరీతో పనిచేసే ఎలక్ట్రికల్ అప్లియన్సులు ఎప్పుడు తయారుగా ఉంచుకోవాలి.

బ్యాటరీ ఆపరేటడ్ రేడియోలు ఎప్పుడూ తయారుగా ఉంచుకోవాలి.

*ప్రతిపౌరుడు విధిగా మూడు నెంబర్లను తెలుసుకోవాలి అవి-*

* పోలీసు వ్యవస్థ సహాయానికి - 100
* అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సహాయానికి -101
* ఎమర్జెన్సీ అంబులెన్స్ సేవకు - 108

*ప్రతీ వ్యక్తి, కుటుంబం విధిగా ఈ సూచనలు పాటించాలి.*

* ఎలక్ట్రికల్ ఫ్యూజ్ బాక్స్, నీటి సంపు మెయిన్, నాచురల్ గ్యాస్ మెయిన్ తప్పనిసరిగా ఇంటి వ్యక్తులకు తెలిసేట్లు జాగ్రత్త చేసుకోవాలి.
* ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ సంచులలో భద్రపరచుకోవాలి.
* ఎప్పుడూ కనీసం నెలకు సరిపడా వస్తువులను ముందుగా సేకరించుకోవాలి.
* ఎల్లప్పుడూ 3 రోజులకు సరిపడా నీరు, ఆహారం (పాడు అవని) తయారుగా ఉంచుకోవాలి.

*ఫస్ట్ ఎయిడ్ అందరూ తెలుసుకోవాలి.*

* ప్రాథమిక చికిత్సకు సంబంధించిన కిట్‌ను దగ్గర వుంచుకోవాలి.
* భూకంపం సంభవించినప్పుడు తీసుకొనవలసిన జాగ్రతలపై అవగాహన కలిగి ఉండాలి.
* భూకంపం సంభవించే పరిసరాలలో నివసించే ప్రజలకు ఈ విపత్తుపై అవగాహన కలిగించటం, అప్రమత్తంగా ఉండటానికి సరిపడే నాలెడ్జ్ ఇన్‌పుట్ ఇవ్వడం, ప్రభుత్వం బాధ్యతగా భావించాలి.

*- డా॥ నిర్మలాదేవి*

*ఫ్యాకల్టీ, సి.యమ్.ఇ.డి. విభాగం*

# చిత్తూరుకు విస్తరించిన 'కీ క్యాప్'

**అపార్డు హైదరాబాద్ వారు చేపట్టిన కీ-క్యాప్ కార్యక్రమం క్రింద చిత్తూరు జిల్లాలో చంద్రగిరి మండలంలోని కొటాల గ్రామం, కొంపిచెర్ల గ్రామాలు, తవకంపల్లె మండలంలోని దిగువ మాఘం గ్రామ పంచాయితీలు ఎంపిక చేయబడి 23-5-2011 నుండి 9-6-2011 వరకు అపార్డులో జరిగిన శిక్షణలో రెండు విడతలుగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు శిక్షణ తీసుకోవడం జరిగింది. కొటాల గ్రామ పంచాయితి నుండి 29 మంది, కొంపిచెర్ల గ్రామ పంచాయితీ నుండి 6 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు మూడు రోజులపాటు 7-6-2011 నుండి 9-6-2011 వరకు శిక్షణ పొందటం జరిగింది.**

సదరు శిక్షణలో అపార్డు కమీషనర్ వారు యిచ్చిన స్ఫూర్తితో ఆ వాలంటీర్లు 11-6-2011 వ తేదీన కొటాల గ్రామంలో సమావేశమై గ్రామంలో తొలుత పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని తీర్మానించి ప్రతివారూ రూ. 1000/- చొప్పున విరాళం ప్రకటించి జెసిబి నియమించుకొని మెయిన్ రోడ్డు నుండి గ్రామంలోనికి రహదారి రిపేరు చేసుకొని రోడ్డు ప్రక్కన గల ముళ్ళపొదలను తొలగిస్తున్నారు.

- గ్రామ పంచాయితీలోని చెత్తా చెదారం తొలగించారు.
- గ్రామ పంచాయితీ కార్యాలయం, అంగన్‌వాడి, లైబ్రరి, ప్రాథమిక పాఠశాలలకు సున్నం వేయించడం చేశారు.
- పబ్లిక్ కుళాయిల వద్ద, చేతిబోర్ల వద్ద ప్లాటు ఫారాలు శుభ్ర పరిచారు.
- గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయించి 310 మందికి హెచ్.బి. లెవెల్స్ తీయించారు.
- ప్రతి యింటికి వెళ్ళి వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం గురించి తెలియజేశారు.
- 1-2-2011 నుండి గ్రామంలో మద్య నిషేధం పాటించాలని తీర్మానించారు.

కొటాల భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కార్యక్రమాన్ని గమనించి ఇంకా వారిని ఉత్తేజ పరచాలన్న సంకల్పంతో అపార్డు కమీషనర్ వారి కార్యాలయంలో పనిచేసే సెంటర్ హెడ్‌లతో 18-6-2011 వ తేదీన సమావేశం నిర్వహించారు కొటాల మండలం రుంపిచెర్ల గ్రామ పంచాయితీలో లాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో జరిపిన గ్రామ సభలకు వీరు హాజరైనారు.

ఈ సందర్భంగా శ్రీ కూర్మారావు, సెంటర్ హెడ్ సి.ఎస్ఆర్.ఎం. ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించడం జరిగింది. తదుపరి ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణరెడ్డి, సెంటర్ హెడ్, సి.డి.పి.ఎ. మట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజలు అందరు ఐకమత్యంతో వుండాలని సూచించారు. శ్రీ సి. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్, కమీషనర్, అపార్డు మాట్లాడుతూ, కొటాల గ్రామ పంచాయితీ, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ఐకమత్యం, కృషిని కొనియాడారు. అదే స్ఫూర్తితో ప్రజల భాగస్వామ్యంతో పనిచేసి గ్రామాన్ని జిల్లా, రాష్ట్రంలోనే గాక దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం క్రింద ఎంపిక చేయబడిన 78 గ్రామ పంచాయితీల వాలంటీర్లను కొటాల గ్రామ పంచాయితీకి తీసుకొచ్చి చూపించడం జరుగుతుందని తెలియజేసారు.

తదుపరి కమీషనర్, వారి కార్యాలయపు సెంటర్ హెడ్స్ కొటాల గ్రామం పంచాయితీలో రాత్రి బసచేసి ప్రజలతో కూడా ముఖాముఖి మాట్లాడారు తాను 1975 వ సం॥లో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ స్టూడెంటుగా వున్నప్పుడు కొటాల గ్రామ పంచాయితీలో జరిగిన క్యాంపులో 3 నెలల పాటు యన్.యస్.యస్. వాలంటీరుగా చేసిన అనుభాన్ని నెమరు వేసుకుంటూ, అదేస్ఫూర్తితో ప్రస్తుతం తనకు వచ్చిన ఈ అవకాశంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంచిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు కూడ సహకరించాలని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శ్రీ సి. చంద్రమౌళి, ఐ.ఎ.యస్. కమీషనర్‌తో పాటు గ్రామ సభలో ప్రొ॥ కె.ఆర్. సూర్యనారాయణరెడ్డి, శ్రీ కూర్మారావు, శ్రీ శివశంకర్‌ప్రసాద్, శ్రీ మోహన్‌రావు, శ్రీ సుభాష్‌చంద్రగౌడ్, శ్రీ రాజశేఖర్, ఐ.టి.సి. వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సుబ్బారావు, వారి ఫ్యాకల్టీ మెంబర్లు శోభన్‌బాబు, ప్రశాంతి, క్రిష్ణయ్య, ఎం.సి.డి.బి. సుశీల, డి.టి.ఎం.లు, సర్పంచి మదన్‌మోహన్, పంకా రఘుపతి, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పాల్గొన్నారు.

**పి. నాగరాజు, డి.టి.ఎం.**
**జిల్లా పరిషత్ ట్రైనింగ్ సెల్, చిత్తూరు**

# త్యాగమూర్తి మహర్షి బులుసు సాంబమూర్తి

**ఎందరో మహనీయుల త్యాగ ఫలంగా మనం స్వరాజ్యం సంపాదించాం. కాని సురాజ్యం ఏర్పడలేదని నాటి నాయకులు తమ అసంతృప్తిని వెలిబుచ్చుతుంటారు.**

దేశ స్వాతంత్ర్యం కోసం సర్వసుఖాలను సంపదలను త్యాగం చేసిన మహనీయులలో చిరస్మరణీయులు, 'మహర్షి' బులుసు సాంబమూర్తి. సాంబమూర్తి తూర్పుగోదావరి జిల్లా దుళ్ళ గ్రామంలో సనాతన సంప్రదాయ కుటుంబంలో 4-3-1886న (మహా శివరాత్రి నాడు) జన్మించారు. తండ్రి సుబ్బావధాని వేద విద్యానిధి. సంపన్నకుటుంబం. 1909లో పట్టభద్రులై కొంతకాలం విజయనగరం మహారాజా కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేశారు. స్వతంత్రంగా జీవించాలన్న ఆశయంతో బి.ఎల్. పరీక్షలో ఉత్తీర్ణులై కాకినాడలో న్యాయవ్యాదిగా జీవితాన్ని ఆరంభించారు...

1911లో న్యాయవాదిగ పేరు గడించి, త్వరలోనే జిల్లాలోనే గొప్ప క్రిమినల్ లాయర్‌గా పేరు గడించారు. ప్రతి నెలా వేలాదిగ సంపాదన వుండటంతో, జిల్లాలోని పెద్ద కోర్టులలో కేసులను చేపట్టి రెండు చేతులా సంపాదించారు. మోటర్ సైకిల్ పై కోర్టులకు వెళ్తుండే వారు. పేరు ప్రఖ్యాతులతో పాటు పుష్కలంగా సంపాదించేవారు. అడిగిన వారందరికీ ఉదారంగా ఆర్థిక సహాయం చేస్తూ గొప్ప దాతగా కీర్తి గడించారు. రాజమండ్రి కోర్టులో విచారణలోవున్న సత్యవోలు గున్నేశ్వరరావు గారిపై జరుగుతున్న కోర్టులో గున్నేశ్వర రావు గారి పరంగా వాదించుటకు మద్రాసు నుండి టంగుటూరి ప్రకాశం పంతులు వచ్చారు. సాంబమూర్తి, ప్రకాశం పంతులకు సహాయకుడుగా పనిచేసి కేసులో విజయం సాధించారు. వృత్తి రీత్యా ప్రారంభమైన వారి స్నేహం రాజకీయాలలో శాశ్వతమై జీవితాంతం కొనసాగింది.

1885లో కాంగ్రెస్ సంస్థ ప్రారంభింపబడింది ప్రతి సంవత్సరం దేశంలోని వివిధ ప్రాంతాలలో కాంగ్రెస్ మహాసభలు ప్రముఖుల అధ్యక్షతన జరుగుతూ వచ్చాయి. కాకినాడలో జరిగిన మహాసభలో దేశభక్త కొండా వెంకటప్పయ్య, న్యాయవాదులు కోర్టులను బహిష్కరించాలని గొప్ప ఉపన్యాసం చేశారు. సభలో వున్న సాంబమూర్తి లేచి, నేను న్యాయవాది వృత్తి మానుకొని దేశ సేవచేయ నిశ్చయించినట్లు ప్రకటించారు.

కాకినాడలో 1923లో కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. సాంబమూర్తి ప్రధాన కార్యదర్శిగా అతివైభవంగా నిర్వహించారు. అప్పటి కలెక్టరు జిల్లాలోని రైతు పెద్దలను పిలిపించి కాంగ్రెస్ సంస్థకు విరాళాలు ఇవ్వవద్దని ఆదేశించారు. సాంబమూర్తి మహాసభల నిర్వహణకు ప్రజల నుండి 1,20,682 రూపాయలు సేకరించారు. 12 వేల మందికి సరిపోయే పెద్ద డేరా వేయించారు. జాతీయ నాయకులకు 36 కుటీరాలు, కుటుంబాలతో వచ్చిన నాయకులకు 150 కుటీరాలు నిర్మింపచేశారు. 1500 మంది వాలంటీర్లు పనిచేశారు.

కాకినాడ జగన్నాథపురం పనువారి వీధిలో నివశిస్తుందన శ్రోత్రియబ్రాహ్మణుడు కాశీభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి తన ఇంటి ముందు వెళ్తున్న కాంగ్రెస్ అధ్యక్షుల ఊరేగింపు మధ్యలో వెళ్ళి అధ్యక్షులుగా వుండిన మహ్మమ్మదాలీ సోదరుల సోదరులను నమాజు చేసుకోవడానికి ఆహ్వానించారు. ఆలీ సోదరులు ఆయన కోరికను మన్నించారు. అది హిందూ ముస్లిమ్ సమైక్యతకు సాక్ష్యం. మహాసభలు 1923 డిసెంబరు 28 నుండి 1924 జనవరి 1వ తేది వరకు జరిగాయి.

మహాసభల ప్రారంభానికి కొన్ని రోజుల ముందు సాంబమూర్తి ఏకైక పుత్రుడు అకస్మాత్తుగ చనిపోయాడు. అయినా సభలు బ్రహ్మాండంగా జరిగాయి. భారత కవి కోకిల సరోజినీ నాయుడు, సాంబమూర్తి గుండె నిబ్బరాన్ని ప్రశంసిస్తూ, కుమారుని పొగొట్టుకొన్న దుఃఖాన్ని విస్మరించి దేశ సేవలో నిమగ్నమైన స్థిత ప్రజ్ఞులు బులులు సాంబమూర్తి అని సభలో ప్రకటించారు. గాంధీజీ ఆదేశం మేరకు ఆంధ్రలో కూడా ఉప్పు సత్యాగ్రహం ముమ్మరంగా జరిగింది. సాంబమూర్తి అందులో పాల్గొన్నందుకు 18.4.1930న అరెస్టు చేశారు.

వేలూరు జైలులో సాంబమూర్తితో పాటు ప్రకాశం, పట్టాభి, అయ్యదేవర కాళేశ్వరరావు రాజాజీ మొదలగు నాయకులుండేవారు 4.1.1932న కాకినాడ టౌన్‌హాల్‌లో బహిరంగ సభ జరిగింది. సాంబమూర్తి అధ్యక్షులుగా ఉపన్యసిస్తున్నారు. సరిగా ఆ సమయానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డప్పుల సుబ్బారావు, సాంబమూర్తిని లాఠీతో నెత్తిన మొత్తుతూ, నీకు స్వరాజ్యం కావాలా? ఇదిగో స్వరాజ్యం అంటూ లాఠీతో బాదాడు. కానిస్టేబుల్ ముస్తఫా ఆలీ కూడా లాఠీతో కొట్టారు సాంబమూర్తి 'శంభో' అంటూ నేల కూలాడు. పోలీసులు అతని ఛాతీపై కూడా కొట్టారు. అట్టి ప్రాణాపాయ దశలో మిత్రులు, దయానందరాజు, పారుపూడి సత్యనారాయణ తమ ప్రాణాలు వదిలి, సాంబమూర్తిని రక్షించారు. 1937 - 39 మధ్య సాంబమూర్తి మద్రాసు అసెంబ్లీ స్పీకర్‌గా వున్నారు తనను లాఠీతో బాదిన డప్పుల సుబ్బారావు, ముస్తఫా ఆలీలను తమ గదికి పిలిపించారు. ఈ రోజు నేను స్పీకర్‌గా వున్నాను. మీ రాక్షసకాండను ఆనాడు అనుభవించాను. మీకు తగిన శిక్ష విధింపగలను. కాని నేను గాంధీయ వాదిని. క్షమిసున్నానంటూ వారికి గుర్తు చేశారు.

సాంబమూర్తి స్పీకరు పదవిని చేపట్టినా మోకాళ్ళ వరకు పరచె, (చొక్కాలేదు) అంగవస్త్రంతో ఉండేవారు. సాంబమూర్తి సభా మర్యాదను కాపాడుతూ, బరువైన బాధ్యతలను న్యాయశాస్త్ర కోవిదులుగా భారతదేశ 'స్పీకర్'లలో అగ్రగణ్యులుగా పేరుగడించారు. ఆంధ్రోద్యమంలో పాల్గొన్నారు. మద్రాసు నగరంపై ఆంధ్రులకు హక్కు వున్నదని చివరిదాకా పోరాడారు. 1951లో ప్రకాశం కాంగ్రెస్‌ను వదలి ప్రజాపార్టీ స్థాపించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజాపార్టీ అభ్యర్థిగా తాను పెరిగిన కాకినాడ నుండి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటికే రాజకీయాలలో ధన, కుల, ప్రాబల్యం పెరిగింది. సంపాదించినదంతటినీ దాన ధర్మాలు చేసి, చివరి దశలో దారిద్ర్యమనుభవించారు. భార్య సుభద్రమ్మ మరణంతో ఒంటరి వారయ్యారు. కేంద్రమంత్రి గోవింద వల్ల భవంత్ సాంబమూర్తిగారికి కొంత పైకం పంపారు.

రాజ భోగాలను అనుభవించిన సాంబమూర్తి శివుడిలా మారి, దేవాలయాలకు వెళ్ళి బిచ్చగాడిలా నిలబడినారు. మిత్రుతలో మాట్లాడుతూ 'నేను శివరాత్రినాడు జన్మించాను. అందుకే సాంబుడు' అని మా పెద్దలు నామకరణం చేశారు. విభూతి పెట్టారు. నేను విభూతి తప్ప, సిరిసంపదలూ నిల్వచేసుకోకూడదు. (మహర్షి బులుసు సాంబమూర్తి జీవిత చరిత్ర - వాడ్రేవ వెంకటేశ్వరరావు

భోగిగా జీవించిన సాంబమూర్తి తన సర్వస్వాన్ని దేశం కోసం ధారపోసి, యోగిగా జీవితం గడిపి 2-2-1958లో శివ సాయుజ్యం చెందారు.

\- జానమద్ది

# గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపటానికి కృషి చేసిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు ప్రతిభా పురస్కారాలు









**కీ క్యాప్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో విద్య, వైద్య, ఆరోగ్య, త్రాగునీరు, పారిశుద్ధ్యం, తదితర రంగాలలో గణనీయమైన మార్పుని తీసుకొనిరావటానికి కృషిచేసిన భారత్‌నిర్మాణ్ వాలంటీర్లకు ప్రతిభాపురస్కారాలు అందచేయటానికి అపార్డ్ నిర్ణయించిందని అపార్డు కమీషనరు కె. చంద్రమౌళి బి.ఏ.ఎస్ తెలిపారు.**

29.07.2011న మహబూబ్‌నగర్, జిల్లా ఫరూక్‌నగర్ మండలం దూసేకల్ పంచాయితీలో జరిగిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న అపార్డు కమీషనర్ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేసి ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకొని రావటానికి గ్రామస్థాయిలో స్వచ్ఛందంగా పనిచేసే యువతను భారత్‌నిర్మాణ్ వాలంటీర్లగా కీ క్యాప్ కార్యక్రమంలో ఏంపిక చేయటం జరిగిందని, దూస్‌కల్ గ్రామం నుండి 33 మందికి అపార్డులో శిక్షణ అందచేయటం జరిగిందని అన్నారు. శిక్షణ పొందిన వాలంటీర్లు ఇప్పటికే గ్రామంలో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలను ఎంచుకొని స్వచ్ఛందసేవ చేయటం ప్రశంసనీయమని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 78 గ్రామాలలోని సుమారు 2000 మంది బి.ఎన్.విలు ఇప్పటికే గ్రామాలలో మార్పుకు శ్రీకారం చుట్టారని, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ద్వారా సమాచారం వేగంగా ఇచ్చి పుచ్చుకొనేందుకు అపార్డులో ప్రత్యేకంగా బల్క్ SMS వ్యవస్థను ఏర్పరచి సమాచారాన్ని చేరవేయిటం జరుగుతోందని చెప్పారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్ల తరపున జ్యోతిర్మయి మాట్లాడుతూ, గ్రామంలో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించటానికి, 45 మంది BNV లు ప్రతి ఒక్కరు రూ 50/- చొప్పున విరాళాలు వేసుకొని జనుపనార సంచులను గ్రామంలోని 678 కుటుంబాలకు అందచేయాలని నిర్ణయించు కున్నామని తెలియచేసారు. మరో బి.ఎన్.వి. పి. యాదయ్య మాట్లాడుతూ, గ్రామంలో సంపూర్ణ మద్యపానం పాటించే విధంగా కృషిచేయాలని సంకల్పించినట్లు, గ్రామసర్పంచ్, వార్డు సభ్యులలో ఇప్పటికే చర్చించినట్లు తెలియచేసారు.

గ్రామ పంచాయితీ సెక్రటరీ వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, కీక్యాప్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయటానికి పంచాయితీ పాలకవర్గం ఇప్పటికే నిర్ణయించినదని, BNV లకు పంచాయితీ పూర్తి సహకారం అందచేస్తుందని తెలియచేసారు. అపార్డు ప్రచురించే 'స్థానికపాలన' మాసపత్రికలో పొందుపరిచే సమాచారం గ్రామాభివృద్ధికి బాగా ఉపయోగపడుతోందని సెక్రటరీ వెంకటయ్య గౌడ్ అపార్డ్ కమీషనర్ దృష్టికి తీసుకొని వచ్చారు. మరొక బి.ఎన్.వి నరసింహా మాట్లాడుతూ, తాను వికలాంగుడనయిప్పటికీ, కార్యక్రమం స్ఫూర్తితో స్వచ్ఛందసేవకు ముందుకు వచ్చాననీ, కరీంనగర్ జిల్లా రామచంద్రపూర్ పంచాయితీలా తమ గ్రామంలో కూడా వివిధ గ్రామ కమిటీలు, గ్రామ మంత్రివర్గ ఏర్పాటు లాంటివి ఏర్పాటు చేయటానికి కృషి చేస్తామని అన్నారు. గ్రామంలో ఇప్పటికే నిర్మించిన నీటి శుద్ధి యంత్రం ద్వారా 70 శాతం కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయినీ, మిగిలిన 30% మందికి కూఆడా సురక్షిత త్రాగునీటి సరఫరాకు కృషి చేస్తామని తెలియచేసాడు. గ్రామపెద్దలు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బి.ఎన్.వి.లకు గ్రామ పెద్దలంతా సహకరించి గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు.

భారత్‌నిర్మాణ్ వాలంటీర్ల నిర్ణయాలను గూర్చి విన్న అపార్డు కమీషనరు మాట్లాడుతూ, దూస్‌కల్ గ్రామంలోని BNVల స్ఫూర్తి అభినందనీయమని, BNVలను వెన్నుతట్టి ప్రోత్సహించినట్లయితే మంచి ఫలితాలను తీసుకొని రాగలరనే ఆశాభావాన్ని వ్యక్త పర్చారు. బి.ఎన్.వి.లలో స్ఫూర్తి కల్గించటానికి చిత్తూరు జిల్లా కొటాల గ్రామపంచాయితీకి విజ్ఞాన పర్యటనకు పంపుతామని, అదే విధంగా గ్రామంలోని BNVలలో నైపుణ్యాలను పెంపొందించే నిమిత్తం ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ అందచేస్తామని చెప్పారు. దూస్‌కల్ గ్రామం ప్రభుత్వ కార్యక్రమాలను వినియోగించుకొని ప్రగతి పథంలో పయినించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి. అరుంధతి, జిల్లా పరిషత్తు సి.ఇ.ఓ శ్రీ రాజేశ్వరరావు, ఇటిసి రాజేంద్రనగర్ ప్రిన్సిపాల్ డిప్యూటీ కమీషనర్ శ్రీ రంగా, ఫ్యాకల్టీ సభ్యులు ప్రమీలారాణి, అపార్డు డిప్యూటీ డైరక్టర్లు, డా. కృష్ణమోహన్, సుభాష్ చంద్రగౌడ్, ఫ్యాకల్టీ సభ్యులు కూర్మారావు, డా.వి.పి.ఎస్. ప్రసాద్‌లు పాల్గొన్నారు.







# ఎన్‌టిపిసి సీనియర్ అధికారులకు 'అపార్డ్' శిక్షణ

## పారిశ్రామిక అవసరాల కోసం మానవీయ కోణంలో భూసేకరణ జరపాలి - అపార్డ్ కమీషనర్

**పారిశ్రామిక అవసరాలకోసం భూమిని సేకరించే పనులలో నిమగ్నమైన అధికారులు మానవీయ దృక్కోణంతో ఆలోచించి విధులు నిర్వర్తిస్తే ప్రజాస్పందన సహకారం మెండుగా లభించటమేకాక వారి పని సులభతరమవుతుందని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి అన్నారు.**

జూలై 21 నుండి 23 వరకు అపార్డులో ఎన్.టి.పి.సి. అధికారులకు భూసేకరణ చట్టం, 1894 మరియు సహాయ పునరావాస విధానాలపై జరిగిన సమావేశాన్ని ప్రారంభించిన అపార్డు కమీషనరు మాట్లాడుతూ, రైతుకు భూమికి మధ్య అనుబంధం విడదీయరానిదని, జీవనోపాధిని కల్పించే భూమిని వదులుకోవటానికి ఏ రైతూ మన స్ఫూర్తిగా ముందుకు రారని, కానీ భూమిని ప్రభుత్వానికి ఇవ్వటం ద్వారా వారు జాతి నిర్మాణంలో భాగస్వామ్యులవుతున్నారనే భావన కలుగచేసిన నాడు అధికారుల పని సులభమవుతుందని, భూ సేకరణతో పాటు పునరావాస కల్పనకు కూడా ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎన్.టి.పి.సి. సోదర సంస్థ అయిన పవర్ మేనేజింగ్ సంస్థ (పి.యం.ఐ.) మేనేజర్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ఉన్న శిక్షణా సంస్థలను సంప్రదించగా భూసేకరణ చట్టాలపై అపార్డు ఇచ్చే శిక్షణ అత్యుత్తమమైనదని తెలియవచ్చినదని అందుకే న్యూఢిల్లీ, బీహార్, ఛత్తీష్‌ఘడ్, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, సిక్కిం, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌ల నుండి 32 మంది అధికారులను అపార్డుకు తీసుకొనిరావటం జరిగిందని అన్నారు.

శిక్షణలో పాల్గొన్న అధికారులకు అపార్డ్ ల్యాండ్ సెల్ సీనియర్ కన్సల్టెంట్ శ్రీ అంబరీష్, ఐ.ఏ.యస్. (రిటైర్డ్). కన్సల్టెంట్ వెంకటేశ్వరరావు తదితరులు భూసేకరణ చట్టంలోని వివిధ నిబంధనలపై అవగాహన కలుగచేసారు.

# మహనీయురాలు మదర్ థెరిసా



**మూర్తీభవించిన సేవగా యుగోస్లోవియాలోని స్కోపిలో అల్బేనియా జాతి దంపతులు దోండానిగ్రాస్, బొజాక్లువాలకు 10.8.1910 జన్మించారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయారు. ఆమెకు తనకంటే ఆరేళ్ళు పెద్దదైన అక్క మూడేండ్లు పెద్ద అయిన అన్న వుండేవారు. తల్లి అల్లిక పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించేది. బాల్యం నుండి చదువుపట్ల ఆసక్తి కల బాలిక థెరిసా సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తితో ఐర్లండు వెళ్ళారు.**

అక్కడ రెండు మాసాలుండి కొంత ఇంగ్లీష్ నేర్చుకొని 1929 , జనవరి 6న బెంగాల్‌లోని హౌరా చేరారు. డార్జిలింగ్ కాన్వెంటులో రెండేళ్ళుండి ఇంగ్లీష్, బెంగాలీ భాషలు, నేర్చుకొని, కలకత్తా చేరి ఆగ్నస్‌గా వున్న తన పేరు మార్చుకుని థెరిసా పేరు పెట్టుకున్నారు. కలకత్తాలోని లోర్టో కాన్వెంటులో 17 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేవారు. 1937లో మదర్ థెరిసా అయ్యారు.

సేవే తన జీవితాశయంగా ఎంచుకుని కలకత్తానగర మురికివాడలో చిన్న బడి ప్రారంభించారు. బాధలో ఉన్న వారిని, వికలాంగులను చేరదీసి 'నవజీవన్' అనే ప్రత్యేక మందిరం ప్రారంభించారు. ఎయిడ్స్ బాధితులకు మద్యపానానికి బానిసలైన వారికోసం ఒక కేంద్రం ప్రారంభించారు. అనాథ శిశువులకోసం నిర్మల శిశు భవన్ ప్రారంభించారు. దయగల హృదయమే దేవాలయం అన్నారు.

కలకత్తాలోని కాళీ దేవాలయం సమీపంలో నిర్మల్ హృదయ్ పేరుతో సేవాకేంద్రం ప్రారంభించారు. ఒక రోజు ఆసుపత్రి సమీపంలో థెరిసా, మరొక సిస్టర్‌తో వెళ్తూ వుండగా దారిలో చిరిగిన గుడ్డల మూట కనబడింది. అందులో మధ్యవయస్కురాలైన మహిళ వ్యాధితో ఉంది. ఆమెను ఆసుపత్రికి తెసుకెళ్ళింది. థెరిసా హృదయం ద్రవించింది. ఆ అనుభవంతోనే నిర్మల్ హృదయ్ సేవా సంస్థను ప్రారంభించారు. మన దేశంలోనే కాక విదేశాల్లో కూడా సేవా సంస్థలు స్థాపించింది. అందులేని సేవ లందించిన మాతృమూర్తి ఆమె. కొన్ని సేవా వివరాలు:

### ప్రతి రోజు ఆహారమందుకొనేవారు ఎందరో!

1. కుష్టు కేంద్రాలు 119, వాటిలో సేవలందుకునేవారు 1,82,948 మంది.
2. సంచార వైద్యశాలలలు 745, సేవలందుకొన్నవారు 15,69,821
3. అనాథ బాలల పునరావాస కేంద్రాలు 103, అందులో 4260 బాలలకు పోషణ.

ప్రపంచంలోనే గొప్ప మహిళగా పేరు గడించారు. ఏ దేశంలో సేవలు అవసరమైనా, తన సిస్టర్‌లతో సేవలందించేవారు.

అవిశ్రాంత సేవల కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. 1997, మార్చి 13న సిస్టర్ నిర్మలకు బాధ్యతలప్పగించారు. సెప్టెంబర్ 5 రాత్రి జీసస్ చిత్రపటాన్ని చూస్తూ కన్నుమూశారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు జరిగాయి. మానవతా మూర్తిగా, సేవాపరాయణురాలిగా 70 ఏండ్లు భారత దేశంలో జీవించిన మదర్ థెరిసా 1948లో భారత పౌరసత్వం స్వీకరించారు. జీవితమంతా సేవలో గడిపిన ధన్యజీవి మదర్ థెరిసా. అనాథ శిశువుల కోసం ఢిల్లీలో బాలభవనం ప్రారంభించారు. ఈ భవనాన్ని ప్రధాని నెహ్రూ ప్రారంభిస్తూ, థెరిసా సేవలను ప్రశంసిస్తూ ప్రపంచ వ్యాప్త ఉచిత ప్రయాణ పాసును ఆమెకు బహుమతిగా ఇచ్చారు.

1962లో మదర్‌ను ప్రభుత్వం 'పద్మశ్రీ'తో సత్కరించింది. అదే సంవత్సరం 'రామన్ మెగ్సెసే' అవార్డు అందుకున్నారు.

1970లో ఆమెరికా ప్రభుత్వం 'గుడ్ సమారిటన్' అవార్డు ప్రదానం చేసింది. 1971 పోప్ జాన్ నుండి శాంతి బహుమతి, అమెరికా ప్రభుత్వంచే జాన్ ఎఫ్. కెన్నెడి బహుమతి, 1972లో అంతర్జాతీయ అవగాహనకిచ్చే నెహ్రూ అవార్డు అందుకున్నారు. 1975 అల్బర్ట్‌స్వైట్జ్‌కి అవార్డు, 1979లో నోబెల్ శాంతి బహుమతి, 1980లో 'భారతరత్న' పురస్కారం, 1990లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు మరెన్నో అవార్డులందుకున్న సేవాయోగిని మదర్ థెరిసాను ఎన్నో విశ్వవిద్యాలయాలు డాక్టరేట్‌తో గౌరవించాయి.

87 దేశాల్లో 400 సేవా సంస్థలు స్థాపించారు.

**- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

# పశుగ్రాసాల సాగుతో పాడి అభివృద్ధి





**రైతులు, నిరుద్యోగ యువత, ఔత్సాహికులు పాడి పశువుల పెంపకం చేపట్టడానికి ముందుకు వస్తున్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో , నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, ఔత్సాహికులు వాణిజ్యపరంగా ఎదగడంలో పశుపోషణ రంగం ఎంతో దోహదపడుతున్నది.**

పాడి పశువుల పోషణలో అధిక ఉత్పాదకత కలిగిన మేలుజాతి పశువుల పెంపకంతో పాటు వాటి మేపు కూడా అతి ప్రధానమైనది. పచ్చిమేత లేకుండా పశుపోషణ లాభసాటి కాదు. పచ్చిమేత ఉత్పత్తి కొరకు మేలురకపు పశుగ్రాసాల సాగులో రైతులను ప్రోత్సహించడానికి జూలై 7 నుండి 14 వరకు పశుసంవర్ధకశాఖ, పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించింది.

పచ్చిమేత ఎల్లవేళలా అందుబాటులో ఉన్నప్పుడే తక్కువ ఖర్చుతో అధిక పాల ఉత్పత్తిని సాధించవచ్చును. అప్పుడే పాడిపశువుల పెంపకము లాభదాయకంగా ఉంటుంది.

లాభదాయక పశుపోషణ చేపట్టడానికి రైతులను, నిరుద్యోగ యువతను, ఔత్సాహికులను ప్రోత్సాహించడానికి ప్రభుత్వం పశుక్రాంతి, మినీడైరీ పథకం, నాబార్డ్ ద్వారా ఋణసౌకర్యంతో డెయిరీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రాజెక్టునందు పాడిపశువులకు పోషణకు సంబంధించిన పలు పథకాలు అమలుచేస్తూ అధిక ఉత్పాదకత కలిగిన మేలుజాతి పాడిపశువులను పంపిణీ చేస్తోంది.

మేలుజాతి పశువుల పంపిణీ ద్వారా రైతులను ప్రోత్సహిస్తూ, వాటి పోషణలో అతి ముఖ్యమైన పశుగ్రాసాల సాగునకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రోత్సహిస్తున్నది. ప్రస్తుతం మన రాష్ట్రంలో సాగులో ఉన్న వ్యవసాయభూములలో సుమారు 4 శాతం మాత్రమే రైతులు పశుగ్రాసాల సాగు చేపడుతున్నారు. ఇది మనకున్న పశుసంపద యొక్క పోషకాహార అవసరాలు తీర్చడానికిగాని, ఉత్పత్తులు పెంచడానికి సరిపోదు. కనీసం 10శాతం వంతు వ్యవసాయ భూములలో పశు గ్రాసాల సాగుచేపట్టవలసిన అవసరమున్నది.

రైతులకు పశువైద్యశాలల ద్వారా 75% రాయితీపై మేలురకపు



గడ్డి విత్తనాలు సరఫరా చేయబడుచున్నవి. తద్వారా సంవత్సరానికి 2 నుండి 3 కోతలు వచ్చే ఏకవార్షిక పశుగ్రాసాలైన యస్.యస్.జి. 59-3 మరియు పి.సి.23 వంటి పశుగ్రాసాల సాగు చేపట్టి రైతులు పచ్చిమేత పొందుతున్నారు. వారి పశువుల అవరాలకు సరిపోగా మిగిలిన పశు గ్రాసాన్ని నిల్వచేసుకోవడం లేదా ఇతర రైతులకు అమ్మి లబ్దిపొందే అవకాశమున్నది.

ఈ సంవత్సరం నుండి మేలురకపు పశుగ్రాస విత్తనాల సరఫరాయే కాకుండా ప్రభుత్వం నూతనంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా వివిధ పశుగ్రాసాభివృద్ధి, నిల్వచేయు పథకాలు ప్రవేశపెట్టి రైతులను ప్రోత్సహిస్తున్నది.

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా, మన రాష్ట్రంలో మెదటిసారిగా పశుగ్రాసోత్పత్తి కొరకు రాయితీలతో రైతులకు ప్రోత్సాహం అందచేయబడుచున్నది. ఈ పథకం ద్వారా కో-1, కో-2, కో-3, మరియు ఎ.పి.బి.యన్ లాంటి బహువార్షిక పశుగ్రాససాగుకు ఎకరాకు రూ. 75,442/-, గడ్డిని పాతర వేసే విధానం ద్వారా నిల్వచేసుకొనుటకు జొన్న, మొక్క జొన్నలాంటి పశుగ్రాసాలను పెంచుటకు రూ॥11,819 మరియు పాతర వేయుగుంతలు (సైలేజ్) ఏర్పాటు చేసేకొనుటకు రూ॥ 27102/- రూపాయలు ప్రభుత్వము అందజేస్తున్నది. పశుగ్రాసంగా కూడా ఉపయోగపడే సుబాబుల్, అవిశ చెట్ల మద్య స్థైలో గడ్డిసాగుతో సిల్విపాశ్చర్ ఏర్పాటుకు రూ॥ 16,422, బహువార్షిక పశుగ్రాస నర్సరీలు 3 సంవత్సరముల వరకు 3 ఎకరాలలో ఏర్పాటుకు రూ॥3,12,426/- లతో అర్హులైన లబ్దిదారులకు ప్రోత్సాహము అందచేయబడుతుంది.ఈ పథకపు విలువలలో పనిదినాలు, కూలీల ఖర్చు, మెటరీయల్ ఖర్చు ఇమిడి ఉంటాయి.

జొన్న, మొక్కజొన్నలాంటి పొడవైన కాండాన్ని కలిగిన పశుగ్రాసాలను పశువులకు మేతగా వాడినప్పుడు, అవి మెత్తని భాగమును మరియు ఆకులను మాత్రమే తిని కాండపు భాగాన్ని వృధాగా వదిలివేస్తాయి. తద్వారా 40% పశుగ్రాసము వృధా అవుతుంది. ఇలాంటి గ్రాసాలను చిన్న, చిన్న ముక్కలుగా కత్తిరించి పశువుకు వేసినట్లయితే కాండము భాగము వృధాకాకుండా పశుగ్రాసము మొత్తము ఉపయోగించు కోవచ్చు. పశువుకు సులువుగా జీర్ణం అవుతుంది. కావున పశుగ్రాస వృధాను అరికట్టడానికి రైతులకు 75 శాతము రాయితీతో ఛాఫ్ కట్టర్స్ కేంద్రప్రభుత్వ పథకం ద్వారా అందజేస్తున్నది.

మేలుజాతి పశువుల పోషణలో ఉత్పత్తి ననుసరించి దాణా వాడాల్సి ఉంటుంది. దాణాలో ఖరీదైన వేరు శనగ చెక్క, పత్తి చెక్క వినియోగం చాలా ఖర్చుతో కూడుకున్నది. పశుపోషణలో ఉత్పత్తి ఖర్చు తగ్గించుకుంటేనే లాభదాయకం. దీని కొరకు 25 శాతము మేరకు మాంస కృత్తులు, ఇతర పోషక విలువలు కలిగిన అజోల్లాను వేరు శనగ చెక్క, పత్తి చెక్కకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చును . ప్రభుత్వము 50 శాతము సబ్సీడిపై రైతులు అజోల్లా పెంపకం చేపట్టడానికి ప్రోత్సహిస్తున్నది.

కావున రాష్ట్ర రైతాంగం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగపరుచుకొని అదిక పశుగ్రాసోత్పత్తితో లాభసాటి పశుపోషణ చేపట్టాలని కోరుతున్నాము.

**డా॥ యం.వి.రెడ్డి**
**సంచాలకులు, పశు సంరక్షక శాఖ**



# ఐకమత్యంతో

**పచ్చని పల్లె అందాలు భవిష్యత్ తరాలకు కేవలం ఛాయాచిత్రాలు, రచనల రూపంలోనే మిగులుతాయా? ఆధునిక అభివృద్ధి పోకడలు స్వచ్ఛమైన పల్లె అందాలను కాటువేస్తున్నాయా? ఇదే నిజమైతే మరి "ఎంతకాలం ఇలా వెనుకబడే ఉంటాం? మేమెందుకు అభివృద్ధి చెందకూడదు? అందుకే ఆధునిక హానికర పోకడలను నియంత్రిస్తూ మా పల్లె అందాలను స్వచ్ఛంగా అలాగే కాపాడుకుంటూ, అభివృద్ధి వైపు శరవేగంగా అడుగులు వేస్తాం."**

ఇది తూర్పుగోదావరి జిల్లా అంబాజీ పేట మండలం కముజువారిలంక ప్రజల తపన. కీ-క్యాప్ ద్వారా ఈ పల్లె ప్రజలు తమ గ్రామాన్ని ఓ గంగదేవిపల్లి, చీదేడుగా మార్చుచేయాలని ఆరాటపడుతున్నారు. ఇంతకాలం ఎవరి పని వాళ్ళు చేసుకుపోతూ ఉండే ప్రజలు కీ-క్యాప్ ద్వారా చైతన్యం పొందారు. తమ భాగస్వామ్యం ద్వారా గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామమంతా ఐకమత్యంగా ఉంటే ఎంత ఆనందంగా ఉంటుందో కీ -క్యాప్ ద్వారా ఒకటైన ప్రజలు గ్రహించారు.

ప్రకృతి అందాలకు నిలయమైన కోనసీమలో కలకత్తా నుండి కన్యాకుమారి వెళ్లే రహదారి నెం. 5 నుండి 25 కి.మీ దూరంలో ఉన్న అతి చిన్నగ్రామం కముజువారి లంక. కేవలం 806 మంది జనాభాతో 162 కుటుంబాలు ఈ గ్రామంలో నివశిస్తున్నాయి. అక్షరాస్యత సుమారు 80 శాతంగా ఉన్న ఈ గ్రామం అభివృద్ధి పరంగా అన్ని రంగాలలో దాదాపు ముందుంది. గ్రామమంతా చక్కటి బీటి, సి.సి.రోడ్లు, ఇంటింటికి పచ్చనిచెట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. గత ఏడాది నిర్మల గ్రామ పురస్కారం పొందిన ఈ గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక అంగన్ వాడీ కేంద్రం, మంచినీటి ట్యాంకు ఉన్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచికి గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందిస్తారు. వరి, కొబ్బరి, అరటి ప్రధాన వ్యవసాయ పంటలుగా పండించే ఈ గ్రామం తన ప్రకృతి అందాలతో చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది.



# ఆదర్శగ్రామంగా...

కీ-క్యాప్ కార్యక్రమంలో భాగంగా కొన్ని రోజులుగా ఈ గ్రామంలో ప్రజా భాగస్వామ్యంతో సామాజిక అభివృద్ధికి కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. జిల్లా రిసోర్స్ పర్సన్ శ్రీ సత్యనారాయణమూర్తి, నేను కలిసి స్థానిక సర్పంచి (శ్రీ కె. వెంకటేశ్వరరావు, ఇ.ఓ (పి.ఆర్ ఆర్.డి) శ్రీ వి.వి.వి. సత్యనారాయణ, సెక్రటరీ మోహనకృష్ణల సహకారంతో గ్రామ ప్రజలను

భాగస్వాములుగా చేసి సామాజిక మార్పులకు కృషి చేస్తున్నాం. గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా కృషిచేస్తున్నాం.

ముఖ్యంగా యువతను, స్వయంసహాయక సంఘాల మహిళలను చైతన్యపరచి ఆరు ముఖ్య కమిటీలు ఏర్పాటు చేసి సాంఘిక దురాచారాలను తగ్గించడానికి కృషి ప్రారంభించాం. సామాజిక పరిస్థితులు మెరుగుపడితేగాని, గ్రామం ఇతర రంగాలలో అభివృద్ధి సాధించలేదని గ్రహించిన భారత్ నిర్మాణ వాలంటీర్లు ఇప్పటికే మద్యపాన నిషేధం గూర్చి ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ గ్రామంలో ఒక్క మద్యం అమ్మే దుకాణం కూడా లేదు.



అదేవిధంగా ఈ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తయారు చేయడానికి గ్రామ సభ తీర్మానం, యువత ప్రతిజ్ఞల ద్వారా చర్యలు ప్రారంభించారు. భారత్ నిర్మాణ్‌లో భాగంగా కీ-క్యాప్, లాబ్ టు లాండ్ ద్వారా ప్రేరణ పొందుతున్న గ్రామ యువత 'కలసి ఉంటే కలదు సుఖం' అన్న సామెతను గుర్తు చేసుకుంటూ తమ గ్రామ అభివృద్ధి కొరకు వారంలో 4 గంటలు కేటాయించడానికి తీర్మానం చేసుకున్నారు.

స్థానిక ఎఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, టీచర్లతో కలసి వీరు ఇంటింటికీ తిరుగుతూ, ఆరోగ్యంపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ప్రతి ఇంటిలో చెత్తబుట్టలు వాడి, చెత్తను గ్రామపంచాయితీ కేటాయించిన చెత్తకుండీలలో వేయడం ప్రారంభించారు. సంపూర్ణ పారిశుధ్యం పాటించటం వల్ల ఈగలు, దోమలను తరిమి కొట్టటమేకాక భవిష్యత్‌లో సీజనల్ వ్యాధులేవీ రావని గ్రామప్రజలు గ్రహించేలా ప్రచారం చేస్తున్నారు.

గ్రామపంచాయితీలో జరిగే సమావేశాలలో, ఇందిరా క్రాంతి పథం-గ్రామ సమాఖ్య సమావేశాలలోను, ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశాల వద్ద ప్రజలకు పలు విషయాలు తెలియజెప్పి వారి జీవన విధానంలో ప్రభుత్వ సేవలు పొందే విధానాలు ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వం నుండి వివిధ శాఖల ద్వారా అందే అన్ని సేవలను గూర్చి వివరించారు.

సుమారు 15 మంది పట్టభద్రులు కలిగిన ఈ గ్రామంలో అన్ని ఆధునిక జీవన విధాన పరిస్థితులూ కనిపిస్తాయి. 53 ఎకరాల వరి పొలాలు, ఇంకొక 52 ఎకరాల కొబ్బరితోటలు కలిగిన ఈ చిన్న పల్లెలో 203 తెల్లరేషన్ కార్డులతో సహా మొత్తం 231 కార్డులు ఉన్నాయి. ఇప్పటికే ఈ గ్రామంలో 47 మంది సాంఘిక భద్రతా ఫించన్లు పొందుతున్నారు. 178 కుటుంబాలు ఉపాధిహామీ జాబ్ కార్డులు కలిగి పనులలో పాల్గొంటున్నారు.

600 మీటర్ల సీసీ రోడ్లు, ఒకటిన్నర కిలోమీటర్లు బీటీరోడ్డు, 260 మీటర్ల మెటల్ రోడ్లు ఉన్నాయి. కాని భవిష్యత్‌లో మాత్రం ఈ గ్రామంలో ప్లాస్టిక్ వాడకం ఉండకూడదని మద్యపాన సేవనం కనుమరుగుకావాలని, మురికివాడలు, బహిరంగ మలవిసర్జన మచ్చుకైనా కనపడకుండా భారత్ నిర్మాణ్ యువత కృషి చేస్తున్నారు.

జూన్ 3,4,5 తేదీలలో 8 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అపార్డులో శిక్షణకు హాజరై పలుఅంశాలు తెలుసుకొని ఈ గ్రామంలో వాటిని అమలు చేసేలా కృషి ప్రారంభించారు. ముఖ్యంగా ఈ శిక్షణలో ఇతర జిల్లాల వాలంటీర్లను కలుసుకోవటం వల్ల ఎన్నో కొత్త విషయాలను వీరు తెలుసుకోగలిగారు. గ్రామ ప్రజలంతా కలసికట్టుగా ఉండేందుకు ఈ కార్యక్రమాలు తోడ్పడుతున్నాయి.




షెడ్యూల్డు కులాలు, ఇతర అన్ని కులాల ప్రజలు ఉన్న ఈ గ్రామంలో సోదర బంధాన్నే కనబరుస్తారు. కొంత ఆర్థిక అసమానతలు కనిపించినా, ఇతర సామాజిక రంగాలలో ప్రజలందరూ ముందు వరసలోనే ఉన్నారని చెప్పక తప్పదు. వచ్చే కొన్ని నెలల కాలంలో ఈ గ్రామం నాడు గాంధీజీ కలలుకన్న ఆదర్శ గ్రామంగా మారనున్నది. ఇదే భారత్ నిర్మాణ్.

*- దుండి రాంబాబు*
మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
అంబాజీ పేట, తూ.గో.జిల్లా



# భారతదేశ సాంప్రదాయిక క్రీడ

**క్రికెట్, టెన్నిస్ వంటి అంతర్జాతీయ స్థాయి క్రీడలు ఇప్పటికీ ప్రధాన శీర్షికలను ఆక్రమిస్తున్నప్పటికీ, ఇటీవల భారతదేశ సాంప్రదాయిక క్రీడలు, ఆటలు కూడా నెమ్మదిగా అధికార యంత్రాంగం, మీడియా దృష్టిని ఆకర్షించటం ప్రారంభించాయి. ఇదెంతయినా హర్షణీయ పరిణామం. క్రికెట్‌లో జరగుతున్న ఐపిఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) తరహాలో ఈ మధ్య విజయవాడలో ఇండియన్‌లీగ్ కబడ్డీ టోర్నమెంట్ జరిగింది.**

కబడ్డీ మాదిరిగానే, దాదాపు అదే విధంగా జరిగే ఖో-ఖో కూడా మన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాదరణ పొందిన క్రీడే. ఈ ఆటకున్న సాంప్రదాయిక స్థాయి మాత్రవే కాక, ఆటలోని తీరు కూడా క్రీడాప్రియులకు థ్రిల్ కలిగిస్తోంది.

వెంటపడి పట్టుకోవటం (చేజింగ్) ఖో-ఖోలో ప్రధానంగా జరిగే ప్రక్రియ. అందువల్ల ఖో-ఖో క్రీడాకారులకు అతివేగం, శారీరక దారుఢ్యం, బలం, ఓపిక, చురుకుదనం చాలా అవసరం. ప్రాచీన కాలంలో మహారాష్ట్రలో ఈ ఆటను రథాలపై ఆడేవారని ప్రతీతి. అదే ఈ క్రీడ పుట్టుకకు నాందిగా చెప్పవచ్చు. అందువల్లనే, దానికి 'రథేరా' అనే పేరుతో వ్యవహరించేవారు.

ఇక ఇప్పటి ఖో-ఖో ఆట విషయానికి వస్తే, ఒక టీము కోర్టు మధ్యలో ఒక వరసలో మోకాళ్లు వంచి కూర్చుంటారు. ఈ వరసలో ఒక వ్యక్తి ఇటువైపు తిరిగి, ప్రక్క వ్యక్తి అటు వైపు తిరిగి కూర్చుంటారు. ఈ టీము సభ్యుల లక్ష్యం ప్రత్యర్థి టీములోని వారిని పట్టుకోవటం. వీరు ఒక దిశలోనే పరిగెత్తి, పట్టుకోవాల్సి ఉంటుంది. కూర్చున్న వారి మధ్య నుండి, అటూ ఇటూగా వీరు పరుగెత్తకూడదు.

అయితే, ప్రత్యర్థి టీమువారు మాత్రం కూర్చున్న వారి మధ్యనుంచి, అటూ ఇటుగా కూడా పరుగెత్తవచ్చు. వీరిని పట్టుకోవాలంటే, కూర్చున్న వారు వరున చుట్టూ తిరిగి పట్టుకోవాల్సిందే. లేదంటే, మరో ప్రత్యామ్నాయం ఉంది. కూర్చున్న తమ జట్టులోని వారికే ఆ పని అప్పగించవచ్చు. పరిగెత్తే వ్యక్తిని పట్టుకోవడానికి ఎవరికి వీలుగా ఉంటుందో, ఆ వ్యక్తి దగ్గరకు వెళ్లి వారిని ముట్టుకుని 'ఖో' అని అరవాలి. అప్పుడు కూర్చున్న ఆ వ్యక్తి లేచి, పరుగెత్తుతున్న వ్యక్తి వెంటపడతారు. అప్పుడు ఆ లేచిన వ్యక్తి స్థానంలో ఈ వ్యక్తి కూర్చుంటారు. ఈ ఆటలో లక్ష్యం ఏమిటంటే, పరుగెత్తుతున్న వ్యక్తి వెంటపడి తక్కువ సమయంలో పట్టుకోవటం, తక్కువ సమయంలో ఏ టీమయితే తన ప్రత్యర్థి జట్టులోని మొత్తం ఆటగాళ్లను పట్టుకుంటుందో, ఆ టీముని గెలిచినట్లుగా ప్రకటిస్తారు.

మౌలికంగా చూస్తే పరుగెత్తటం, పట్టుకోవటం అనేది ప్రాచీన క్రీడ. అయితే, పూనెకు చెందిన దక్కన్ జింఖానా కమిటీ ఖో-ఖో క్రీడకు సంబంధించి కొన్ని నిబంధనలను రూపొందించి, తరచూ వాటిని సమీక్షిస్తూ, గడచిన దశాబ్దాలలో మార్పులు చేర్పులు చేయటంతో ఈ ఆట కూడా మిగిలిన క్రీడల మాదిరిగానే క్రమబద్ధమైన క్రీడగా మారింది. స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ 'దక్కన్ జింఖానా ఆఫ్ పూనె'కి నామకరణం చేశారు.

ఖో-ఖో క్రీడ ఆడేవారికి చురుకైన కదలికలు, మెదడు చురుకుదనం, శారీరక దారుఢ్యం వంటివి అవసరమని ఖో-ఖో క్రీడా నిపుణులు, నిబంధనలను రూపొందించిన వారు భావించారు. బొంబాయి రాష్ట్ర గవర్నర్ లార్డ్ వెల్లింగ్టన్ ఈ ఆట చూసి, పరమానంద భరితులయ్యారు.

ఆటలోని వేగానికి ఆయన ముచ్చట పడ్డారు. దక్కన్ జింఖానా ఆఫ్ పూనె, హింద్ విజయ్ జింఖానా ఆఫ్ బరోడాలు బాగా పేరుపొందిన ప్రధాన జట్లు. ఖో-ఖో క్రీడ అభివృద్ధికి, ప్రజాదరణకు ఈ జట్లే దోహదం చేశాయంటే అతిశయోక్తి కాదు.

1936లో బెర్లిన్‌లో జరిగిన ఒలింపిక్ గేమ్స్ ఖో-ఖోను ప్రదర్శించడానికి ఒక సువర్ణావకాశాన్ని ఇచ్చాయి. మహారాష్ట్రకు చెందిన హనుమాన్ వ్యాయామ్ ప్రసారక్ మండల్ ఆఫ్ అమరావతికి చెందిన జట్లు ప్రధాన స్టేడియమ్‌లో ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఆడాయి. కొన్ని సంవత్సరాల తరువాత అమెరికన్ క్రీడా నిర్వహకుడు డాక్టర్ నాష్ భారతదేశానికి వచ్చారు. ఖో-ఖో ఆటను చూసిన ఆయన- ఇది చాలా అద్భుతమైన ఆటని, దీన్ని దేశ జాతీయక్రీడగా మార్చాల్సిందని వ్యాఖ్యానించారు.

ఖో-ఖో క్రీడాకారుడయిన శ్రీ కాశీనాథ్ 'భాయ్' నెరుర్కర్ తీసుకున్న చొరవ, ఎడతెగని ప్రయత్నాల వల్ల 1950ల దశకం మధ్య కాలంలో ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అస్తిత్వంలోకి వచ్చింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆంధ్రప్రదేశ్ చెందిన రాజకీయ వేత్త గోపాల్ రెడ్డి ఈ ఫెడరేషన్‌కి తొలి అధ్యక్షులయ్యారు. నెరుర్కర్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్, కబడ్డీ ఫెడరేషన్‌లకి చెందిన ఎస్‌కె దూబె వైస్ ప్రెసిడెంట్‌కాగా, ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కి చెందిన రాయ్‌చౌదరి ట్రెజరర్ అయ్యారు. ఖో-ఖో క్రీడ ప్రజాదరణ పొందడానికి ప్రధాన స్ఫూర్తిగా నిలిచిన నెరుర్కర్ ఆ క్రీడకు చేసిన సేవకు గుర్తింపుగా ఆయన పేరిట ఒక గోల్డ్‌కప్‌ను నెలకొల్పారు.

1959లో జరిగిన ఖో-ఖో పోటీలో పూనె జట్టు మొదటిస్థానంలో నిలిచింది. ఇప్పటి డే అండ్ నైట్ మ్యాచ్‌కి తొలి రూపంలా సన్‌మిత్ర సంఘ్ ఒక ఖో-ఖో మ్యాచ్‌ను ఫ్లడ్‌లైట్లతో నిర్వహించింది. ఈ మ్యాచ్ బొంబాయికి చెందిన విజయ్ క్లబ్‌కు, బరోడాకి చెందిన మథ్యస్థ రామల్‌కు మధ్య జరిగింది.

1959లో మొదటిసారి అఖిలభారత ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలు విజయవాడలో జరగటం మన రాష్ట్రానికి గర్వకారణం. వీటిల్లో బొంబాయి ప్రావిన్స్ ప్రథమ స్థానంలో నిలిచింది. పూనె, బరోడాకి చెందిన జట్లు ప్రధాన జట్లుగా అవతరించాయి. ఈ రెండు జట్లు బొంబాయి ప్రావిన్స్‌లో భాగమే. తరువాత బొంబాయి ప్రావిన్స్ మహారాష్ట్ర,

# ఖోఖో





గుజరాత్ రాష్ట్రాలుగా విభజితమైంది.

ఆ తదుపరి సంవత్సరం మహిళల విభాగంలో ఖో-ఖో అఖిల భారత ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. 1960ల దశకం వచ్చేసరికి ఖో-ఖో క్రీడ అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడగా అవతరించింది. ఈ క్రీడలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు భారత ప్రభుత్వం అవార్డులు ఇవ్వటం కూడా ప్రారంభించింది. ఉత్తమమైన పురుష క్రీడాకారునికి 'ఏకలవ్య' అవార్డును, ఉత్తమమైన మహిళా క్రీడాకిరిణికి 'రాణీ లక్ష్మీబాయి' అవార్డును, జూనియర్ బాలుర విభాగంలో 'వీర్ అభిమన్యు' అవార్డును, జూనియర్ బాలికల విభాగంలో 'జానకి' అవార్డును 1963లో ప్రధానం చేశారు.

విశ్వనాథ్ మాయేకర్ 'ఏకలవ్య' అవార్డును మొట్టమొదట గెలుచుకున్నారు. మైసూరుకు చెందిన ఉషా అనంతం మొదటి 'రాణీ లక్ష్మీబాయి' అవార్డును గెలుచుకున్నారు. క్రీడల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అర్జున' అవార్డులను కూడా కొందరు ఖో-ఖో క్రీడాకారులు పొందారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 1970-2000 సంవత్సరాల మధ్య ఈ అవార్డులు అందుకున్న 13 మందిలో 8 మంది మహిళా క్రీడాకారిణులు, 5 గురు పురుష క్రీడాకారులు మహారాష్ట్రకు చెందిన వారే. 'అర్జున' అవార్డు పొందిన మొదటి ఖో-ఖో క్రీడాకారుడు సుధీర్ పరబ్, శ్రీరంగ్ ఇనామ్‌దార్ రెండు అత్యున్నత స్థాయి పురస్కారాలైన 'అర్జున' 'శివ ఛత్రపతి' అవార్డులను పొందారు.

హైదరాబాద్‌లో 1969-70లో జూనియర్స్ విభాగంలో ఖో-ఖో పోటీలు జరిగాయి. మహారాష్ట్రకు చెందిన హేమంత్ జాగ్‌దేవ్ వ్యక్తిగత ఈవెంట్‌లో గెలుపొంది, 'అండర్ - 16' విభాగంలో ఇచ్చే 'వీర్ అభిమన్యు' అవార్డును మొట్టమొదటిగా గెలుచుకున్నాడు. మహిళలకు, పురుషులకు భాయ్ నెరుర్కర్ ఫెడరేషన్ కప్ టోర్నమెంట్‌ను బరోడాకి చెందిన మత్స్యస్థ రామల్ నిర్వహించింది. 1960-70ల మధ్యకాలపు దశాబ్దంలో ఈ జట్టు ఖో-ఖో పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

1998లో కోలకత్తా ఖో-ఖోలో ఒక అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌ను నిర్వహించి, ఈ క్రీడపట్ల ఉన్న అభిమానాన్ని, ఆకర్షణను దేశం సరిహద్దులు దాటించింది. దాంతో, సాంప్రదాయికమైన ఈ క్రీడకు మరింత ప్రజాదరణ పెరిగింది. ప్రభుత్వశాఖలు, కార్పొరేట్ కంపెనీలు ఖో-ఖో పట్ల అభిమానం కురిపించటం ప్రారంభించాయి. ఖో-ఖో ఈవెంట్లను స్పాన్సర్ చేయటం, ఆ క్రీడాకారులకు ఉద్యోగాలు ఇవ్వటం మొదలు పెట్టారు. స్పోర్ట్స్ కేటగిరీ కింద కమర్షియల్ బ్యాంకులు, భారతీయ రిజర్వు బ్యాంకు, ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్, తదితర శాఖలు ఉద్యోగాలు ఇవ్వటం ప్రారంభించాయి.

అనూహ్యంగా పలు వర్గాల నుంచి ఖో-ఖో క్రీడకు మంచి ప్రశంసలు









లభించాయి. 1950ల దశకంలో భారత టెస్ట్ క్రికెట్ జట్టుకి కేప్టెన్‌గా వ్యవహరించిన విజయ్ మర్చంట్ ఖో-ఖో పట్ల తనకున్న అభిమానాన్ని ప్రకటించారు. క్రికెట్ మాత్రమే ప్రధాన క్రీడ అని, ఖో-ఖో కేవలం మహిళల క్రీడ అని అనుకునేవాడినని, తన అభిప్రాయం చాలా తప్పని, అందుకు బాధపడుతున్నానని వ్యాఖ్యానించారు. చిన్నప్పుడు ఖో-ఖో ఆడనందుకు చాలా పశ్చాత్తాప పడుతున్నానని కూడా ఆయన పేర్కొన్నారు.

'లిటిల్ మాస్టర్' సునీల్ గవాస్కర్ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చటం గమనార్హం. ఖో-ఖో ఇంత గొప్పగా ఉంటుందని ముందే తెలిస్తే, క్రికెట్ బదులుగా తాను ఖో-ఖో క్రీడ ఆడటాన్నే ఎంచుకునే వాడినని ఆయన వ్యాఖ్యానించారు.

ఇక దక్షిణ భారతదేశానికి వస్తే, ఖో-ఖో క్రీడ అనేకమంది సినిమా నిర్మాతలను, దర్శకులను కూడా ఉత్తేజ పరిచింది. ఈ క్రీడపై ఆధారపడి అనేక సినిమాలు తీశారు. 'కో' (ఖో-ఖోకి సంక్షిప్త అక్షరం) అనే పేరుతో వచ్చిన తమిళ సినిమాలో కార్తీక (కిందటి తరం హీరోయిన్ రాధ కుమార్తె), జీవ, అజ్మల్ నటించారు. 'వల్లభ వీడియోస్' అనే పేరిట వచ్చిన మరో తమిళ సినిమాలో సుప్రసిద్ధ సినిమా తారలు నయనతార, శింబు ప్రధాన పాత్రల్లో నటించారు. ఇవి ఖో-ఖో క్రీడ నేపథ్యంగా రూపుదిద్దుకున్న సినిమాలే.

ఖో-ఖోకు నానాటికీ పెరుగుతున్న ప్రజాదరణకు తార్కాణం - మహిళలకు, పురుషులకు 45వ 'సీనియర్ నేషనల్స్' పోటీలు ఇటీవల మే27 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా పంగులూరులో జరిగాయి. ఈ ఛాంపియన్ షిప్ పోటీల్లో 34 టీములకి చెందిన 1000 మంది క్రీడాకారులు, 150 మంది క్రీడాధికారులు పాల్గొన్నారు.

నాలుగురోజుల పాటు ఘనంగా జరిగిన ఈ పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు తమకు దొరికిన వాహనం పట్టుకుని ఉత్సాహంగా పంగులూరుకి వచ్చారు. 1400 చదరపు మీటర్లతో రూపొందించిన భారీ సైజు జాతీయ పతాకాన్ని చేబూని క్రీడాకారులు చేసిన మార్చ్‌పాస్ట్, లేజర్ షోలు ప్రేక్షకులను ఎంతగానో మైమరిపించాయి.

ఈ ఛాంపియన్ షిప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు (విన్నర్స్, రన్నర్స్) స్వచ్ఛమైన బంగారు వెండి ట్రోఫీలను బహుకరించారు.

విజయవాడలో 1959లో జరిగిన జాతీయస్థాయి ఖో-ఖో పోటీల తరువాత, అంత ప్రధానమైన ఈవెంట్ మన రాష్ట్రంలో జరిగింది పంగులూరులోనే. మన సాంప్రదాయిక ఖో-ఖో ను మరింతగా అభివృద్ధి పరచడానికి, ప్రజాదరణ పెంచడానికి, జాతీయ స్థాయి క్రీడగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం, క్రీడారంగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**- దాసుకేశరావు**

**(అనువాదం : వై.సరోజ)**

**ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమం వందేమాతరం ఉద్యమంతో ప్రారంభమైంది. వైస్రాయ్ లార్డ్‌కర్జన్ ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా హిందువుల నుండి ముస్లింలను వేరుచేయడానికి 1906లో వంగరాష్ట్రాన్ని విభజించాడు. తమకు స్వాతంత్ర్యం లేకపోవడం వల్లనే వైస్రాయ్ ఈ దుస్సాహసం చేయగలిగాడని ప్రజలు రెచ్చిపోయారు. దీనికి వ్యతిరేకంగా విదేశీ వస్తువుల బహిష్కారం, జాతీయ విద్యాలయాల స్థాపన, బ్రిటిష్ చట్టాలను తిరస్కరించడం అనే మూడంచెల ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రజలు చేపట్టారు.**



పింగళి వెంకయ్య

# స్వాతంత్ర్య సమరాన్ని రగిలించిన తెలుగువారు

1906లో ప్రారంభమైన ఈ ఉద్యమానికి వందేమాతరం ఉద్యమం అని పేరు వచ్చింది. ఈ ఉద్యమం ఎంత తీవ్రంగా జరిగిందంటే దీని ధాటికి తట్టుకోలేక వైస్రాయ్ కర్జన్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. 1911లో వంగ రాష్ట్ర విభజనను రద్దుచేయక తప్పలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో 'వందేమాతరం' ఉద్యమానికి రాజమహేంద్రవరం కేంద్రమైంది. ఈ గీతాన్ని ఆలపించడంలో కౌతా శ్రీరామశాస్త్రి ప్రత్యేక నేర్పు చూపారు. 1908లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ పర్యటనకొచ్చారు. పాల్ ఉపన్యాసం ప్రభావంతో విద్యార్థులు ప్రభావితులై వందేమాతరం బ్యాడ్జీలు పెట్టుకొని కళాశాలలకు వెళ్ళేవారు. ఆనాటి రాజమండ్రి ప్రభుత్వ ట్రెయినింగ్ కళాశాలకు మార్క్సుహంటర్ అనే ఆంగ్లేయుడు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. విద్యార్థులు వందేమాతరం బ్యాడ్జీలు ధరించి రావటాన్ని ఆయన సహించలేక పోయారు. బ్యాడ్జీలు లేకుండా వస్తేనే కళాశాలలో ప్రవేశం అనే ఉత్తర్వులు జారీ చేశారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు అనే విద్యార్థి నాయకత్వంలో ప్రిన్సిపాల్ చర్యకు వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభమైంది. దీన్ని సహించని ప్రిన్సిపాల్ గాడిచర్ల వారితో సహా ఆ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ కాలేజి నుంచి బహిష్కరించారు. 1907 మే 18 న గాడిచర్ల వారికి ఎక్కడా



పట్టాభి సీతారామయ్య

ఎటువంటి ఉద్యోగం ఇవ్వరాదని ప్రభుత్వం 384 నెంబరు జి.వో. ద్వారా ఉత్తర్వులను జారీ చేసింది.

ఆంధ్రదేశంలో ఆది రాజకీయ బాధితుడు హరిసర్వోత్తమరావే. ఇందుకు నిరసనగా ప్రజలు బ్రిటిష్ క్లబ్బులపై దాడి చేశారు. రాజమండ్రి, కాకినాడ, బందరు, గుంటూరు, బెజవాడ, నెల్లూరు మొదలైన అనేక పట్టణాల్లో స్వదేశీ వస్తువుల దుకాణాలు తెరిచారు. పాల్ ఉపన్యసిస్తున్న సభలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు -

*'భరత ఖండంబు చక్కని పాడియావు*
*హిందువులు లేగ దూడలై యేడ్చు చుండ -*
*తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుతున్నారు*
*మూతులు బిగియగట్టి'*

అనే పద్యం పాడి ప్రజలను ఉగ్రూతలూగించారు.

బందరు త్రయంగా ప్రసిద్ధులైన ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, డాక్టర్ పట్టాభి సీతారామయ్య గార్ల కృషితో 1910లో బందరు జాతీయ కళాశాల ఏర్పడింది. ఈ కళాశాల 1914లోనే కుటీర పరిశ్రమలను, చేనేత పరిశ్రమలను పాఠ్యప్రణాళికలో చేర్చింది. మహాత్మాగాంధీ ఆంధ్రప్రదేశ్ పర్యటనకొచ్చినప్పుడు ఈ కళాశాలను సందర్శించి ఎంతో సంతృప్తి చెందారు.

### చీరాల- పేరాల ఉద్యమం

1916లో గుంటూరు జిల్లాలో ప్లేగు వచ్చింది. చీరాల-పేరాల కూడా ఈ రుగ్మతతో బాధపడింది. అపరిశుభ్రతవల్ల ఈ జాడ్యం వచ్చింది. చీరాల, పేరాలను ఒక మునిసిపాలిటీగా చేసి పన్నులు విధించి పరిశుభ్ర కార్యక్రమాలు చేపట్టాలనుకుంది ప్రభుత్వం. ప్రాచీన భారత సంప్రదాయానికి విరుద్ధంగా ఆంగ్లేయ పద్ధతిలో జరుగుతున్న నవ

నిర్మాణం తమకక్కరలేదన్నారు ప్రజలు. దానికి యువకుడైన దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నాయకత్వం వహించారు. ఆయన ప్రతిభావంతులే కాదు, త్యాగధనుడు. ఆయన ఆంధ్రరత్నమే కాదు, భారతరత్నం.

చీరాల మునిసిపాలిటీకి వ్యతిరేకంగా 1920 సెప్టెంబరులో కౌన్సిలర్ల చేత గోపాలకృష్ణయ్య రాజీనామా చేయించారు. జైలు, జరిమానాలు, అగౌరవం, అప్రతిష్ట అనే భయం పోగొట్టి దేశసేవలో నూతనోత్తేజం రేకెత్తించిన మహానాయకుడు దుగ్గిరాల. రామదండును తయారు చేశారు. తరతరాల నుండి కాపురముంటున్న ఇండ్లూ, వాకిళ్లూ వదిలిపెట్టి, ఇసుక దిబ్బల పై తాటియాకుల కుటీరాలను నిర్మించుకుని కాపురముండి ప్రభుత్వాన్ని ధిక్కరించే ధైర్యం ఆనాటి ప్రజలకు కలిగిందంటే, దానికి కారకుడు ఆంధ్రరత్న. అలా వెళ్లిపోయినవారు ఒకరు కాదు, ఇద్దరుకాదు, 20 వేల మంది. ఒక మాసం కాదు, రెండు మాసాలు కావు. పదకొండు నెలలు. చీరాల-పేరాల పోరాటం ఆయనకు, ఆంధ్రదేశానికి ఎనలేని కీర్తిని తెచ్చింది.



టంగుటూరి ప్రకాశం

1921 మార్చి 31, ఏప్రిల్ ఒకటవ తేదీలలో బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. ఈ రెండు రోజులు బెజవాడ పండుగ చేసుకుంది. ఆంధ్రదేశం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాది ప్రజలను బెజవాడ ఆహ్వానించింది. గాంధీజీ, లాలాలజపతి రాయ్, దేశబంధు చిత్తరంజన్‌దాస్, కేల్కర్, పటేల్ సోదరులు, జవహర్‌లాల్ నెహ్రూ, రాజేంద్రప్రసాద్, సరోజినీనాయుడు, డాక్టర్ అన్సారీ మొదలైన అగ్రనాయకులు బెజవాడకు విచ్చేశారు. అశేష ప్రజావాహినిని అదుపులో పెట్టడం కష్టమైపోయింది. ఇంతలో తమ రామదండును తెచ్చారు ఆంధ్రరత్న. చూస్తూ చూస్తూ వుండగానే అన్ని ఏర్పాట్లను తెల్లవారే సరికి చేయించారు. సభలు జయప్రదంగా జరిగాయి. ఆయన కార్యదక్షతను అందరూ మెచ్చుకున్నారు.



దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

## త్రివర్ణ పతాకం

బెజవాడ కాంగ్రెస్ సమావేశంలోనే గాంధీజీ పింగళి వెంకయ్య గారిని పిలిపించుకుని ఎరుపు, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నం చిహ్నం గల జాతీయ జెండాను చిత్రించమని కోరగా, ఆయన ఆ విధంగా జెండాను తయారుచేసి ఇచ్చారు. దీన్ని పరిశీలించిన గాంధీజీ సత్య అహింసలకు ప్రత్యక్ష నిదర్శమైన తెలుపురంగు కూడా ఉండాలన్నారు. దీనిపై వెంకయ్యగారు తెలుపురంగును కూడా అదనంగా చేర్చి, నేటి త్రివర్ణ జెండాను దేశానికి ప్రసాదించారు.

1921 ఏప్రిల్ 13వ తేదీన 'యంగ్ ఇండియా' అనే పత్రికలో గాంధీజీ జాతీయ జెండా గురించి ఇలా పేర్కొన్నారు. - *It will be necessary for us that Indians to recognise a common flag. Mr. P.Venkayya of the National College of Masulipatnam has for some years placed before the public a suggestive booklet describing the flags of the other nations and offering designs for an Indian National Flag....*

*I have always admired the persistent zeal with which Mr. Venkayya prosecuted the cause of a national flag at every session of the congress for the past four years...*

*'At Bezwada I asked Mr. Venkayya to give me a design green (Muslim Colour) back ground. His enthusistic spirit enabled me possess a flag in three hours.....*

*On mature considerations I saw that the back ground should represent the other religions also..... so I suggested then the back ground should be white and green and red. The white portion is intended to represent all other faiths....*

మహాత్ముని ఈ వాక్యాలను పరిశీలిస్తే త్రివర్ణ పతాకం పుట్టింది ఆంధ్రదేశంలోనే అనీ, మన జాతికి ఒక జెండా కావాలన్న ఆకాంక్ష ఒక ఆంధ్రుని మేధస్సులోనే ఉద్భవించిందనీ చెప్పవచ్చు.

1936లో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. మద్రాసులో జరిపిన ఉప్పు సత్యాగ్రహంలో మొదట వరుసలో నిలిచినవారు ఆంధ్రులే. కొండా వెంకటప్పయ్య, విద్యాదాత కాశీనాధుని నాగేశ్వరరావు, ఆంధ్రకేసరి ప్రకాశం, డాక్టర్ పట్టాభి, బులుసు సాంబమూర్తి, దుర్గాబాయమ్మ మొదలైన నాయకులంతా ఈ ఉద్యమ సందర్భంగా అరెస్టయ్యారు. వేలాదిమంది జైలుకెళ్ళారు. కల్లూరి చంద్రమౌళి, మంతెన వెంకటరాజు, వావిలాల గోపాలకృష్ణయ్య, ఆచార్య రంగా మొదలైన నాయకులు ఉప్పు సత్యాగ్రహం నుంచి ఉద్భవించిన వారే.

ప్రభుత్వం ప్రాథమిక హక్కులను హరిస్తున్న రోజుల్లో ఇతర పత్రికలు ఆ వార్తలను ప్రచురించడానికి జంకినప్పుడు 1921లో ప్రకాశం పంతులు గారు ఆంగ్లంలో స్వరాజ్య పత్రికను స్థాపించారు. ఈ పత్రిక చేసిన సేవ అమోఘం. అది బ్రతికిన పదేళ్ళూ ధైర్యంగా జీవించింది. స్వరాజ్యంలో తయారైన కోటంరాజు రామారావు, ఖాసా సుబ్బారావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, కృపానిధి, కుందూరి ఈశ్వరదత్తు, క్రొవ్విడి లింగరాజు మొదలైనవారు అఖిల భారత యశస్సు పొందిన పాత్రికేయులయ్యారు.



బూర్గుల రామకృష్ణారావు

ప్రభుత్వం దీని నిర్భయ వ్రాతలకు వెరపొంది ఎన్నోసార్లు నిలిపివేయాలని ప్రయత్నించింది. కానీ ఏమీ చేయలేక పోయింది. స్వరాజ్యం వెలిగి ప్రకాశం గారి సమస్త సంపదను తైలంగా హరించి వేసింది.

## 'సైమన్ గో బ్యాక్'

1928లో భారతరాజకీయ సంస్కరణలు ఏ విధంగా ఉండాలో పరిశీలించడానికి సర్ జాన్ సైమన్ అధ్యక్షతన ఒక సంఘం భారతదేశానికి వచ్చింది. ఈ సంఘంలో భారతీయ సభ్యులొక్కరైనా లేరు. కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పక్షాలు సైమన్ కమీషన్ను బహిష్కరించాయి. ఈ కమీషన్ ఎక్కడికి వెళ్ళినా జనం తండోపతండాలుగా నల్లజెండాలతో 'సైమన్ గో బ్యాక్' అనే నినాదాలతో తిరస్కార భావం ప్రకటించారు.

ఈ బహిష్కరణ కార్యక్రమంలో తమిళులు తప్పుకున్నారు. కానీ మద్రాసు నగరంలో హర్తాళ్ జరిగింది. దీనికి ఆంధ్రులు నాయకత్వం వహించారు. కార్మికులు, విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేశారు. పోలీసుల కాల్పుల్లో ఒక కుర్రవాడు మరణించాడు. శవాన్ని చూడడానికి ఎవరినీ పోలీసులు అనుమతించలేదు. ఆ అడ్డును ఛేదించుకుని ప్రకాశం పంతులు శవాన్ని చూడటానికి ముందుకువెళ్ళి 'నేను ప్రకాశాన్ని. కాల్చండి' అని సింహగర్జన చేశారు.

ఒక తెల్ల సైనికుడు ఆంధ్రకేసరి గుండెకు సరిగా గురి పెట్టాడు. మరుక్షణాన ఆంధ్రకేసరి ఉండేవారు కాదు. ఆంధ్రకేసరి పోతే ఆనాడు మద్రాసు నగరం ఉండేది కాదు. ఎక్కడినుంచో పరుగెత్తుకుంటూ వచ్చాడు స్మాలర్ అనే పోలీసు సర్కిల్ ఇన్స్‌పెక్టర్. వెంటనే వారిద్దరి మధ్య నుంచుండి పోయాడు.

"ఎవరనుకున్నావ్! కేంద్ర శాసనసభలో కాంగ్రెస్ పార్టీ ఉపనాయకుడు సుమా! కొంప ముంచేద్దువు!" అని సైనికుడ్ని వారించాడు.

ప్రాణ త్యాగానికి తెగించి, పరివారంతో హైకోర్టు దాకా అంగలేసుకుంటూ పోయి తెల్లవారి తుపాకి గుండ్లకు గురైన వారిని చూసి, ఉపచారాలు చేయడానికి ఏర్పాట్లు చేసి, ప్రళయకాలాగ్ని లాగా ముందుకు సాగిపోయారు.

1942లో కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టింది. దీన్ని స్వాతంత్ర్యోద్యమంలో చివరి ఘట్టమని అన్నారు గాంధీజీ. ఈ ఉద్యమంలో ఆంధ్రులు ప్రధాన పాత్ర వహించారు. ఆంధ్రకేసరి ప్రకాశం, డా॥ పట్టాభి, కాళేశ్వరరావు, నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలైన నాయకులందరూ అరెస్టయ్యారు. ఎప్పుడైతే నాయకులు కనబడకుండా పోయారో ప్రజల దౌర్జన్యం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, పోలీస్‌స్టేషన్లు పరశురామప్రీతి అయ్యాయి. చెలరేగిన యువకులు టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగెలను తెంచారు. దాదాపు ఆరుమాసాల వరకు క్విట్ ఇండియా బ్రిటీష్ పాలకులను అట్టుడికించింది. వేలాదిమంది ప్రజలు జైళ్ల పాలయ్యారు.

## తెలంగాణలో . . .

తెలంగాణలో తెలుగు ప్రజలకు, తెలుగుభాషకు ఆదరణలేని రోజుల్లో నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం పుట్టింది. దీనితో దక్కను పీఠభూమి, దక్కను సంస్కృతి, దక్కను భాష అనే ముక్కాలిపీఠం విరిగిపోయింది. ఆంధ్రనాయకులు దక్కను రాజధాని వదిలి పల్లె పల్లెకు ప్రయాణమయ్యారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీ వికాసం మొదలైన నినాదాలతో తాము మేల్కొని, ఇతరులను మేల్కొలిపారు. ఆంధ్ర జనసంఘం తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడటానికి గ్రంథాలయాలను స్థాపించింది. రైతు బాధలను తొలగించడానికి రైతు సంఘాలను నెలకొల్పింది. వ్యాపార పరిస్థితులను బాగుపరచటానికి వర్తక సంఘాలను ప్రోత్సహించింది.

వీటన్నిటింటికీ ఒకే కేంద్ర సంఘం ఉండాలనే తలంపుతో 1931లో నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ ఏర్పడింది. తెలంగాణాలో ఆంధ్రోద్యమాలంటే స్వాతంత్ర్యోద్యమాలే. రాజకీయ సమావేశాలు జరుపుకునే అవకాశం లేకపోవటంతో సాంఘిక సమస్యల మాటున వీటిని జరుపుకోవలసి వచ్చింది. తెలంగాణా ప్రజలను మేల్కొలిపిన మొదటి నాయకుడు ఆంధ్రాపితామహ మాడపాటి హనుమంతరావుగారు.



కొండా వెంకట రంగారెడ్డి

1938 జూలైలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భవించింది. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, రావి నారాయణరెడ్డి ఆ పార్టీ నిర్మాతలలో ముఖ్యులు. కానీ ప్రభుత్వం దీన్ని వెంటనే నిషేధించింది. ప్రథమ సత్యాగ్రహం 1938 అక్టోబరు 27న సుల్తాన్‌బజార్ వద్ద జరిగింది. తెలంగాణ నుంచి ఆనాటి యువనాయకుడు (తరువాత కమ్యూనిస్టు



కల్లూరి చంద్రమౌళి

నాయకుడు) రావి నారాయణ రెడ్డి అరెస్టయ్యారు. స్వామీజీ లాంటి నాయకుడి కాళ్ళకు సంకెళ్లు తగిలించారు. జైల్లో మనుషులు చేయలేని పనులు చేయించారు. కడు హీనమైన ఆహారం పెట్టి నిర్బంధించారు. ముఖ్యంగా ఆర్య సమాజ్ కార్యకర్తలను అమానుషంగా హింసించారు.

1938-39 ప్రాంతంలో ఉస్మానియా యూనివర్సిటి హాస్టల్ విద్యార్థులు నిజాం ప్రభుత్వం నిర్దేశించిన ప్రార్థనాగీతం పాడటానికి నిరాకరించి వందేమాతరం పాడుకున్నారు. అయితే ఈ గీతాన్ని పాడుకోరాదని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు లక్ష్య పెట్టలేదు. నిర్బంధం కఠినమైన కొద్దీ ఉద్యమం తీవ్రత ఎక్కువైంది. దాదాపు 1200 మంది విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. తరువాత కొంతకాలానికి అధికారులే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవలసి వచ్చింది.

హైదరాబాద్ రాష్ట్రంలో ఆ రోజుల్లో జరిగిన వందేమాతరం ఉద్యమం యావద్దేశాన్ని కదిలించింది. నేతాజీ సుభాష్‌చంద్రబోస్, సావర్కర్, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన నాయకులు విద్యార్థుల వెన్నుతట్టి సందేశాలు పంపించారు. వందేమాతరం గీతం పాడు కోవడం విద్యార్థులు తమ హక్కుగా భావించుకోవాలని మహాత్ముడు తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణా నుంచి బహిష్కరణకు గురైన విద్యార్థులకు అచ్యుతరెడ్డి, నూకల రామచంద్రారెడ్డి దన్నుగా నిలిచారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, పి.వి. నరసింహారావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ధర్మ భిక్షం వందేమాతరం ఉద్యమ నాయకులే.

హైదరాబాద్‌లో మందుముల నర్సింగరావుగారు నడుపుతున్న 'రయ్యత్' (రైతు) అనే ఉర్దూ దిన పత్రికను ప్రభుత్వం నిషేధించింది. గోలకొండ పత్రిక సగభాగం సెన్సార్ నిబంధలకు గురై అనేక బాధలు పడింది. మందుముల వారి సహచరుడు ఉత్సాహవంతుడైన యువకుడు షోయబుల్లాఖాన్ 'ఇమ్‌రోజ్' (ఈరోజు) అనే దిన పత్రికను జాతీయ భావాలతో ప్రారంభించాడు. రజాకార్ల దురంతరాలు రోజు రోజుకి పెరిగి పొయ్యాయి. దీన్ని భరించని జాతీయ ముస్లిం ప్రముఖులు - జనాబ్ మంజూర్ జంగ్, ముల్లా అబ్దుల్ బాసిత్, సయ్యద్ మహమ్మద్ హుసేన్ జాఫ్రీ, లూకర్ అలీమిర్జా, అహమద్ మిర్జా, ఫరీద్ మిర్జా, హుసేన్ అబ్దుల్ సమద్ రజాకార్ల దుశ్చర్యలను ఖండిస్తూ ప్రకటనలు చేశారు. వాటిని ఇమ్రోజ్ పత్రిక ప్రకటించింది. ఇది చదివి కుపితులైన రజాకార్లు అర్ధరాత్రి షోయబ్‌ల్లాఖాన్‌ను దారుణంగా హత్యచేశారు. షోయబ్ మరణం పోలీసు చర్యను త్వరితం చేసింది.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభిస్తే నిజాం నవాబు తనకు స్వాతంత్ర్యం లభించినట్లు పగటికలలు కన్నాడు. స్టేటు కాంగ్రెస్ తన ఉద్యమాన్ని ఉధృతం చేసింది. దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ఎదుర్కొంది. ఈ ఉద్యమం దావాలనంలా రాష్ట్రమంతటా వ్యాపించింది. ఈ ఉద్యమ కాలంలో 14 వేల మంది వాలంటీర్లు అరెస్టయ్యారు. 15 వేల మంది విద్యార్థులు పాఠశాలలను బాయ్‌కాట్ చేశారు. 6 వేల మంది గ్రామోద్యోగులు తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం వసూలు చేసే లెవీ సగానికైనా వసూలు కాకుండా చేశారు.



దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

ఈ పోరాటంలో 615 పోలీసుస్టేషన్లను, రజాకార్ల శిబిరాలను ధ్వంసం చేశారు. సంస్థానం చుట్టూ కృత్రిమ సరిహద్దులుగా ఉన్న 750 కరోడ్గిరి స్టేషన్లలో (కస్టమ్స్) 500 స్టేషన్లను నిర్మూలించారు. పోరాట కేంద్రాలను సంస్థానం బైటనుంచి నడిపారు. బెజవాడలో ఏర్పడిన శిబిరాలను జములాపురం కేశవరావు, హయగ్రీవాచారి, వి.బి.రాజులు నడిపారు. కోలాపూర్ శిబిరాన్ని కొండా లక్ష్మణ్, చందా శిబిరాన్ని పి.వి. నరసింహారావు, కె.వి. నరసింగరావులు నిర్వహించారు. ప్రాణాలకు జంకక వీరు పోరాడారు.

1948 సెప్టెంబరు 13వ తేదీన హైదరాబాద్ రాష్ట్రంపై పోలీసు చర్య ప్రారంభమైంది. సంస్థాన సైనికులు భారత సైన్యంతో ఎక్కడా పోరాటమే జరపలేదు. వారి వద్ద అధునాతన ఆయుధాలు లేవు. స్థానిక ప్రజల సహకారం అసలే లేదు. ముఖాముఖి యుద్ధం దాదాపు జరగనే లేదు. 1948 సెప్టెంబరు 17న నిజాంరాజు నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదర్ ఆసఫ్‌జాహీ వంశపు 240 సంవత్సరాల పరిపాలనకు వీడ్కోలు పలికాడు.

1956 నవంబరు 1వ తేదీన హైదరాబాద్ రాష్ట్రంలోని మరట్వాడా జిల్లాలు సంయుక్త బొంబాయి రాష్ట్రం (ఇప్పటి మహారాష్ట్ర)లోను, కర్నాటక జిల్లాలు మైసూరు రాష్ట్రం (ఇప్పటి కర్నాటక) లోను, తెలంగాణా జిల్లాలు ఆంధ్రరాష్ట్రం (ఇప్పటి ఆంధ్రప్రదేశ్)లోను కలిసిపోయాయి. ఇది తెలుగు వారి (ఆంధ్రుల) ప్రజారాజ్యం.

*- జి. వెంకట రామారావు*

# సహజవనరుల సంరక్షణతోనే సుస్థిర జీవనోపాధులు - అపార్డ్ కమీషనర్

## అటవీ సంరక్షణకు నడుంబిగించిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

**పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టి ప్రకృతి సంపదను పెంపొందించుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి అన్నారు. సహజవనరుల సంరక్షణతో ప్రజలకు సుస్థిర జీవనోపాధులు కల్పించగలుగుతామని, చీదేడు గ్రామ సరిహద్దులలో గల అటవీ భూములను సంరక్షించటానికి గ్రామంలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు నడుం బిగించటం ఆదర్శనీయమని అన్నారు.**

అంతకు ముందు చీదేడ్ సరిహద్దులలో గల బోడికొండపై భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో విత్తనాలు నాటే కార్యక్రమం కోసం వేప, గానుగ విత్తనాలను రంగారెడ్డి డి.ఎఫ్.ఓ. (సోషల్ ఫారెస్ట్రీ) జి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా అపార్డ్ కమీషనరు మాట్లాడుతూ అటవీ సంరక్షణ పట్ల భారత్ నిర్మాణ్ వాలంటీర్లు దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ 1930లో చిత్తూరు కలెక్టర్ గ్రీమ్స్ ఇదే పద్ధతిలో చిత్తూరు పరిసర ప్రాంతాలలోని కొండలపై ఎర్ర చందనం విత్తనాలు నాటటం వల్ల నేడు ఆ చెట్ల విలువ రూ. 500/- కోట్లు దాటిందని వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు నేటి యువత నడుంబిగించినట్లయితే, సమీప భవిష్యత్‌లో దేశంలో పర్యావరణ సమతుల్యత సాధ్యమేనన్నారు. గ్రామంలో ఇప్పటికే అమలులో ఉన్న కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. డి.ఎఫ్.ఓ. నాగేశ్వరరావు మాట్లాడుతూ చీదేడు గ్రామంలో జరుగుతున్న ప్రగతి అద్భుతమని అన్నారు. దేశం నాకు ఏం ఇచ్చింది అన్న భావనతో కాకుండా దేశానికి నేను ఏం ఇచ్చాననే భావనకు ఈ గ్రామం ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. చీదేడు గ్రామాన్ని సందర్శించిన అపార్డు కమీషనరు గ్రామంలో కీ - క్యాప్ కార్యక్రమం అమలుతీరుని సమీక్షించారు.

గ్రామంలో బహిరంగమల విసర్జన కోసం కృషి చేస్తున్నట్లు పారిశుధ్య కమిటీ చైర్మన్ శ్రీ తోడె సత్తెయ్య అపార్డు కమీషనరుకి వివరించారు. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ&ఇడలేని 130 కుటుంబాల వారిని ప్రేరేపించి భారత నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో ఇప్పటికే 30 మరుగుదొడ్లు పూర్తి చేయటం జరిగిందన్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ శ్రీమతి అనసూయ మాట్లాడుతూ కీ - క్యాప్ స్ఫూర్తితో గ్రామంలో అమలు అవుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసామని, గ్రామంలో ముగురు కాల్వల నిర్మాణం, మంచి నీటి నిల్వ చేసుకొనే సంపు నిర్మాణం పూర్తి చేయటం జరిగిందని చెప్పారు.

భారత్ నిర్మాణ్ వాలంటీర్ వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామంలో రహదారి కిరువైపులా 600 మొక్కలు నాటామని తెలియచేసాడు. ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. కార్యక్రమంలో వ్యవసాయ బావుల మరమ్మత్తు పనులకు ఇప్పటికే 10 బావులకు అనుమతి వచ్చిందని మిగిలిన బావులకు అనుమతుల ప్రక్రియ గతిలో ఉందని ఎం.పి.డి.ఓ. యాదయ్య తెలియచేసారు. బావుల పూడికతీత పనులను అపార్డ్ కమీషనర్ కొబ్బరికాయ కొట్టి మొదలుపెట్టారు.

గ్రామంలో సుమారు 130 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం మొదలు కావటంతో నిర్మాణ్ సామాగ్రికి గ్రామంలో ఏర్పడిన గిరాకీని, గ్రామస్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని హనుమాండ్ల స్వామి ప్రారంభించిన హాలో బ్రిక్స్ యూనిట్‌ను అపార్డ్ కమీషనరు సందర్శించి, జీవనోపాధుల సరళిపై చర్చించారు. అనంతరం గ్రామంలో దేవరకొండ లక్ష్మమ్మ గృహాన్ని సందర్శించుకొని ఆమెతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు హెచ్. కూర్మారావు, సుభాష్‌గౌడ్, డా॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్, మాధురి, ఎం.పి.డి.ఓ. యాదయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అనిత, ఆర్. డబ్ల్యు, ఎస్.డి.ఇ., సి.హెచ్. విజయలక్ష్మి, జె.ఇ., ఎ. రవికుమార్, పర్యావరణ ప్రేమికురాలు శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి, గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, గ్రామ పెద్దలు శంకరయ్య, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు. ■

# రాయలసీమ రాజకీయ భీష్మ

## కల్లూరు సుబ్బారావు



**నిద్రాణమైన రాయలసీమ ప్రజలను తట్టిలేపి జాతీయోద్యమానికి స్ఫూర్తి నిచ్చిన రాయలసీమ రాజకీయ నాయకులలో అగ్రగణ్యులు కల్లూరు సుబ్బారావు.**

కల్లూరువారు అనంతపురం జిల్లా హిందూపురం తాలూకాలోని కల్లూరులో 1897 మే 25న కరణం సూరప్ప, పుట్టమ్మ దంపతులకు జన్మించారు. కల్లూరులో ప్రాథమిక విద్యను ముగించి మదనపల్లి, బెంగుళూరులో ఉన్నత విద్య సభ్యసించారు. మెట్రిక్యులేషన్ పరీక్ష రాయక 'విద్వాన్' పట్టభద్రులై కొంతకాలం ఉపాధ్యాయులుగా పనిచేశారు. 1913లో హోమ్‌రూల్ ఉద్యమనాయకులు అనిబీసెంట్ ఉపన్యాసాలు విని, ఉత్తేజితులై జాతీయోద్యమంలో పాల్గొన్నారు. 1918లో గాంధీజీ రాయలసీమలో పర్యటిస్తూ చేసిన ఉపన్యాసాలు విన్న సుబ్బారావు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1918లో, 1921లో, మద్య నిషేధ ప్రచారంలో పాల్గొన్నందుకు ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 1930లో ఒక ఏడాది కఠిన శిక్ష, 1932లో శాసనోల్లంఘన చేసినందుకు ఒక ఏడాది కఠిన శిక్ష, 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఒక ఏడాది శిక్ష, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు రెండేళ్ళ శిక్ష, ఈ రీతిగ మొత్తం ఏడేళ్ళు కారాగార శిక్ష అనుభవించారు.

రావుగారు అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో సభ్యులుగాను, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో సభ్యులుగాను రెండుమార్లు కార్యదర్శిగాను, కాంగ్రెస్ సంస్థను పటిష్టం చేశారు.

1937 ఫిబ్రవరిలో పెనుకొండ నియోజక వర్గం నుండి, మద్రాసు శాసనసభకు 11 వేల మెజారిటితో ఎన్నుకోబడినారు. శాసనసభలో అనంతపురం జిల్లా కరువు పరిస్థితులను గురించి వివరించారు. ప్రభుత్వం కరువు నివారణ కమిటీని నియమించింది. హిందూపురం పరిధిలో కుముద్వతీ నదిపై ప్రాజెక్టు స్థాపనకు తీవ్రంగా కృషిచేశారు. 1946,1952,1955,1962లో జరిగిన ఎన్నికలలో విజయం సాధించారు. రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యులుగా, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. తన అనర్గళమైన వాక్పటిమతో ప్రజలను ఉర్రూతలూగించేవారు. మద్రాసు శాసనసభలో విశ్వవిద్యాలయ విద్యను గురించి సుబ్బారావు చేసిన ప్రసంగం విన్న కట్టమంచి రామలింగారెడ్డి సుబ్బారావును అమాంతంగా కౌగలించుకొన్నారు. మద్రాసు శాసనసభ్యుడుగా వున్నప్పుడు రాజ్యంగసభ సభ్యుడుగా ఎన్నుకోబడినారు.

రాయలసీమ ప్రజా ప్రయోజనాలకోనం జరిగిన శ్రీబాగ్ ఒడంబడికలో సుబ్బారావు సంతకం చేశారు.

సుబ్బారావు గొప్ప పుస్తక ప్రేమి. 1955-61 మధ్య రెండుమార్లు అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా పనిచేశారు. ఎన్నో ప్రైవేట్ గ్రంథాలయాలకు విరాళాలందజేశారు. రచయితలను బాగా ప్రోత్సహించారు. విశ్వవిఖ్యాత గ్రంథాలయ శాస్త్రవేత్త డా. ఎస్.ఆర్. రంగనాథన్ అనంతపురం జిల్లాలోని గ్రంథాలయాన్ని దర్శించి, సుబ్బారావు చేసిన కృషిని గమనించి, 'సంచార గ్రంథాలయం' అని సుబ్బారావును ప్రశంసించారు. సుబ్బారావు పేర ధర్మవరం, కళాజ్యోతిలో ఒక అవార్డును ప్రతి ఏటా ఉత్తమ సంఘసేవకునికిచ్చి సత్కరిస్తున్నారు.

1923-24లో 'లోకమాన్య'అనే పత్రికను ప్రారంభించి, ఆ పత్రిక సంపాదకులుగా సాహిత్య, సాంస్కృతిక సంస్థల నెంతగానో ప్రోత్సహించారు.

లేపాక్షిని గొప్ప కళాక్షేత్రంగా పెంపొందించడానికి అవిశ్రాంత కృషి చేశారు. కేంద్రప్రభుత్వం నుండి లేపాక్షికి గుర్తింపు సాధించి అందలి కళాప్రాభవాన్ని విశదీకరించే ఒక గ్రంథం రాశారు.

రావుకు సాహిత్యం, కళలపై ఎనలేని అభిరుచి వుండేది. లేపాక్షి గ్రామాల్లో 9 మీటర్ల పొడవు, 6 మీటర్ల ఎత్తున వున్న రాతి బసవన్నను చూసి పరవశంతో కళాతపస్వి అడవిబాపిరాజు రాసిన గీతం చిరస్మరణీయం.

'లేపాక్షి బసవయ్య లేచి రావయ్య. కైలాస శిఖరిలా కదిలి రావయ్య. హూకరించిన దెసలు వూగిపోయేను. ఖురముతో దువ్వితే కులగిరులు వణికేను. ఆకాశగంగకై అఱ్ఱెత్తి చూస్తేను. పొంగేటి పాల్కడలి గంగడోలాడేను... పెన్నొండసీమలో, ఒంగోలు భూమిలో నీ వంశమీనాడు నిలచింది గర్వాన'' అంటూ లేపాక్షి బసవయ్య కళాప్రతిభ ఖండాతరాలకు వ్యాపించడానికి కారకులు కల్లూరు సుబ్బారావు.

అనంతపురం పట్టణకేంద్రంలో తనకున్న విలువైన స్థలాన్ని ఉచితంగా అందజేసి రాయలసీమకే తలమానికంగా వుండే లలితకళాక్షేత్రంగా పెంపొందించారు. పట్టు (గుత్తి) కేశవపిళ్ళై స్మృతి చిహ్నంగా కేశవ విశ్వవిద్యాలయం అనే హరిజన విద్యార్థి వసతి గృహాన్ని స్థాపించడానికెంతో కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పేరుగడించిన దామోదరం సంజీవయ్య ఈ వసతి గృహంలో వుండి చదువుకొన్నారు.

గాంధీజీ ఆశించిన బేసిక్ విద్యా విధానాన్ని ప్రోత్సహించడానికి, హిందూపురంలో సేవామందిరం అనే ఆదర్శ విద్యాకేంద్ర స్థాపనకు 1942లో మిత్రులు లింగణను ప్రోత్సహించారు. ఈ విద్యాలయాన్ని రాజాజీ ప్రారంభించారు.

పెనుకొండలోని గగనమహల్‌లో శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకోత్సవాలను అత్యంత వైభవంగా (1929) నిర్వహించారు. అపుడేర్పడిన రాయలసీమ కళాపరిషత్తుకు చాలాకాలం అధ్యక్షులుగ సేవలందించారు. దేశసేవ కంకితమైన సుబ్బారావు షష్టిపూర్తి ఉత్సవాల సందర్భంగా విశ్వనాథ సత్యనారాయణ, జమ్మలమడక మాధవరామశర్మ ప్రభృతులు, తమ కృతులను సుబ్బారావుకు అంకితం చేశారు. 'మహారాణా ప్రతాపసింహ' కావ్యకర్త, దుర్భాక రాజశేఖర శతావధానిని వజ్రకిరీటంతో సత్కరించారు. 1944 మే 22న సేవా మందిరంలో విజయ మంటపంలో 'శివభారత' కావ్యకర్త గడియారం శేషశాస్త్రికి గండపెండేరం తొడిగారు.

యువకులు తమ ఆరాధ్యులైన ముగ్గురు ఊర్లను, కల్లూరు, పప్పూరు ఇల్లూరు, (నీలం సంజీవరెడ్డి) గార్లను త్రిమూర్తులుగా భావించి గౌరవించేవారు. ఒక యువకుడు ''కాంగ్రెస్ మీకేమిచ్చింది అని ప్రశ్నించగా, కాసులేని కల్లూరు సుబ్బారావును, యం.ఎల్.ఏ చేసింది అని రకీమనిచెప్పి యువకుణ్ణి నిరుత్తరుని కావించారని, రావినూతల శ్రీరాములు పేర్కొన్నారు.

యువకులైన నీలం సంజీవరెడ్డి, విద్వాన్ విశ్వం, ఐదుకల్లు సదాశివన్ తరిమెల నాగిరెడ్డిగార్లను స్వాతంత్ర్యోద్యమంలో దూకునట్లు ప్రేరేపించిన నాయకులు కల్లూరు సుబ్బారావు.

1967లో భారతప్రభుత్వం, కల్లూరు వారిని 'పద్మశ్రీ' ప్రశస్తితో గౌరవించింది. సుబ్బారావు ప్రసంగాలు సూక్తులతో శ్రోతలను అలరించేవి. కాయకష్టం విశిష్టతను తరచుగా చెప్పేవారు. కాపు (రైతు) పదానికి వారి నిర్వచనం ఎంతో యుక్తి యుక్తంగా వుండేది. ''పిడికెడు గింజలు చల్లి, పుట్టెడు ధాన్యం పండించి పిపీలికాది బ్రహ్మపర్యంతం కాపాడేవాడే కాపు''. కదురు, కవ్వం, కాడి, ఏ ఇంట్లో ఆడుతుంటాయో పేదరికం, ఆ ఇంటి దరిదాపునకు చేరవనేవారు.

కవిత్వమంటే లయబద్ధమైన శబ్దప్రవాహమని, బాధనుండి పుట్టుకు రావాలని నిర్వచించారు. వారి ప్రతిభకు పండిత కవులు ఆశ్చర్య పోయేవారు.

సుబ్బారావు దళిత జనమిత్రుడు. తన కుమార్తె పెండ్లి సందర్భంగా, తన ఇంట మాలలకే పెత్తనమిచ్చారు. చాందసులు పెళ్ళి పందిరి నుండి వెళ్ళిపోగా 'మీ ఇష్టం. నాకు కులం లేదు, నాది గాంధీకులం' అని వివాహం జరిపారు. 1938 మే నెలలో తన తండ్రి శ్రాద్ధకార్యం నాడు, కేశవ నికేతనంలోని అరవై మంది హరిజన బాలురకు మృష్టాన్నం పెట్టించారని కేశవ నికేతనం నిర్వాహకుడు అంజనప్ప కృతజ్ఞతలు తెలిపాడు. ఆంధ్ర రాష్ట్ర హరిజన సేవక సంఘాధ్యక్షులుగా సేవ చేసిన మానవతావాది సుబ్బారావు.

జీవితాంతం వారు పదవులకు ప్రాకులాడక ప్రజాసేవలో గడపిన సేవా పరాయణులు 1953 సంవత్సరంలో రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్) తర్వాత రెండేండ్లు శాసనసభ ఛీవ్‌విప్‌గా ఎన్నుకోబడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనెట్ సభ్యులుగా ఏడేళ్ళు పనిచేశారు.

సుబ్బారావు సప్తతి ఉత్సవాలు 1967లో జరిగాయి. ఆ తర్వాత పక్షపాత వ్యాధిగ్రస్తులై శరతల్పగతుడైన భీష్ముని గుర్తుకు తెచ్చేవారు. సుబ్బారావు గారి పట్ల అపార గౌరవం కల రాష్ట్రపతి వి.వి.గిరి గారు హిందూపురం వచ్చి, వారిని పరామర్శించారు.

అర్ధ శతాబ్దం పాటు తను, మన, ధనములతో ప్రజాసేవ చేసిన కల్లూరు సుబ్బారావు 1973 డిసెంబర్ 23న హిందూపురంలోని స్వగృహం 'భారత కుటీరం'లో తుది శ్వాస వదిలారు.

చింతలపాటి బాపిరాజు సంస్థకు చెందిన మూర్తిరాజు, హిందూపురంలో వారి పేర, ఓరియంటల్ పాఠశాల ప్రారంభించారు. 17-12-1981న హిందూపురం పార్కులో సుబ్బారావుగారి కాంస్య విగ్రహం ప్రతిష్ఠంపబడింది.

స్వాతంత్ర్య సమరయోధులుగ, మహావక్తగా, పరిపాలనా దక్షులుగా, పండితుడుగా, సాహిత్య పోషకులుగా సువిఖ్యాతిగాంచిన కల్లూరు సుబ్బారావు చిరస్మరణీయులుగా చరిత్రకెక్కిన మహామనిషి.

'రాయలసీమ రాజకీయ జీవితమే సుబ్బారావుగారు. సుబ్బారావుగారే రాయలసీమ జీవితం'

**- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

# షెడ్యూల్డు తెగల సంక్షేమానికి అమలు జరిగే పథకాలు





**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన తెగల సమగ్ర అభివృద్ధికై నవీకరణ ప్రాంత అభివృద్ధి సంస్థ (మాడా), గిరిజన ఆర్థిక సహాయ సహకార సంస్థ (ట్రైకార్), జాతీయ షెడ్యూల్డు తెగల ఆర్థికాభివృద్ధి సంస్థల ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు పరుస్తోంది.**

**గిరిజన తెగలు:** రాష్ట్రంలో ప్రధానంగా 3 రకాల గిరిజన తెగలు ఉన్నాయి.

**అ) లంబాడ** - మీరు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఎటువంటి వాతావరణంనైనా తట్టుకొని శ్రమించటంలో దిట్టలు.

**ఆ) ఎరుకల** - వీరి ప్రధాన వృత్తి తట్టలు, బుట్టలు అల్లటం, పందుల పెంపకం.

**ఇ) ఆదిమ తెగలు** - వీరు ప్రధానంగా అడవులలో నివసిస్తూ, అటవీ ఉత్పత్తుల సేకరణ వృత్తి కలిగి ఉండి, పోడు వ్యవసాయం లేదా చిన్న కమతాల వ్యవసాయం చేస్తారు. ఉదా॥ చెంచులు, కోయ, గోండ్, యానాది, గుత్తికోయలు, కొండరెడ్లు మొ॥గు వారు.

**గిరిజనుల సాంఘిక ఆర్థిక పరిస్థితులను అభివృద్ధి చేయటానికి గాను ఈ దిగువ చూపబడిన కార్యాచరణ ప్రణాళిక అమలవుతోంది.**

1. మాడా, 2. డిటిజి, 3. ట్రైకార్ (ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ) ఎన్.యస్.టి.యఫ్.డి.సి. (జాతీయ షెడ్యూల్డు తెగల ఆర్థికాభివృద్ధి సంస్థ) ద్వారా ఉపాధి పథకాలు ఆదివాసి మహిళా స్వశక్తి కరణ్ యోజన (ఏ.యం.యస్.వై.) మొదలగునవి అమలు జరుగుతున్నాయి.

**1. మాడా, డిటిజి గ్రామాల వివరణ**

- గ్రామ జనాభాలో 50 శాతం కంటె ఎక్కువ గిరిజన జనాభా గల ప్రాంతాలను మాడా పాకెట్లుగా గుర్తిస్తారు.
- 50 శాతం కంటే తక్కువ గిరిజన జనాభా గల ప్రాంతాలను మాడాయేతర గ్రామాలు (డిటిజి) గా గుర్తించి మాడా పథకంలోని నిబంధనల ప్రకారంగానే ముఖ్యంగా భూ ఆధార పథకాలు, అనగా చిన్న నీటి పారుదల, వ్యవసాయం, పండ్ల తోటల పెంపకం, వ్యాపార సంబంధమైన చిన్న తరహా వ్యాపారం, మత్స్యపరిశ్రమ, పశు సంవర్ధక పథకాలు, రవాణా పథకాలపై ఆధారపడిన గిరిజనులకు, చదువుకున్న నిరుద్యోగులకు శిక్షణ కార్యక్రమాలకు గాను ఆర్థిక సహాయం చేస్తున్నారు.

**అర్హత, ఎంపిక విధానం:** దారిద్ర్య రేఖకు దిగువన వున్న నిరుపేద గిరిజన కుటుంబాలకు, ప్రత్యేకించి వెట్టి చాకిరీకి గురియైన కూలీలు, ఆడ పిల్లల అమ్మకం క్రింద బాధితులైన కుటుంబాలు, అత్యాచారాలకు గురైన మహిళలకు వివిధ పథకాల ద్వారా వారి వారి ఆర్థిక స్థోమతను పరిగణనలోనికి తీసుకొని గ్రామ సభల ద్వారా మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య వారి సమక్షంలో ఎంపిక చేసిన ప్రతిపాదిత లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చేస్తారు. ప్రతిపాదిత లబ్ధిదారులు గతంలో ప్రభుత్వం అమలు చేసే ఏ ఇతర శాఖల నుండి ఆర్థిక సహాయం పొందని వారై ఉండాలి. చిన్ననీటి పారుదల, పండ్లతోటల పెంపకం, ఎత్తిపోతల పథకం, పాడి పరిశ్రమ సెక్టారు నందు వివిధ పథకాలకు ఆర్థిక సహాయం పొందడానికి గాను 2.00 ఎకరాల భూమి కంటే తక్కువ, 5.00 ఎకరాలు మించి వుండరాదు. ఆయా మండలాలకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ గ్రామాలను, ఇంతకు ముందు మాడా ద్వారా ఆర్థిక సహాయం పొందని గ్రామాలను, గతంలో తక్కువ శాతం పథకాలు అమలు చేపట్టిన గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలలో కార్యాచణ ప్రణాళికయందు ప్రతిపాదించబడిన పథకం అమలు చేస్తారు.

బ్యాంకు సంబంధంమైన పథకాలకు ఈ దిగువ చూపిన విధంగా ఆర్థిక సహాయము మంజూరు చేస్తారు.

- మొత్తం పథకం విలువలో 50 శాతం కండీషనల్ గ్రాంట్ (రూ॥ 10,000/-లకు మించకుండా)
- మొత్తం పథకం విలువలో 10 శాతం లబ్ధిదారులకు వాటా ధనం
- మొత్తం పథకం విలువలో 40 శాతం బ్యాంకు అప్పు

**2. జాతీయ షెడ్యూల్డు కులాల తెగల ఆర్థిక అభివృద్ధి సంస్థ (యన్.యస్.టి.యఫ్.డి.సి.) కార్యాచరణ ప్రణాళిక ద్వారా అమలు పరిచే పథకాలు:**

అ) **స్వయం ఉపాధి పథకాలు:** ఈ పథకాలు జాతీయ షెడ్యూల్డు తెగల ఆర్థిక సహకార సంస్థ (యన్.యన్.టి.యఫ్.డి.సి.) ద్వారా నిర్ణయించిన లక్ష్యం ప్రకారం నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయడానికి గాను పత్రిక ప్రకటన జారీ చేసి ధరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుంది. ధరఖాస్తులు కార్యాలయానికి నిర్ణీత గడువులోగా అందిన తర్వాత శ్రీయుత జిల్లా కలెక్టర్, చైర్మన్ గారి ఆధ్వర్యంలో జిల్లా ఎంపిక కమిటి ద్వారా దరకాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన ధరఖాస్తుదారులను తాత్కాలికంగా ఎంపిక చేయడం జరుగుతుంది. అట్టి ఎంపికైన దరఖాస్తుదారుల ప్రతిపాదనలను సంబంధిత మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యలు, సంబంధిత మండల అభివృద్ధి అధికారి గార్ల ద్వారా ప్రతిపాదనలు తెప్పించిన పిదప వారికి ఆర్థిక సహాయం మంజూరు చేయడం జరుగుతుంది. అట్టి మంజూరైన పథకం మండల సమాఖ్య, సంబంధిత గ్రామ సమాఖ్యల ద్వారా ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 76 సాంఘిక సంక్షేమం (గినం. జిసిసి. 1) శాఖ తేది: 21-9-2005 నిబంధనలు, యన్.యస్.టి.యస్.డి.సి. నిబంధనలకు లోబడి గ్రౌండింగ్ చేయడం జరుగుతుంది. మంజూరు చేసిన డబ్బును టర్మ్‌లోన్ 7 శాతం వడ్డీతో, 4 శాతం వడ్డీతో మార్జిన్ మని సంబంధింత లబ్ధిదారుల నుండి (60) నెలసరి వాయిదాలలో సంబంధిత మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య ద్వారా వసూలు చేస్తారు.

ఆ) **ఆదివాసి మహిళా స్వశక్తికరణ్ యోజన పథకం:** ఈ పథకం ద్వారా నిర్ణయించిన లక్ష్యం మేరకు గిరిజన మహిళలకు వ్యక్తిగత ఆర్థిక సహాయం నిమిత్తం వివిధ పథకాలు అమలు చేయడం జరుగుతుంది. ఎంపిక విధానం యన్.యన్.టి.యఫ్.డి.సి. పథకాలకు అమలుచేసే విధానమే దీనికి కూడా వర్తిస్తుంది. ఇట్టి పథకానికి గాను వితంతువు, విడాకులు పొందిన మహిళలకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుంది.

- వయో పరిమితి : 18 - 45 సంవత్సరాలు అర్హులు.
- ఆదాయ పరిమితి : గ్రామీణ ప్రాంతం వారికి రూ॥ 39,500/- పట్టణ ప్రాంతం వారికి 54,500/-లు మించరాదు.
- ఇట్టి పథకం ద్వారా రెండవ దఫా ఆర్థిక సహాయం పొందగోరే వారు గతంలో లబ్ధిపొందిన ఋణం పూర్తిగా చెల్లించిన వారు దరఖాస్తు చేసుకోవటానికి అర్హులు.

## అమలు జరుగుతున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలు

### 1. భూమి కొనుగోలు పథకం

18 సం॥ల నుండి 60 సం॥ల వయస్సు మించిన భూమి లేని నిరుపేద గిరిజన మహిళలు అర్హులు.

| | | |
|---|---|---|
| పథకం విలువ | - | రూ. 54,000/- |
| సబ్సిడి (ఆప్షన్) | - | రూ. 10,000/- |
| గ్రాంటు | - | రూ. 44,000/- |



## 2. చిన్న నీటి పారుదల పథకం

**అ) బోరు, సబ్ మెర్సిబుల్ పంపుసెట్ల పథకం:**

18 సం॥ నుండి 50 సం॥ల వయస్సు మించని నిరుపేద గిరిజనులు 5 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి కలిగి వున్నవారు అర్హులు, ఒక పథకానికి ఇద్దరు గిరిజనులు మించకుండా వుండాలి.

| | | |
|---|---|---|
| పథకం విలువ | - | రూ. 38,900/- |
| సబ్సిడి (అప్షన్) | - | రూ. 10,000/- |
| గ్రాంటు | - | రూ. 5,000/- |
| బ్యాంకు అప్పు/సి.ఐ.ఎఫ్. అప్పు | - | రూ. 23,900/- |

**ఆ) డ్రిప్ ఇరిగేషన్ / మైక్రో ఇరిగేషన్:** 18 సం॥ నుండి 60 సం॥ల వయస్సు మించిన నిరుపేద గిరిజనులు 2 ఎకరాలు భూమి కలిగి వుండాలి. ఇద్దరు లేదా అంతకు మించి వారు 2 1/2 ఎకరాల భూమి కల్గివున్నవారు అర్హులు. ఇట్టి పథకం సహాయ సంచాలకులు, ఉద్యాన వనశాఖ (హార్టికల్చర్/పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)/ ఆంధ్రప్రదేశ్ చిన్న నీటి పారుదలశాఖ (ఎపియంఐపి) వారి సహకారంతో అమలు చేయబడును.

| | | |
|---|---|---|
| డ్రిప్ ఇరిగేషన్ పథకం విలువ | - | రూ. 40,000/- హెక్టారుకు |
| నాన్-సబ్సిడి మాడా ద్వారా 40% | - | రూ. 16,000/- |
| జట్రోఫా నిమిత్తం 10% | | |
| 60% సబ్సిడి ద్వామా నుండి | - | రూ. 24,000/- |
| స్ప్రింక్లర్ పథకం విలువ | - | రూ. 12,000/- హెక్టారుకు |
| నాన్-సబ్సిడి మాడా ద్వారా 50% | - | రూ. 6,000/- |
| 50% సబ్సిడి డ్వామా నుండి | - | రూ. 6,000/- |

**ఇ) బావి త్రవ్వకం:** 18 సం॥ నుండి 50 సం॥ల వయస్సు మించని నిరుపేద గిరిజనులు 2 1/2 ఎకరాల భూమి కలిగియుండి దరఖాస్తుదారులు ఇద్దరికి మించకుండా వుండాలి. భూగర్భశాఖ వారి ధృవీకరణ పత్రం పొంది విద్యుత్ సదుపాయం కలిగి ఉన్నవారు అర్హులు.

| | | |
|---|---|---|
| పథకం విలువ | : | రూ. 32,500/- |
| సబ్సిడి (అప్షన్స్) | : | రూ. 10,000/- |
| గ్రాంటు | : | రూ. 5,000/- |
| బ్యాంకు లేదా సి.ఎఫ్.ఐ. అప్పు | : | రూ. 17,500/- |

**ఈ) విద్యుత్ మోటార్ (5 హెచ్‌పి):** 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయస్సు మించని నిరుపేద గిరిజనులు కనీసం 2 1/2 ఎకరాల భూమి కలిగి ఉండి విద్యుత్ సదుపాయం కలిగి ఉన్నవారు అర్హులు.




| | | |
|---|---|---|
| పథకం విలువ | : | రూ. 14,500/- |
| సబ్సిడి (ఆప్షన్) | : | రూ. 7,250/- |
| గ్రాంటు | : | రూ. 2,900/- |
| బ్యాంకు లేదా సి.ఎఫ్.ఐ. అప్పు | : | రూ. 4,350/- |

**ఉ) విద్యుద్దీకరణ:** 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు వయస్సు మించని నిరుపేద గిరిజనులు కనీసం 2 ఎకరాల భూమి కలిగి ఉండి దగ్గరలో విద్యుత్ పోల్స్, లైన్ సదుపాయం కలిగి ఉన్నట్లుగా సూపరింటెండింట్ ఇంజనీర్, ఆం.ప్ర. ట్రాన్స్‌కో, నల్లగొండ వారు ధృవీకరించాలి. బావిలో నీరు కలిగియున్న వారు అర్హులు

| | | |
|---|---|---|
| పథకం విలువ | : | రూ. 5,000/- |
| సబ్సిడి 100 శాతం (గ్రాంట్స్ ఇన్ ఎయిడ్) | : | రూ. 5,000/- |

**ఊ) ఎత్తిపోతల పథకం:** 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు మించని నిరుపేద గిరిజనులు కనీసం 5 ఎకరాల భూమి కలిగి ఉండి, ఆరుగురు గిరిజనులకు మించి దరఖాస్తు చేసుకున్న వారు అర్హులు.

| | | |
|---|---|---|
| పథకం విలువ | : | రూ. 2,00,000/- |
| సబ్సిడి 100 శాతం (గ్రాంట్స్ ఇన్ ఎయిడ్) | : | రూ. 2,00,000/- |

**ఋ) పైప్‌లైన్:** 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయస్సు మించని నిరుపేద గిరిజనులు కనీసం 2 ఎకరాల భూమి, బోర్‌వెల్ లేదా బావి (నీటి వసతి) కలిగి యుండి, విద్యుత్ సౌకర్యం కలిగి ఉన్నట్లుగా ధృవీకరణ పత్రములో దరఖాస్తు చేసుకున్న వారు అర్హులు.

| | | |
|---|---|---|
| పథకం విలువ | : | రూ. 10,000/- |
| సబ్సిడి (ఆప్షన్) | : | రూ. 5,000/- |
| గ్రాంటు | : | రూ. 2,000/- |
| బ్యాంకు లేదా సి.ఎఫ్.ఐ. అప్పు | : | రూ. 3,000/- |

### 3. పండ్లతోటల పెంపకం

18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు మించని నిరుపేద గిరిజనులు కనీసం 2 ఎకరాల భూమి, బోర్‌వెల్ లేదా బావి (నీటి వసతి) కలిగియుండి, విద్యుత్ సౌకర్యం కలిగి ఉన్నట్లుగా ధృవీకరణ పత్రంతో ధరఖాస్తు చేసుకున్న వారికి మామిడి, నిమ్మ, కొబ్బరి, సపోట, టమాట, సీతాఫలం వెలగ, ఆయుర్వేద మొక్కలు, జీడి మామిడి మొదలగు మొక్కల పెంపకానికి అర్హులు.

| | | |
|---|---|---|
| పథకం విలువ | : | రూ. 5,000/- |
| సబ్సిడి (ఆప్షన్) | : | రూ. 2,500/- |
| లబ్ధిదారుని వాటా / శ్రమదానం | : | రూ. 2,500/- |

### 4. జాతీయ షెడ్యూల్డు తెగల ఆర్థికాభివృద్ధి సంస్థ (N.S.T.F.D.C.) స్వయం ఉపాధి పథకాలు)

గిరిజనులలో చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయస్సు గలవారు దరఖాస్తు చేసుకొనవలెను. యస్.యఫ్.సి. సంబంధిత ఐ.టి.ఐ. ట్రేడ్‌లలో టెక్నికల్ అర్హత కలిగి వుండాలి. ఈ పథకాల కింద జిల్లా కలెక్టర్ / చైర్మన్ ప్రాజెక్టు అధికారి, మాడా, ప్రాజెక్టు డైరెక్టర్, డి.ఆర్.డి.డి.ఏ. జనరల్ మేనేజర్ జిల్లా పరిశ్రమల కేంద్రం, ప్రాంతీయ రవాణా శాఖాధికారి, సంయుక్త సంచాలకులు, పవుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ పథకాలు జాతీయ షెడ్యూల్డు తెగల ఆర్థికాభివృద్ధి సంస్థ (యన్.యస్.టి.యఫ్.డి.సి.), న్యూఢిల్లీ నుండి అనుమతి లభించిన తదుపరి గ్రౌండింగ్ చేయబడును.

అ) డైరీ యూనిట్: పథకాలు విలువ : రూ. 2,80,000/-

### 4. (ఎ) ఆదివాసి మహిళా స్వశక్తికరణ్ యోజన (N.S.T.F.D.C.) (స్వయం ఉపాధి పథకాలు)

వితంతువు / విడాకులు తీసుకున్న గిరిజన మహిళలు 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు మించకుండా వార్షికాదాయం రూ. 18,000/- లకు లోబడి వున్నవారు అర్హులు.

ఎ) గొర్రెల యూనిట్: పథకం విలువ : రూ. 25,000/-

బి) మినిడైరీ యూనిట్ : పథకం విలువ : రూ. 50,000/-

### 5. బ్యాంకు ప్రమేయంతో (స్వయం ఉపాధి పథకాలు)

18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయస్సు మించని నిరుపేద గిరిజనులు, వివిధ వ్యాపారాలలో నైపుణ్యం కలవారు అర్హులు.

(కిరాణం, సైకిల్ షాప్, పిండి, కారం మిల్లు, రెడిమేడ్ గార్మెంట్స్, బుట్టల అల్లకం మొదలగునవి)

పథకం విలువ : రూ. 25,000/-

### 6. పశుసంవర్ధక పథకం

18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయస్సు మించని నిరుపేద గిరిజనులు, తగినంత పరిజ్ఞానం కలవారు అర్హులు.

కాడి ఎద్దులు : పథకం విలువ : రూ. 12,000/-
బండి ఎద్దులు : పథకం విలువ : 15,000/-

### ఎంపికచేయు విధానం

సంబంధిత గ్రామ సమాఖ్య మండల సమాఖ్య, సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా నిరుపేద గిరిజనులను గుర్తించి వారికి అవసరమైన పథకాలను ఎంపిక చేస్తారు.

### కావలసిన దరఖాస్తు ఫారాలు, ధృవీకరణ పత్రాలు

సబ్సిడి, మార్జిన్ మని దరఖాస్తు ఫారాలు సంబంధిత మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంనందు మండల లక్ష్యం కేటాయించిన ప్రకారంగా లభించును. ఆ ఫారాలు గ్రామ/మండల సమాఖ్యల ద్వారా పూరించి, కుల, ఆదాయము, భూమి వివరాలు, పట్టాదారులు పాసు పుస్తకము జిరాక్స్ ప్రతులు విద్యుత్ సౌకర్యము ధృవీకరణ పత్రములపై సంబంధిత మండల పరిషత్తు అభివృద్ధి అధికారి గారి సంతకంతో, కవరింగ్ లేఖతో ప్రాజెక్టు అధికారి, మాడా, నల్లగొండ జిల్లా గారికి పంపాలి.

### జాతీయ షెడ్యూల్డు తెగల ఆర్థికాభివృద్ధి సంస్థ (N.S.T.F.D.C.) పథకానికి కావలసిన దరఖాస్తు ఫారాలు, ధృవీకరణ పత్రాలు/ఒప్పంద పత్రాలు

1. ప్రామిసరి నోటు, జమానత్ దారుల అగ్రిమెంటు.
2. జమానత్ దారుల అగ్రివెంటు నందు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగస్తుల సమానత్, సంబంధిత లబ్ధిదారులని పోస్టు డేటెడ్ చెక్కులు, బ్యాంకు పాసు బుక్ (జీరాక్స్ కాఫీలు) లేదా
3. భూమి మార్టగేజ్ (పథకం విలువతో సమానంగా ఉండాలి.)

### ఆర్థిక సహాయం పొందడానికి వివరాలు

మంజూరీ ఆర్థిక సహాయ పథకం సబ్సిడి అప్పు, గ్రాంట్ ఇన్ ఎయిడ్, బ్యాంకు / సి.ఐ.యఫ్. అప్పు మొదలగునవి.

### మంజూరు చేసే అధికారం

సంబంధిత ధరఖాస్తులను పరిశీలించిన పిదప ప్రాజెక్టు అధికారి మాడా గారి నుండి ప్రాజెక్టు డైరెక్టర్ ఐ.కె.పి. ద్వారా శ్రీయుత జిల్లా కలెక్టర్/చైర్మెన్ గారికి పథకాల మంజూరు కొరకు సమర్పించ బడును.

**ఎ. సుభాష్ చంద్రగౌడ్,** డిప్యూటీ డైరెక్టర్, అపార్డ్

# ఈ ఎపిసోడ్ ఇంతేనా

మంత్రవాది మహేశ్వర్

**ఆనందరావుకు ఆఫీసు నుంచి ఇంటికి రావాలంటే అసహ్యమేస్తోంది. అలాగని ఎక్కువసేపు ఆఫీసుకే 'ఫెవికాల్' లా అతుక్కుపోతే ఆఫీసర్లు పని ఎక్కువ తగిలించే ప్రమాదమూ, తోటి స్టాఫ్ తమ పనిని తనకు తోసేసే అవకాశమూ లేకపోలేదు. ఆఫీసుకు వెళ్ళగానే పని తప్పితే బాతాఖానీలు, పదేపదే 'టీ'లు త్రాగేయడాలు ఇష్టపడని ఆనందరావులో ఆనందం మాయమౌతోంది.**

ఇంటికి రావాలంటే అలా రోత పుట్టడానికి కారణం - భార్యామణి ఝాన్సీకుమారి టీవీకి అతుక్కుపోయి కూర్చుని వుండటం. అలసిపోయి ఇంటికొచ్చే ఆనందరావుకు నవ్వుతూ ఎదురొచ్చి, ముఖం కడుక్కుని ఫ్రెష్ అయికూర్చునే సమయానికి ఓ కాఫీ అందించే అదృష్టం కరువవ్వడం.

పెళ్ళి చేసుకుని పదేళ్ళయిపోయింది. కానీ పెళ్ళికి ముందు ఎన్నో కలలు కన్నాడు. ఉద్యోగం చేసే భార్యవద్దనుకున్నాడు. ఇంటి వద్దే వుండి తన గురించి, పిల్లల గురించి పట్టించుకునే చదువుకున్న భార్య చాలనుకున్నాడు. మిత్రులు సలహాలిచ్చారు - ఇద్దరూ ఉద్యోగాలు చేస్తే ఆర్థికంగా పుంజుకోవచ్చని. అంబానీలా కాకపోయినా అయిదేళ్ళలో అపార్ట్‌మెంటు, పదేళ్ళలో కారూ ఖాయమనీ. ఆమెదీ ప్రభుత్వోద్యోగం అయితే ఆ కాపురం ఇక నాగార్జున సిమెంట్ అంత దృఢమని చిలక్కు చెప్పినట్లు చెప్పారు.

వింటేనా - ఇద్దరూ ఉద్యోగాలు చేసేవాళ్ళయితే ఇద్దరూ పడే ఆఫీసు టెన్షన్ల వల్ల పిల్లలు కలగకపోయే ప్రమాదం ఉంటుందని, అప్పుడు దానికోసం లక్షల డాక్టర్లు సంతాన సాఫల్య కేంద్రాలకు పోయాల్సివస్తుందని, బేబీలను కాకుండా టెస్ట్‌ట్యూబ్ బేబీలను పెంచుకోవల్సివస్తుందని ఊహించాడు.

పెళ్ళి తనకిష్టమైన తీరులో చేసుకుని జీవితాన్ని రంగుల్లో ఆశించాడు.

ఇప్పుడు జరుగుతున్నదేమిటి?

'ప్రేతాత్మ పరుగులు,' 'నిప్పుల్లో కాపురాలు' 'దిక్కుమాలిన బంధాలు,' 'పిడకలు-పీడకలలు', 'పాడు జీవితాలు'... ఒకటేమిటి ప్రతి టీవీ సీరియల్ ఎంతో ఆసక్తిగా, రెండు కళ్ళను అతికించేసుకుని చూసేయడమే ఝాన్సీపని. ఒక ఛానెల్ చూస్తున్నప్పుడు, మరొకటి మిస్సయ్యే ప్రమాదం లేకుండా ఒక డైరీ మెయింటేన్ చేస్తూ అది పునఃప్రసారమైనప్పుడు చూస్తూ... ఒకవేళ పొరపాటున మిస్సయిన ఎపిసోడ్ గురించి సీరియల్స్ బ్రేకుల్లో సెల్లు మంతనాలు, చర్చలు.

ఆఫీసు నుంచి వచ్చేసరికి ఇంటి సీను సత్యహరిశ్చంద్ర కాటిసీనులా అనిపిస్తోంది. టీవీ సౌండ్‌తో ఇల్లు ప్రతిధ్వనిస్తూంటుంది. లక్కీగా ఇంటి ఓనరు వేరే ఊర్లో వుంటాడు. సోఫా మీద ఒక చిన్న టవల్. శోకపూరితమైన, కరుణరసాత్మకమైన సీరియల్స్ చూస్తున్నప్పుడు కళ్ళు ఒత్తుకోవడానికి. ఈ మధ్య రెండు టవల్స్. ఎందుకంటే ఎవరైనా కంపెనీగా కూర్చుని ఏడ్చి తగలడితే వాళ్ళకీను - ఆ 'మరొకటి'.

అడిగే వాళ్ళెవరని. పిల్లలిద్దరూ వీధిలో డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్‌లు. ట్వంటీ ట్వంటీల్లోంచి టెస్ట్ మ్యాచ్‌ల్లోకి దిగిపోయారు. చదువును వంట గలుపుతున్నందుకు చుట్టు పక్కల ఫ్యామిలీల వాళ్ళు వీళ్ళను తిట్టిపోయడాలు.

పొరపాటున ఇంటికున్న రెండో డోర్ తెరిచిపెడితే దొంగదూరి టీవీ తప్ప, కూర్చున్న సోఫా తప్ప ఇంట్లో ఏం ఎత్తికెళ్ళినా ఝాన్సీగారికి తెలియదు. అంతలా ఎపిసోడ్లలో మునిగిపోయి వుంటుందన్నమాట.

ఆనందరావు ఇంటికొచ్చి బాత్రూమ్‌లోంచి సబ్బు కోసం అరచినా, బయటకు రాలేక టవల్‌కోసం మొత్తుకున్నా, ఆకలేస్తోందని కేకలేసినా ఆమె పట్టించుకోదు. ఉప్మాలోకి ఉల్లిపాయలు తరిగినా, చారుకు మిరియం చితక్కొట్టినా టీవీ ముందు కూర్చొనే. మాడిన పెసరట్టు పెట్టి కాస్త వేపు ఎక్కువైందని, ఇడ్లీ సరిగ్గా ఉడక్కపోతే మినపప్పు మంచిది కాదని గొణగడాలు. ఒకోసారి మరీ చిరాకెత్తి ఆఫీసు నుంచి హాల్లోకి ఎంట్రీ ఇచ్చి, ఆ సీనుకు కంపరమెత్తి చేతిలోని బ్రీఫ్‌కేస్ ఢడేల్‌మని నేలమీద పడేసి మామూలు కేక కాకుండా గావుకేక పెడితే.

"ఓరి దేవుడా... ఎప్పుడొచ్చారు" అంది.

"పాడు జీవితాలు సీరియల్ రెండొందల యాభై ఎపిసోడ్‌లో హీరోయిన్ చచ్చిపోవాలని చేసే మొదటి ప్రయత్నం అప్పుడు" అని చెబితే అర్థమయ్యేది.

"చాలా సేపే అయింది"

"మరి మాట్లాడరేం?"

దానికి జవాబివ్వడం అనవసరమనిపించింది. ఓ పిచ్చి చూపు చూసి ఊరుకున్నాడు.

పగలూ, రాత్రీ టివీ చూసినా ఎప్పుడూ గట్టిగా ఏమనలేదు. కానీ పనులన్నీ ప్రక్కన పడేసి అందర్నీ నిర్లక్ష్యం చేయడం నచ్చలేదు.

పిల్లలు ఏం తింటున్నారో పట్టించుకోవడం లేదు. ఆకలేసి ఇంట్లో దొరికిన డబ్బులు పట్టుకెళ్ళి బేకరీలో సమోసాలు, కేకులు తింటున్నారు. ఐస్‌క్రీమ్‌లతో కడుపు నింపుకునే పరిస్థితి వచ్చింది. ఒకోసారి అదీ లేకుండా ఆటలతో అలసిపోయి బూటు కాళ్ళతోనే పడుకుండి పోతున్నారు.

ఈ- సేవా కేంద్రానికి వెళ్ళి కట్టాల్సిన బిల్లులు అలాగే



కన్సొలేషన్ బహుమతి పొందిన హాస్య కథ

పేరుకుపోయి డేటు దాటిపోవడం తరువాత ఫైన్‌లతో కట్టుకోవడం.

ఇంట్లో కూరలు సరుకులు వున్నాయో లేదో తెలియదు.

పనిమనిషి సగం పనిచేసి జారుకుంటోంది. ఇల్లు తుడవక్కర్లే... మంచి సీరియల్ అన్జెప్పి ఇల్లు ఛండాలంగా వుంచడం.

"చూశావా ఇది?"

"ఎక్కడండీ... ఇదే ఫస్ట్ ఎపిసోడ్"

"నేను టీవీ సీరియల్ గురించి మాట్లాడటంలేదు. ఈ బిల్లు గురించి" అరిచాడు.

"అబ్బ" విసుకు - 'రేపు కడతానులేండి".

"కట్టమని కాదు... కరెంటు కట్ చేస్తామని నోటీసు"

ఉలిక్కిపడింది 'కరెంటు' అని వినేసరికి.

"అదేమిటండీ"

"అవును... చూడు"

"మీరు కాస్త ఫోన్ చేయరా"

"చేయను... ఫర్లేదులే... కరెంటు ఖర్చు వుండదు".

కరెంటు లేకపోతే టీవీ రాదుగా. బుర్రలో బల్బ్ వెలిగింది. విషయం పట్టించుకుంది. పట్టించుకుంటుందని రావుకు తెలుసు.

"ఇప్పుడు అక్కడ ఆఫీసులో (లెటరిచ్చి) పెనాల్టీతో కట్టాలి. తెలుసుగా".

"అలాగేనండీ... నేను చూసుకుంటానుగా పోయిన నెల వెళితే రష్‌గా వుంటే వచ్చేశాను".

'లేటైతే సీరియల్ మిస్సవుతావుగా పాపం' మనసులో అనుకున్నాడు.

ఆనందరావు ఏ పని గురించి పాయింటవుట్ చేసినా ఝాన్సీ ఫీలవడం మానేసే స్థితికి వచ్చేసింది. ఏదో సాకు చెప్పేయడంలో పడిపోయింది. రానురాను సిగ్గని కూడా అనిపించటం లేదు.

పిల్లల ప్రోగ్రెస్ రిపోర్ట్స్‌లో మార్కుల శాతం పతనమైన స్టాక్‌మార్కెట్ సూచిలా వుండడంతో హెడ్మిస్ట్రెస్ లెటరిచ్చి పంపించింది - ఫలానారోజున కలవమని.

ఝాన్సీ వెళ్ళలేకపోయింది పాపం. మరి ఆ రోజే మధ్యాహ్నం, 'మాంగల్యం తంతునా...' కొత్త సీరియల్ ప్రారంభం. మెయిన్‌రోల్‌లో లావెక్కిన పాత హీరోయిన్, సినిమాఛాన్స్‌లు రాని కొత్త హీరో.

* * * * *

ఆ రోజు మరీ నీరసమనిపించి, కళ్ళు తిరగటంతో డాక్టర్‌ను కలిశాడు ఆనందరావు. విషయం తెలిసిన ఝాన్సీ "తిండి సరిగా తినటం లేదండీ మీరు"జాలి కురిపించింది.

డాక్టర్ ఆశ్చర్యపోయాడు.

"మీరు బి.పి టాబ్లెట్స్ వేసుకుంటున్నారుగా రెగ్యులర్‌గా"

"వేసుకుంటున్నాను డాక్టర్"

"మరేమిటిది 190/120.... చాలా హైగా వుంది బి.పి. మీ ఏజ్ నలభై... వాకింగ్ చేయాలి, డైట్ సరిగా తీసుకోవాలి..." చెప్పుకుపోతున్నాడు... మందుల డోసేజ్ పెంచాడు.

ఇంట్లో తిండి టైముకు వుండకపోవడం, అరకొరగా ఏదో ఒక ఐటమ్‌తో తిని లేవడం, ఊరగాయలతో సరిపెట్టుకోవడం... ఇవన్నీ డాక్టర్‌కు చెప్పుకోవడం సిగ్గనిపించింది.

* * * * *

ఝాన్సీ తల్లిదండ్రులు పెళ్ళిబట్టలు కొనడానికి, పిలుపులకీ హైదరాబాద్ వచ్చారు. ఆనందరావు సంతోషించాడు. కనీసం వాళ్ళుండే రెండు రోజులైన ఆ టీవీ సీరియళ్ళ ఊబిలోంచి బయటకు వస్తుందని.

ఆనందరావు ఇంటికొచ్చేసరికి అదే సీను... హడావిడి లేదు.

"మీ అమ్మ నాన్న..."

"షాపింగ్‌కు వెళ్ళారు."

"మరి నువ్వ... నువ్వు సెలక్ట్ చేయాలనేగా వాళ్ళు ఇక్కడకు వచ్చింది. చెల్లెలి బట్టల సెలక్షన్‌కు కూడా వెళ్ళవా... చీరల సెలక్షన్ అంటే ఇష్టమేగా"

"అదేమిటండీ"

"రానని చెప్పావా?"

"వాళ్ళే అవసరం లేదులే. మేం వెళతాం అన్నారు".

"నీకు ఇప్పుడు చీరలంటే ఇష్టం కూడా పోయిందన్నమాట",

"ఏమిటండీ పోలీసు వాళ్ళ ఇంటరాగేషన్‌లాగా"

మాట్లాడం అనవసరమనిపించి లోపలకు వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు అత్తగారు, మావగారితో బాటు కూడా వెళ్ళాడు ఆఫీసుకు శెలవు పడేసి. వనస్థలిపురం, మెహిదీపట్నం, చంపాపేట, అమీర్‌పేట... ఇలా ఉన్న రెండు రోజులూ క్యాబ్ బుక్‌చేసి ముఖ్యమైన పనులు పూర్తి చేశారు. ఝాన్సీని రమ్మంటే 'అంతా వెళ్ళిపోతే ఇంట్లో వంట సంగతో' అంటూ తప్పించుకుంది.

'మీరెళ్ళిరండి. ప్లీజ్' అనే సరికి కూతురి మీద ప్రేమతో 'అలాగేనమ్మ మేం వెళ్ళొస్తాం' అని బయలు దేరారు.

* * * * *

ఈ నాన్సెన్స్‌కు ఓ ఫులుస్టాపు పెట్టాలనిపించింది ఆనందరావుకు. ఓ మారుమూల పల్లెటూర్లో వ్యవసాయం చూసుకుంటున్న అన్నగారి దగ్గర వుంటున్న తల్లికి ఫోన్ చేశాడు 'వచ్చి తనతో కొన్నాళ్ళుండమని' ఎనభై ఏళ్ళ హనుమాయమ్మని అన్న దిగబెట్టి వెళ్ళిపోయాడు.

ఆచారాలు, ఛాదస్తాలు ఎక్కువగా వుండే హనుమాయమ్మ ఇంట్లో మార్పులకు శ్రీకారం చుడుతుందనుకున్నాడు. చిన్నప్పుడెప్పుడో అక్కినేని గారు నటించిన 'బాలరాజు', ఎన్టీఆర్ గారి 'రేచుక్క' తప్ప మరే సినిమా చూడని, టీవీ వాసన అసలే తెలియని ఆ హనుమాయమ్మ చేత ఇంట్లో కుడికాలు పెట్టించాడు ఆనందరావు.

* * * * *

సాయంకాలం ఆఫీసు నుంచి వస్తూనే కంటబడిన దృశ్యం ఆనందరావును కలిచివేసింది.

హనుమాయమ్మ కుర్చీ టీవికి బాగా దగ్గరగా వేసుకుంది. కుర్చీపక్కగా నీళ్ళ మరచెంబు, గ్లాసు...

"ఆ నల్లపాంటు వాడేగా ఎర్ర చీరావిడ మొగుడు... బంగారంలాంటి పసి పిల్లను భయపెట్టి ఎత్తుకెళ్ళిపోయాడేమిటే... వాడికెందుకు పుట్టిందో మాయరోగం... పోయేకాలం అంటే అదే."

"కాదు అత్తయ్యగారు అతను వేరు... తెల్లచీరావిడ మొగుడు ఇతను. నల్లపాంటతను పోలీసాఫీసర్... మారువేషంలో వున్నాడు... రహస్యాలు తెలుసుకోవడానికి... ఎందుకు ఎత్తుకెళ్ళాడో ఇప్పుడే తెలియదు".

'రెండువేల ఒకటవ ఎపిసోడ్‌లో తెలుస్తుంది' అనాలనుకున్న ఆనందరావు ఏం అనలేదు. అని ప్రయోజనం వుండదు...

అయితే -

హనుమాయమ్మ తీరుకు మాత్రం షాక్ అయ్యాడు. షేక్ కూడా అయ్యాడు.

లోపలికొచ్చిన ఆనందరావు బి.పి. చెక్ చేయించుకోవడానికి వెంటనే బయటకు వెళ్ళిపోయాడు.

☆

# ఆరోగ్య పరంగా వానాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

**భగభగ మండే సూర్యుడు సిగ్గుతో మబ్బుల చాటున దాక్కున్నాడు. ఆనందంతో ఆకాశం వర్షించింది. చిటపట చినుకులతో ప్రతి ఒక్కరి శరీరం పులకరించింది. కోడెద్దులు రంకెలు వేశాయి. రైతన్న నాగలి పట్టాడు. విత్తడం, కలుపులు, సాగు మడులతో గ్రామీణులు క్షణం తీరిక లేకుండా బిజీగా ఉన్నారు. పిల్లలు ఉత్సాహంతో చదుకునే పనిలో నిమగ్నమైనారు. వానాకాలం వచ్చిందంటే అందరికీ సంతోషమే.**

ఈ సంతోషం ఇలానే కొనసాగాలంటే అది మన చేతిలోనే ఉంది. వానాకాలం అంటేనే రోగాలకాలం అనే నానుడి ఉంది. ఓ ప్రక్క జలబు, దగ్గు, జ్వరం, మలేరియా, టైఫాయిడ్‌లు మరోప్రక్క అతిసారం అంటే నీళ్ళ విరేచనాలు, వాంతులు మరియు పచ్చకామెర్లు. ఏమాత్రం అలక్ష్యం చేసినా వాటి బారిన పడక తప్పని పరిస్థితి. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన" కాకుండా, "అసలు చేతులే కాలకుండా జాగ్రత్త పడడం మేలు కదా!" దీనితో మీరు ఏకీభవిస్తే ముందుగా వ్యక్తిగత స్థాయిలో వానాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.

### వ్యక్తిగత స్థాయిలో జాగ్రత్తలు

- ఆహార పరంగా, త్రాగునీరు విషయంగా...
- ఇంటి పరిసరాలు పరంగా క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి.

### ఆహార పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు

- వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను భుజించాలి. నిల్వ ఉన్న పదార్థాలు, తోపుడు బండ్లపై పదార్థాలకు దూరంగా ఉండాలి.
- అల్లం, వెల్లుల్లి వంటి వాటిని ఆహారంలో జోడిస్తే మంచిది.
- తేలికపాటి అనగా త్వరగా జీర్ణం కాగలిగే ఆహారాన్ని భుజించాలి.
- కూరగాయలు, ఆకుకూరలను వండడానికి ముందు శుభ్రమైన నీటిలో కడగాలి.
- భోజనం చేసు ముందు, లేదా ఏదైనా తినుబండారం స్వీకరించే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలి.

### త్రాగునీటి పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు

- మరగ కాచి, చల్లార్చి, వడగట్టిన నీటినే త్రాగాలి.
- త్రాగే నీటిలో నేరుగా చేతులు ముంచకుండా కుళాయి ఏర్పాటుగానీ లేదా కాడగరిటను గానీ వాడాలి.

### ఇంటి పరిసరాలు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- చెత్తా చెదారం నిల్వ లేకుండా చూసుకోవాలి
- పొడిగా పరిసరాలు ఉండేలా జాగ్రత్త వహించాలి
- ఉపయోగించని నీటితొట్టిలు, కుండలు, టైర్లు, పూలకుండీలు, త్రాగి పడవేసిన కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలు మరేవైనా నీరు నిల్వ ఉండే అవకాశం ఉన్న వాటన్నింటినీ తొలగించాలి/ బోర్లించాలి.
- గుబురుగా ఉండే కలుపు మొక్కలను ఎప్పటికపుడు తొలగించాలి.
- నీటి తొట్టెలను రెండు రోజులకు ఒకసారి బ్లీచింగ్ వేసి శుభ్రపరచాలి.
- ఇంట్లో నుండి వచ్చే ఉపయోగించిన వృధా నీటిని డ్రైనేజికి మళ్ళించడం లేదా ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవడం లేదా లీచ్ పిట్ నిర్మాణం వంటి వాటి ద్వారా సమర్థవంతంగా నిర్వహించాలి.
- ఇంటి దగ్గరే మరుగుదొడ్డి నిర్మించుకొని లేదా ఉన్న మరుగుదొడ్డిడని వాడకం చేపట్టాలి.
- బహిరంగ మలవిసర్జన చేయకూడదు.
- పశువుల పేడ, చెత్తను ఇంటి పరిసరాలలో తొలగించి దూరంగా తరలించడం లేదా ఎరువు గుంతను ఏర్పాటు చేసుకొని ప్లాస్టిక్ కవర్‌తో కప్పి వేయాలి.

పైన చర్చించిన వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోనేలా ఎవరు అవగాహన కల్పించాలి అనేది మనల్ని వేధించే సందేహం. గ్రామపంచాయితీ పరిధిలో ప్రజాప్రతినిధులు, ఆరోగ్యశాఖ, పారిశుధ్య శాఖలకు సంబంధించిన అధికారులు, మండలస్థాయి అభివృద్ధి అధికారులు ఎవరైనా చొరవ తీసుకొని అవగాహనా సదస్సును ఏర్పాటు చేయవచ్చు. అంటే వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోనేలా ప్రజలను సమాయత్తం చేయగలం అన్నమాట. మరి గ్రామస్థాయిలో తీసుకోవలసి బాధ్యతలు ఏమైనా ఉన్నాయా? మరి వాటినెవరు నెరవేరుస్తారు? అనేది చూద్దాం.

### గ్రామ స్థాయిలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- ప్రతి 15 రోజుల కొకసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయడం
- ట్యాంకులో నీరు నిండిన ప్రతిసారీ ప్రతి వెయ్యి లీటర్లకు 2.5 గ్రాముల నుండి 4 గ్రాముల లెక్కన క్లొరిన్ నీళ్లలో కలపడం.
- పైపులైను లీకేజీలను ఎప్పటికప్పుడు సరిచేయడం
- నీళ్ళు నిల్వ ఉండే అవకాశం ఉన్న గుంతలను ఎప్పటికప్పుడు మట్టితో పూడ్చడం
- డ్రైనేజ్‌ను ఎప్పటికప్పుడు పూడిక తీయడం
- పూడిక తీసిన మన్నును గ్రామానికి దూరంగా తరలించడం
- చెట్ల గుబుర్లను, ముళ్ళ పొదలను తొలగించడం
- కనీసం వారానికి ఒక్కసారి పాగింగ్ చేయించడం
- (నిల్వ ఉన్న నీటి కుంటలలో) మొలాథిన్ స్ప్రే చేయించడం / ఆయిల్ బాల్స్ వేయడం
- గ్రామస్తుందరూ మరుగుదొడ్లు వాడేలా ప్రొత్సహించడం

ఈ బాధ్యతలు ఎవరు తీసుకోవాలి? ఇంకెవరు మన గ్రామ పంచాయితీయే. ఇలా చేసినట్లైతే చిరు జల్లులను ఆస్వాదించినట్లే, ఆరోగ్యాన్నీ ఆస్వాదించవచ్చు.

### ఆయిల్ బాల్స్ తయారీ ఎలా?

వేస్ట్ ఆయిల్‌ను సేకరించండడి. రంపపు పొట్టు లేదా వరిపొట్టును సేకరించండి. గోనె పట్టా లేదా గుడ్డ ముక్కలను నలుచదరంగా నాలుగు అంగుళాల పొడవు, వెడల్పులతో కత్తిరించండి. వాటిలో రంపపుపొట్టును నింపి గుండ్రని బంతిలా చుట్టండి. వీటిని వేస్ట్ ఆయిల్‌లో నానబెట్టండి. తదుపరి ఈ ఆయిల్ బాల్స్‌ను నీరు నిల్వ ఉన్న కుంతలలో వేయండి. ఇవి దోమలు వృద్ధి కాకుండా చూస్తాయి. కాపాడతాయి.

**పి. మాధురి, ఫాకల్టీ, అపార్డ్**

# పర్యావరణ పరిరక్షణకు పరమ ఔషధం

**మనం ప్రకృతిని పరిశీలించినపుడు, చెట్లు మాత్రమే నిజమైన ఉత్పత్తి వనరులైనట్లు గ్రహించగలం. ప్రాణులు జీవించటానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రాథమికమైన ఆహారాన్ని అందిస్తున్నది చెట్లే. చెట్లు లేని ప్రపంచం మృతప్రాయమైనది. ప్రపంచంలో చెట్లు, చేమలు లేకపోతే, త్వరలోనే ప్రాణులు పీల్చుకోడానికి స్వచ్ఛమైన గాలికి లోటు ఏర్పడుతుంది. చెట్లు ప్రాణదానం చేసే ప్రాణవాయువును అందజేయటంతో పాటు, ఇతర ప్రాణాలు వదిలే ప్రాణాంతకమైన కర్బన్లను గ్రహిస్తాయి.**

నాగరిక మానవుడు, ఫ్యాక్టరీలు కార్లు వదిలే కర్బనామ్ల వాయువులు, ఇతర ప్రమాదకరమైన వాయువులతోపాటు, మరింత ఎక్కువగా గాలిలో కలిసి పోతాయి. మనుషుల సంఖ్య, కార్లు, ఫ్యాక్టరీల సంఖ్య వల్ల గాలి మరింత ఎక్కువగా కలుషితమౌతుంది.

మానవజాతి మనుగడకు ఎంతగానో దోహదం చేస్తున్న చెట్లు, అడవులు మొదలైనవాటి అవశ్యకతను గుర్తించిన ఐక్యరాజ్య సమితి 2011వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ అడవుల సంవత్సరం'గా ప్రకటించింది. నాగరికత పెరిగినట్లల్లా, అభివృద్ధి కోసం చెట్లను కూల్చివేయడం పెరుగుతూవుంది.

చైనా అటవీ సంస్కరణ పథకాన్ని చేపట్టింది. 2010లో ప్రపంచ వ్యాప్తంగా 4.032 బిలియన్ హెక్టార్ల (9-9 బిలియన్ ఎకరాలు) వరకు అడవులుండగా, 2000లో 4.085 బిలియన్ హెక్టార్లు వుంది.

1998-1990లో ఏడాదికి 8.3 మిలియన్ల హెక్టార్ల వంతున చెట్లను కూల్చివేశారు. 1990-2000 దశాబ్దంలో 5.2 మిలియన్ల హెక్టార్లుగా నమోదైంది. 30 ఏళ్ళ క్రితం అటవీ నిర్మూలన స్థాయి ఏడాదికి 50 మిలియన్ల హెక్టార్ల వంతున వుందని, శాస్త్రవేత్త బ్రియాల్స్ గుర్తు చేశారు. ఇప్పటికీ మనం ఎంతో విలువైన అడవిని కోల్పోతూనే వున్నాం. కోల్పోతున్న అడవుల ద్వారా కలుగుతున్న నష్టాన్ని పూడ్చడానికి కొత్త అడవులను పెంచుకోవటం అత్యవసరం.

ఇటీవల మనదేశంలో కూడా అడవుల విస్తీర్ణాన్ని పెంచినట్లు తెలుస్తుంది. మొక్కలు చెట్ల పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ కెన్యాకు చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త 2004 సంవత్సరం నోబెల్ శాంతి



బహుమతి గ్రహీత వాంగారిమాథాయ్ ఐవైఫ్, 2011న ఇటీవల ఉద్యమం ప్రారంభించారు. అంతర్జాతీయ అడవుల సంవత్సరంలోనైనా అడవుల సంరక్షణ పట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలన్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలంటాడు.

అడవులను ధ్వంసం చేయటం వల్ల భూసారం కొట్టుకొనిపోతుంది. నదులు, సరస్సులు ఎండిపోతాయి. వరదలు వస్తాయి. చెట్లు, పొదల వ్రేళ్ళు నేలకు అంటుకొని వుండి, మన్ను కొట్టుకొని పోకుండా నిరోధిస్తాయి. వ్రేళ్ళు, క్రింద పడిన ఆకులు, ఇంకా చెట్లకు సంబంధించిన ఇతర పదార్థాలు వాన నీటిని పీల్చుకొంటాయి. నిలువ చేస్తాయి. ఈ నీటిలో ఎక్కువ భాగం మెల్లగా భూమిలోనికి పోయి, భూగర్భంలో నూతులలో నిలువ వుంటుంది. ఇక్కడ నుండి సెలయేర్లకు సరస్సులకు నీరు లభిస్తుంది.

భూమి లోపల వుండే సూక్ష్మక్రియలు (బ్యాక్టీరియా) వానపాములు, కీటకాలు, పుట్టగొడుగులు ఇంకా అనేక ఇతర రకాల ప్రాణులు కలిసి కట్టుగా ఒక కర్మాగారం వలె వ్యవహరించి భూమి ఉపరితలాన్ని సారవంతంగా రూపొందిస్తాయి. తద్వారా ఈ భూమిని ప్రాణులకు నివాసయోగ్యం చేస్తాయి. ఈ కృషితో చెట్ల సూక్ష్మజీవులు, కీటకాలు, జంతువులు మొదలగునవన్నీ గణనీయమైన పాత్ర వహిస్తాయి.

చెట్లు లేకుండా ఈ ప్రపంచం గాలి, నీరు, ప్రాణులు లేని జగత్తుగా పరిణమిస్తుంది. కాబట్టి సకల ప్రాణులు జీవించటానికి అరణ్యాలు తప్పక వుండాలి. మనం జీవించడానికి కూడా అడవులు అత్యవసరం.

అడవులలో వివిధ రకాల వృక్షజాతులున్నాయి. అవి మనకెంతగానో ఉపయోగపడతాయి. మచ్చుకు వెదురు చెట్టును తీసుకుందాం. వెదురు పదార్థాల నుంచి ఔషధాలు తయారు చేస్తారు. వెదురుతో మనం వాడే కాగితాన్ని తయారు చేస్తారు. వెదురు గుడిసెలు సాధారణంగా కనిపిస్తాయి. వెదురు గొట్టాలతో పిల్లనగ్రోవి వంటి సామాన్య సంగీత వాద్యాలేకాక, పెద్ద సంగీత వాద్యాలు కూడా తయారు చేస్తారు.

జనాభా పెరిగి మనిషి అటవీ ప్రాంతాలపై దురాక్రమణ సాగించటం మరీ ఎక్కువైంది. వన్యప్రాణులు, ఏనుగుల మందలు తగిన రక్షణ స్థావరాలు లేనందున పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి.

ఇటీవల మనం నిత్య జీవితంలో చూసే ఊర పిచ్చుకలు క్రమంగా అంతరిస్తున్నాయి. ప్రభుత్వం వీటి రక్షణ కోసం పలు పథకాలు అమలు చేస్తున్నది.

వన్య జీవులను మచ్చిక చేసుకొని పెంచకుండా వుంటే మనిషి ప్రగతిపథంలో ప్రయాణించటం అసాధ్యమయ్యేది. పశువులను పెంచటం కుక్కతో ప్రారంభమైంది.

జంతువులను, పక్షులను పెంచాలన్న ఆసక్తి, అభిలాష మనలో సహజమైన స్వభావం. జంతువులు, పక్షుల పట్ల ప్రేమభావం మనకు ఆటవికులైన ఆదిమానవుల నుండి వారసత్వంగా సంక్రమించింది.

పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం పరమౌషధమని మనం గుర్తించాలి.

*- జానమద్ది*

# అవతార పురుషుడు ఆది శంకరాచార్యులు

**భారతదేశం ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు, తమ ఆధ్యాత్మిక కాంతిరేఖలను విశ్వవ్యాప్తంగా ప్రసరింపజేసి, లోకాన్ని పవిత్రం చేసిన దివ్యపురుషులు, మహర్షులు, మహిమోపేతులు ఎందరో మనదేశంలో ఉన్నారు. వారిలో అద్వైతమత స్థాపకుడిగా ప్రఖ్యాతి వహించిన ఆది శంకరాచార్యులవారు అనన్యసామాన్యులు.**

ఆది శంకరాచార్యులు అవతారపురుషులు. కేవలం భారతదేశంలోనే కాదు విశ్వవిజ్ఞాన చరిత్రలోనే ఆది శంకరాచార్యులు అవతరించడం ఒక సువర్ణ అధ్యాయంగా చెప్పుకోవచ్చు.

*బ్రహ్మ సత్యం జగన్మిధ్యా - జీవో బ్రహ్మైవ నాపరః*

బ్రహ్మవిద్య అత్యంత క్లిష్టమైనది. ఎవరికీ ఒక పట్టాన అర్థం కాదు. అటువంటి బ్రహ్మజ్ఞానాన్ని చాలా సులభంగా బోధించిన దివ్య ప్రవక్త ఆది శంకరాచార్యులు.

ఈ జగత్తు మొత్తం మిథ్య. సకల ప్రాణులలో బ్రహ్మమే శుద్ధ చైతన్య స్వరూపంగా భాసిల్లుతోందని ఆది శంకరాచార్యులు ప్రవచించారు. ఇదే విశ్వవ్యాప్తంగా జనాదరణకు పాత్రమయ్యింది. ఆధ్యాత్మిక భౌతిక వాదాలను సమన్వయం కావిస్తూ ఆది శంకరాచార్యులు ప్రవచించిన ఈ తత్వమే ఆధునిక విజ్ఞానశాస్త్రానికి కూడా మూలమైందని వైజ్ఞానికుల అభిప్రాయం. ఎంతో వైవిధ్యం కల భారతీయ సమాజంలో సాంస్కృతిక సమైక్యత కోసం ఆది శంకరాచార్యులు కృషి చేశారు.

దేశం నలుమూలలకూ పర్యటించి తమ అద్వైత భావామృత ధారలను కురిపించడమే కాకుండా, షణ్మతస్థాపనాచార్యుడిగా తనను తాను నిరూపించుకొని ప్రస్థానత్రయం, భాష్యరచనలను రచించారు. మనకు నేడు లభిస్తున్న సర్వదేవతాస్తోత్రాలలో అత్యధికభాగం ఆది శంకరాచార్యులు రచించినవే.

ఆది శంకరాచార్యుల జీవితం భక్తి జ్ఞాన వైరాగ్యాల సంగమం. చిన్నతనంలోనే అంటే తన ఏడో ఏటనే శంకరాచార్యులు తల్లిని ఒప్పించి సన్యాసాశ్రమంలో కాలు పెట్టారు. చతుర్వేదిగా శిక్షణపొంది అనతికాలంలోనే సర్వశాస్త్రాలను, వేదాలను అధ్యయనం చేసిన మేధావిగా తయారయ్యారు. పదహారేళ్ళకే భాష్యకారుడిగా ఎదిగి అపారమయిన తెలివితేటలతో సర్వమతాల సారాంశాన్ని ఆకళింపు చేసుకొన్నారు.

శంకరాచార్యుల బోధనలు, రచనలు అర్థం కావాలంటే కేవలం బుద్ధి కుశలత ఉంటే చాలదు. పూర్వజన్మల నుండి సంక్రమించిన సంస్కార విశేషం కూడా ఉండాలి.

ఒక అవతార పురుషుడిగా భూమిమీద అవతరించిన అనతికాలంలోనే తన కర్తవ్యాలన్నింటినీ నిర్వర్తించిన వీరు తన ముప్పై రెండేళ్ళకే తనువు చాలించిన మహాపురుషుడు. ఈ స్వల్పవ్యవధిలోనే ఉపనిషత్తులు బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు భాష్యాలు రాశారు. వీరు రాసిన స్తోత్రాలు ఆయా దేవతా స్వరూప స్వభావాలను మనోహరంగానూ భక్తి ప్రేరితంగానూ వర్ణిస్తూ ఉండటం విశేషం. వీరి స్తోత్రాలలో కవిత్వం కొత్త కొత్త అలంకారాలతో సందర్భశుద్ధితో తొణికిసలాడుతూ కావ్యగౌరవంతో అలరారుతూ ఉంటుంది.

ఆది శంకరాచార్యులు ఎన్నో మహిమలు ఉన్న దివ్య పురుషుడు. తన స్తోత్రంలో ఒక పేద బ్రాహ్మణుడి ఇంట కనకవర్షం కురిపించాడని చెప్తారు. ఆ స్తోత్రమే కనకధార స్తోత్రం కింద ప్రసిద్ధి వహించింది.

మరణించిన వారిని బతికించడం, వికలాంగులను సర్వావయవ సౌందర్యవంతులుగా తీర్చిదిద్దడం ఆది శంకరాచార్యులు చేశారని చరిత్ర చెప్తోంది.

వీరి స్తోత్రాలలోకెల్లా మకుటాయమానంగా నిలిచే స్తోత్రం భజగోవింద స్తోత్రం. ఈ స్తోత్రాన్ని రాయడానికి ఒక సందర్భం ఉంది. ఏది రాసినా.. ఏది చేసినా... సౌశీల్యం సౌజన్యం, సామరస్యం కన్పించటం ఆది శంకరాచార్యుల వ్యక్తిత్వంలో అందరూ చూసి నేర్చుకోదగిన దివ్యతత్వం.

ఒకసారి ఒక నదిలో ఒక పండితుడు పడవమీద వెళ్తున్నాడు. పడవనడిపే వాడితో మాటలు కలిపాడు పండితుడు. నీకు ఆ శాస్త్రం తెలుసా? ఈ శాస్త్రం తెలుసా? అని వాడిని అడగడం.. వాడు నాకేమీ తెలీదని చెప్పడం... దానికి పండితుడు ఎగతాళి చెయ్యడం... ఇలా సాగుతోంది వారి పడవ ప్రయాణం. ఏ విద్యా లేకుండా నువ్వు ఎలా బతుకుతావని ఎద్దేవా చేశాడు పండితుడు.

కొంత దూరం వెళ్ళాక నదిలో సుడిగుండాలను గమనించిన పడవవాడు "అయ్యా మీకు ఈత తెలుసా?" అని అడిగాడు. దానికి పండితుడు వెర్రి మొహం వేయగా... "ఇప్పుడు ఈ పడవ మునిగిపోతోంది, నాకు ఈత వచ్చు. కాబట్టి నేను వెళ్ళిపోతున్నాను. మీకు వచ్చిన ఆ శాస్త్రాలను పిలవండి. అవి వచ్చి మిమ్మల్ని రక్షిస్తాయేమో" అని పడవ నుంచి దూకి ఈదుకొంటూ వెళ్ళిపోయాడట ఆ పడవవాడు. అప్పుడు ఆ పండితుడు నీటిలో మునిగిపోతూ 'డుకృయ్ కరణే' అంటూ నీటిలో మునిగిపోయాడట. ఈ సన్నివేశాన్ని చూసిన ఆది శంకరాచార్యులు భజగోవింద స్తోత్రాన్ని ఈ విధంగా ప్రారంభించారు.

*భజ గోవిందం భజగోవిందం*

*గోవిందం భజ మూఢమతే*

*సన్నిహితే సంప్రాప్తే కాలే*

*నహినహి రక్షతి డుకృయ్ కరణే*

'వినాశకాలం ప్రాప్తించినప్పుడు ఏ శాస్త్రం కాపాడలేదు. కాబట్టి ఓ మూఢమతీ! గోవిందుని భజింపుము' ఇత్యాదిగా గల ఈ స్తోత్రంలో ఎన్నో విలువైన సందేశాలున్నాయి.

మానవుడు ఆత్మజ్ఞానంతో జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్నారు. అందుకు అవసరమయిన సందేశాలను అందించారు. అటువంటి ఆది శంకరాచార్యులు ఆర్ష సంస్కృతికి కొత్త ఊపిరిపోసిన దివ్య పురుషులు..

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*



# గ్రామీణ మంచి నీటి సరఫరా గురించి తెలుసుకుందాం

**గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న అతిముఖ్యమైన సమస్యలు మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం. రక్షిత మంచినీరు మరియు పారిశుద్ధ్య వసతులు అందుబాటులో లేకపోవడం వలన ప్రజలు వివిధరకాల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయితీరాజ్ పరిధిలో గ్రామీణ మంచినీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం నిర్వహణ శాఖలను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు అమలు పరుస్తున్నది.**

## నీటి ప్రాముఖ్యత

జీవులలో శారీరక, 'జీవరసాయనిక సంబంధమైన చర్యలు నీటి సహాయం వలన నిర్వహించబడతాయి.

1. నీరు మన శరీరంలోని కణాలను తడిగా మరియు సజీవంగా ఉంచుతుంది.
2. మన శరీరంలోని ద్రవాల కదలికకు నీరు ఉపయోగపడుతుంది.
3. మనం తీసుకొనే ఆహారాన్ని జీర్ణక్రియకు అనువుగా నీరు గుజ్జుగా మారుస్తుంది.
4. నీరు మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
5. మన శరీరంలో జీవకణాల ఎదుగుదలకు అవసరమయ్యే సోడియం, పొటాషియం మరియు కాల్షియం మొదలగు లవణాలను కరిగించుకుని కణాలలో ప్రవేశించడానికి సహాయపడుతుంది.
6. మానవ శరీరంలోని అవాంఛిత ఉత్పత్తులు నీటి ద్వారా బయటకు విసర్జించబడతాయి.
7. చెట్ల ఆకులకు అవసరమైన లవణాలు మరియు ఖనిజాలను భూమి నుండి గ్రహించి ఆకులకు అందిస్తుంది.
8. నీటి సహాయం లేకుండా చెట్లు ఆహారాన్ని తయారుచేసుకోలేవు. తయారు చేయబడిన ఆహారం చెట్టులోని ప్రతి భాగానికి నీటి ద్వారానే అందించబడుతుంది.

## రక్షిత నీటి భావన

వివిధ వనరుల ద్వారా లభ్యమయ్యే నీరు గృహ మరియు పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే విధంగా తగు చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది. మనకు కనిపించే నీటి రుచి మరియు వాసన స్వచ్ఛమైన నీటి చిహ్నాలైనప్పటికీ ప్రజారోగ్యం దృష్ట్యా రక్షిత నీరు అంటే సూక్ష్మజీవ సంబంధిత, భౌతిక, రసాయనిక మరియు రేడియో లాజికల్ లక్షణాలను బట్టి నిర్ణయించబడుతుంది. నీటిలో సూక్ష్మజీవుల సంబంధిత అంశములు నీటి నాణ్యతపై ప్రభావం చూపుతాయి. నీటిలో రసాయన పదార్థాలు ఉంటాయి. ఇవి ప్రజల ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తాయి. కనుక నీటి సంపూర్ణ విశ్లేషణ అత్యవసరమైంది.

## త్రాగునీరు అంటే

1. వ్యాధికారక సూక్ష్మజీవులు లేనిది
2. స్వచ్ఛమైనది (రంగు, మడ్డి లేనిది)
3. ఉప్పగా ఉండనిది
4. అసంబంధమైన రుచి మరియు వాసన లేనిది
5. మానవుల ఆరోగ్యానికి హాని కలిగించే అంశాలు లేనిది
6. నీటి సరఫరా పథకాల శుద్ధి యంత్రాలను పైపులను క్షయనీకరణ గావించే లేదా ఆ నీటిలో ఉతకబడిన దుస్తులపై మరకలు ఏర్పరచే రసాయనాలు లేనిది.

రక్షిత నీరు వినియోగదారుని ఆరోగ్యానికి ఏవిధమైన హాని చేయరాదు. అంతేకాకుండా సూక్ష్మజీవ సంబంధిత, రసాయన సంబంధిత కాలుష్యాలకు అతీతంగా గృహ వినియోగానికి వీలుగా వాసన లేకుండా, స్వచ్ఛంగా ఉండాలి.

## నీటి నాణ్యతా ప్రమాణం

త్రాగునీటి నాణ్యత సమాజము అంగీకరించే విధంగా మరియు త్రాగడానికి సురక్షితంగా ఉండాలి, ఇంకోరకంగా చెప్పాలంటే స్వచ్ఛంగా, క్రిమి రహితంగా ఉండాలి. స్వచ్ఛమైన నీటిలో -

ఎ) వ్యాధి కారక జీవులుండరాదు

బి) హానికరమైన ఫ్లోరైడ్, ఆర్సెనిక్ మరియు ఇతర విషపూరిత రసాయనాలు ఉండకూడదు. అసంబద్ధ రంగు, రుచి, వాసన లేకుండా స్వచ్ఛంగా ఉన్న నీరు రక్షిత నీరుగా పిలువబడుతుంది.

## నీటి నాణ్యత - తగు ప్రమాణం

భారత ప్రమాణాల (BIS-10500) ప్రకారము త్రాగడానికి ఉపయోగించే నీరు దిగువ సూచించిన పట్టికలోని లక్షణాలను కలిగి ఉండాలి.

## నీటిలో ఉండదగు భౌతిక రసాయనిక ప్రమాణాలు

| క్ర. సం. | లక్షణాలు | అనుమతిం-చదగు గరిష్ట పరిమితి | ప్రత్యామ్నాయ వనరు లేనిచో అనుమతించదగు గరిష్టపరిమితి |
|---|---|---|---|
| 1. | మడ్డిదనము అనగా స్వచ్ఛతకు కొలమానము (యన్.టి.యు. యూనిట్లలో) | 5 | 10 |
| 2. | పి.హెచ్ (ఉదజని గాఢత) | 6.5 నుండి 8.5 | 6.5 నుండి 8.5 |
| 3. | మొత్తము కాఠిన్యత ($CaCo_3$ (mg/1) | 300 | 600 |
| 4. | ఐరన్ Fe(mg/1) | 0.3 | 1.0 |
| 5. | క్లోరైడులు (mg/1) | 250 | 1000 |
| 6. | నీటిలో మిగిలి ఉన్న క్లోరిన్ శాతము (mg/1) | 0.2 | - |
| 7. | కరిగియున్న లవణములు (mg/1) | 500 | 2000 |
| 8. | నైట్రేడ్ $No_3$(mg/1) | 45 | 45 |
| 9. | ఫ్లోరైడ్స్ F(mg/1) | 1.0 | 1.5 |
| 10. | ఆర్సెనిక్ As (mg/1) | 0.05 | 0.05 |
| 11. | అల్యూమినియం Al (mg/1) | 0.03 | 0.2 |

## అవసరమగు సూక్ష్మ జీవసంబంధిత ప్రమాణాలు

| క్ర. సం. | లక్షణములు | సంఖ్య/100 మి.లీ |
|---|---|---|
| 1. | పైపుల ద్వారా పంపిణీ చేస్తున్న సురక్షిత నీరు | ఫీకల్ కోలిఫాం 0<br>మొత్తము కోలిఫాం 10 కన్న ఎక్కువ. కాకుండా మొత్తము కోలిఫాం రెండు వెంట వెంటనే పరిక్షించే నమూనాలలో గుర్తించబడరాదు. సంవత్సరంలో పరీక్షించబడిన నీటి నమూనాలలోని 95%లో కోలిఫాం '0'గా ఉండవలెను. |
| 2. | పైపుల ద్వారా సరఫరా చేయబడని నీరు | - do - |

## పరిమితి దాటినందు వలన కలిగే పరిణామాలు, నివారణా మార్గాలు:

### మడ్డిదనము

నీరు ఎంత స్వచ్ఛంగా ఉన్నదో తెలుపు ఒక భౌతిక ధర్మము మడ్డిదనము. ఎటువంటి సస్పెండెడ్ పార్టికల్స్ లేని నీటిలోనికి కాంతి పంపబడినప్పుడు ఆ కాంతి నీటిలో మనకు స్పష్టంగా కలినిపిస్తుంది. ఆ నీటిలో మడ్డిదనం లేదని చెప్పవచ్చును. ఆ నీరు ఖచ్చితముగా స్వచ్ఛమైనది. ఒకవేళ నీటిలో కనిపించు కాంతి కొద్దిగా మసకబారినట్లు అనిపించిన ఆ నీరు కొద్దిపాటి మడ్డిదనము కలిగియున్నట్లు చెప్పవచ్చును. ఆ నీటిలో అధికస్థాయిలో మురికి లేదా సస్పెండెడ్ పార్టికల్స్ ఉన్నప్పుడు కాంతి ఎక్కువగా మసకబారుతుంది. ఈ సందర్భములో నీరు ఎక్కువ మడ్డిదనము కలిగియున్నట్లు చెప్పవచ్చు. కనుక మడ్డిదనము నీటి యొక్క స్వచ్ఛతా స్థాయిని తెలుపుతుంది.

మడ్డిదనము కలిగిన నీరు త్రాగుటకు అంగీకార యోగ్యము కాదు. నీరు చాలా మురికిగా ఉన్నచో సమాజము దానిని తిరస్కరిస్తుది. మడ్డిదనము నిర్ణీత మరిమితి కన్న అధికముగా ఉన్న యెడల అది ఒక కవచమువలె డిస్ఇన్ఫెక్షన్ చర్యల నుండి బ్యాక్టీరియాను కాపాడుతుంది.

### నివారణ చర్యలు

మడ్డిదనము ఎక్కువగా ఉన్న సందర్భాలలో ప్రత్యామ్నాయ వనరును ఎంపిక చేసుకోవాలి. కొన్ని సందర్భములతో లోపభూయిష్టమైన డ్రిల్లింగ్ లేదా తగినంత అభివృద్ధి పరచుకున్నటువంటి బోరుబావి కూడా మడ్డిదనముకు దారితీస్తుంది. అందువలన అధిక మడ్డిదనము యొక్క సమాచారమును పై అధికారులకు తెలియజేసి లోపము సరిచేయునట్లు ప్రేరేపించు ప్రాథమిక బాధ్యత గ్రామీణస్థాయి ఉద్యోగులది. ఉపరితల జలములోని మడ్డితనమును సంప్రదాయక నీటి చికిత్సా విధానముల ద్వారా తొలగించవచ్చును.

### క్లోరైడ్

నీరు భూమిలోని సహజ ఉప్పు పొరలపై నుండి ప్రవహించుట లేదా సముద్రజలపు చొరబాటుకు సూచిక క్లోరైడ్ - నీటి ఉప్పదనముతో క్లోరైడ్ అధికృత సూచిక 1000 మి.గ్రా./లీ. కన్న అధికశాతము ఉప్పదనము కల్గిన నీరు సమాజముచే తిరస్కరించబడుతుంది. నీటిలో అధిక క్లోరైడ్ ఉండుట వలన ఆ నీరు త్రాగుటకు యోగ్యము కాదు. కానీ ఎట్టి అనారోగ్యమును కల్గించదు.

### నివారణ చర్యలు

చేతిపంపులు మరియు ఇతర వనరులలోని అధిక క్లోరైడ్‌ను తొలగించడం ఎక్కువ వ్యయ ప్రయాసలతో కూడుకున్నదే గాక గ్రామీణ స్థాయి వర్కర్ల సామర్థ్యమునకు మించినది. అందువలన ప్రత్యామ్నాయ వనరుల అన్వేషణ సమర్థనీయము. స్థానిక కార్యనిర్వాహకులు ఈ విషయమును సంబంధిత అధికారుల దృష్టిలోనికి తీసుకొని వచ్చి ప్రత్యామ్నాయ వనరులను అన్వేషించుటకు ప్రేరేపించవలెను. అసాధారణ పరిస్థితులలో క్లోరైడ్ తగ్గించే పరికరములను బిగించవలసి వస్తే గ్రామీణ స్థాయి వర్కర్లు తమకు గ్రామస్థులకు తెలియజెప్పే మరియు అట్టి యూనిట్ల యాజమాన్యములో తమ పాత్రను గురించి

తగు శిక్షణ ఇప్పించగలందుకు సంబంధిత అధికారులను కోరవలెను.

### ఫ్లోరైడ్

ఫ్లోరైడ్ నీటిలో సహజంగా ఏర్పడుతుంది. నీటిలో అధిక ఫ్లోరైడ్ కలుగజేయు ఖనిజములు కలిగిన నేలలు ఉన్నవి. అనుమతించదగిన స్థాయికన్న ఎక్కువ ఉన్న ఫ్లోరైడు కల నీటిని దీర్ఘకాలికంగా వాడటం వలన దంతాలపై మచ్చులు ఏర్పడి డెంటల్ ఫ్లోరోసిస్ వస్తుంది. అధిక ఫ్లోరైడ్ వలన ఎముకల వ్యవస్థను దెబ్బతీసే ఎముకల ఫోరోసిస్ వ్యాధి సంభవిస్తుంది. అధికశాతం ఫ్లోరైడ్ గల నీటి వాడకం వలన నాన్-స్కెలిటల్ ఫోరోసిస్ వ్యాధులు కలుగుతాయి. ఫ్లోరైడ్ ప్రభావము వలన మానవశరీరంలోని పలుచని పొరలు, అవయవాలు మరియు శారీరక వ్యవస్థ దెబ్బతిని ప్రజల అనారోగ్యానికి దారి తీస్తుంది.

### నివారణ చర్యలు

నీటిలో ఫ్లోరైడ్ స్థాయి బాగా ఎక్కువగా ఉన్నప్పుడు గ్రామీణ స్థాయి కార్యకర్తలు ప్రత్యామ్నాయ నీటి వనరు ఏర్పాటు లేదా ఒక సులభ డిఫ్లోరిడేషన్ యూనిట్ ఏర్పాటు కొరకు సంబంధిత అధికారులను సంప్రదించవలెను. ఈలోగా ప్రజలు త్రాగడానికి లేదా వండుకొనడానికి ఆ నీటిని ఉపయోగించ వద్దని చెప్పాలి. ఒక బకెటు నీటిలో చిడికెడు పటిక లేదా కొంత సున్నము వేసి ఒక నిముషము పాటు వేగముగా, తరువాత 5-10 ని॥ల మెల్లగా నీటిని కలిపినట్లయితే, పేరుకున్న తరువాత బకెట్ పైభాగపు నీటిలో ఫ్లోరైడ్ తక్కువగా ఉంటుంది. రెండు గంటల తరువాత ఆ నీటిని వడపోసి త్రాగవచ్చు. పటికలోని శోషణ శక్తి వలన ఫ్లోరైడ్‌ను కొంత మేరకు తగ్గించవచ్చు. కాని ఇది తాత్కానిక పరిష్కారము మాత్రమే. తగిన ప్రత్యామ్నాయ వనరుల అన్వేషణయే యథార్థ పరిష్కారము.

### ఆర్సినిక్

భూగర్భంలోని అగ్నిసిఫిరోష్ పొరల వలన నీటిలో సహజముగా అర్సినిక్ కాలుష్యము సంభవిస్తుంది. ప్రస్తుతము ఇది పశ్చిమ బెంగాల్ ప్రాంతములో కనిపిస్తున్నది.

ఆర్సినిక్ విషప్రభావం వలన కండరాలు బలహీనత, కళ్లకు పక్షవాతము వంటి పలురకములైన హానికర వ్యాధులు సంభవిస్తాయి. ఆర్సినిక్ శక్తివంతమైన హానికారము. దీని దీర్ఘకాలిక ప్రభావము వలన చర్మము, కిడ్నీ మరియు ఊపిరితిత్తుల క్యాన్సర్ సంభవిస్తుంది.

### నివారణ చర్యలు

గ్రామీణ స్థాయి కార్యకర్తలు ఆర్సినిక్‌తో కలుషితమైన నీటిని త్రాగవద్దని, వంటకు ఉపయోగించకూడదని సమాజమునకు తెలియజేయాలి. ఈ నీటితో మిగిలిన గృహ కృత్యములు చేయవచ్చును.

ప్రత్యామ్నాయ వనరుల కోసం అన్వేషించుటయే సరియగు వ్యూహము. ఇందుకొరకు తగు ప్రయత్నము జరుగవలెను. 100 మీ. కన్న ఎక్కువ లోతుగల ట్యూబ్‌వెల్స్ ఇందుకు ఉపకరిస్తాయి. తమ ఇంటిలో హ్యాండ్ పంపుగల యజమానులు తమ పంపునీటిలో 0.05 మీ.గ్రా/లీ. ఆర్సినిక్ కన్న ఎక్కువ ఉంటే ఆ నీటిని త్రాగకూడదని హెచ్చరించాలి.

అదే సమయములో, ఈ దిగువ తెలుపబడిన సులభ గృహచికిత్సా విధానమును (2 మి.గ్రా. బ్లీచింగ్ పౌడర్) అభివృద్ధి చేయవలెను. ఆర్సినిక్ గల నీటికి 40-50 మి.గ్రా/లీ పటికను కలిపి ఒక నిమిషము పాటు వేగముగా, తరువాత 5-10 ని॥లు నెమ్మదిగా కలుపవలెను. రెండు గంటలలో నీటిలోని ఆర్సినిక్ నీటి అడుగున చేరుతుంది. పాత్ర పైభాగాన గల నీరు ఆర్సినిక్ రహితమై త్రాగడానికి పనికి వస్తుంది. నీటిలో తేలుతున్న ఏదైనా పదార్థము ఉంటే దానిని వడపోత ద్వారా తొలగించవచ్చును. ఏక్టివేట్ చేయబడిన పటిక మరియు ఫెర్రెక్ హైడ్రాక్సైడ్‌లను కూడా త్రాగునీటి నుండి ఆర్సినిక్‌ను తొలగించడానికి తగు మాధ్యమంగా ఉపయోగించవచ్చును.

### ఐరన్

1 మి.గ్రా/లీ కన్న ఎక్కువ ఐరన్ త్రాగునీటిలో ఉంటే గ్రామస్థులు ఆ నీటిని ఉపయోగించడం కష్టమవుతుంది, అటువంటి నీటిని బట్టలు ఉతకడానికి పాత్రల కొరకు ఉపయోగిస్తే వాటిపై మరకలు పడతాయి మరియు ఎక్కువ ఇంధనం ఖర్చు అవుతుంది. ఐరన్ ఆరోగ్యం పైన ఎటువంటి దుష్ప్రభావం చూపించదు.

### నివారణా చర్యలు

నివారణా చర్యగా సమర్థవంతమైన ఐరన్ రిమూవల్ యూనిట్ కొరకు గ్రామస్థాయి కార్యకర్తలు కోరవచ్చును. సమాజము ఈ యూనిట్ యొక్క నిర్వహణను చేపట్టునట్లు సంసిద్ధపరచవలెను. నీటిని 12-24 గంటలు నిల్వ ఉంచడం మరియు ఫిల్టర్ చేయడం ద్వారా ఐరన్‌ను తొలగించవచ్చు.

### బ్యాక్టీరియోలాజికల్ కాలుష్యము

నీటిలో బ్యాక్టీరియోలాజికల్ కాలుష్యము సర్వవ్యాపితము. ప్రాంతమును బట్టి ఫ్లోరైడ్, ఆర్సినిక్ లేదా క్లోరైడ్ ఆధిక్యతల వంటి సమస్యలు ఉంటాయి. బ్యాక్టీరియల్ కాలుష్యము ద్వారా నీటిలో అనారోగ్య కారక జీవులు చేరుతాయి. నీటిలోని రోగకారక క్రిముల ఉనికిని గుర్తించడం కష్టం. ఇట్టి నీటి కాలుష్యము ఫీకల్-ఓరల్ మూలముగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన మానవుని మలము త్రాగునీటిని కలుషితం చేస్తుంది. ఈ నీటిని త్రాగిన ఆరోగ్యవంతుడైన వేరొక వ్యక్తి వ్యాధికి గురి అవుతాడు. అందువలన నీటి పరీక్షలు చేసే సమయంలో ఆ నీటిలో ఈ-కోలి పరీక్షిస్తాము. ఈ-కోలి అనే సూక్ష్మక్రిమి మానవ మలంతో కలుషితమైనట్లైతే నీటిలో నిర్ణీత ప్రమాణమునకు మించి బ్యాక్టీరియా ఉంటే ఆ నీటిని త్రాగడం ద్వారా టైఫాయిడ్, డయేరియా, డిసెంట్రీ, కలరా, కామెర్లు, పోలియోమైలటిస్ వంటి వ్యాధులు వస్తాయి.

## గ్రామీణ ప్రాంతాలలో నీటి లక్షణాలు అనుమతించదగిన పరిమితికి మించినట్లయితే కలిగే దుష్ప్రభావాలు.

| క్ర.సం. | లక్షణాలు | సూచించిన గరిష్ట పరిమితికి మించి ఉన్నట్లయితే | ఆరోగ్యముపై దుష్ప్రభావాలు |
|---|---|---|---|
| 1. | మడ్డిదనము | 10 NTU | వినియోగించుటకు తిరస్కరించబడుతుంది. |
| 2. | ఆర్సినిక్ | 0.05 mg/l | ఆర్సినిక్ ప్రభావము వలన చర్మముపై మచ్చలు, కండరముల బలహీనత, కాళ్ళకు పక్షవాతము కలుగుతాయి. దీని దీర్ఘకాలిక వినియోగం వలన చర్మ మరియు ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. |
| 3.. | ఫ్లోరైడ్ | 1.5 mg/l F | పరిమితికి మించిన ఫ్లోరైడ్ కలిగిన నీటిని దీర్ఘ కాలం ఉపయోగించడం వలన డెంటల్ ఫ్లోరోసిస్ (దంతములపై మచ్చలు ఏర్పడడం) అధిక ఫ్లోరిన్ వలన ఎముకలను బలహీనపరిచే స్కెలిటల్ ఫ్లోరోసిస్ మరియు నాన్ స్కెలిటర్ ఫ్లోరోసిస్ వస్తాయి. |
| 4. | క్లోరైడ్ | 1000 mg/l Cl | పరిమితికి మించిన క్లోరైడ్ వలన నీరు ఉప్పగా సమాజముచే తిరస్కరించబడుతుంది. |
| 5. | నైట్రేడు | 10/100 mg/l $No_3$ | బ్లూబేబి వ్యాధి కారకము |
| 6. | ఎ) కోలిఫాం | 10/100 ml | నీటిలో అవధిని మించిన బ్యాక్టీరియాలు ఉంటే టైఫాయిడ్, బయేరియా, కలరా, కామెర్లు, పోలియో వంటి వ్యాధులు కలుగుతాయి. |
| | బి) ఈ-కోలి సంఖ్య | NIL | |

నీటి నిల్వ సమయంలో ఈ దిగువ కారణముల వలన కలుషితమవుతుంది.

1. అపరిశుభ్రమైన పాత్రలతో నీటిని సేకరించడం.
2. నీటి పాత్రలపై మూతలు ఉంచకపోవడం వలన కీటకములు చేరడం మరియు జంతువుల ద్వారా కలుషితం కావటం.
3. నీటిలోనికి మురికి పాత్రలు లేదా మురికి చేతులు ముంచడం వలన.

### నీటి వనరుల పరిరక్షణలో ముందు జాగ్రత్తలు

**చేదబావులు/బావులు**

**కలుషితమవడానికి కారణాలు**

1. దుమ్ము మరియు ధూళి కణాలు గాలి ద్వారా లేదా పక్షుల ద్వారా పడుట.
2. బావి చుట్టూ రక్షిత గోడ లేనిచోట లేదా సరిగా నిర్మించని చోట కలుషితమైన ఉపరితల జలము బావి చుట్టూ చేరుట ద్వారా మరియు బావిలోకి ఇంకుట ద్వారా.
3. లోపభూయిష్టమైన , సరిగాలేని లైనింగ్ ద్వారా నీటి ఉపరితలము కలుషితము కావడం వలన.
4. నీటిని తోడడానికి మురికిగా అపరిశుభ్రంగా ఉన్న బకెట్లు త్రాళ్ళు వాడటం ద్వారా ఓపెన్ వెల్స్ నిర్మాణము, నిర్వహణ మరియు యాజమాన్యములలో ఈ దిగువ పేర్కొనబడిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిన కాలుష్యమును సమర్ధవంతంగా అరికట్ట వచ్చును.
5. బావి పరిసరములలో గల మురికి నీరు బావిలోనికి చేరకుండా కనీసము 1 మీటరు వెడల్పు గల దిమ్మెను బావి చుట్టూ నిర్మించవలెను.
6. బావి చుట్టు మరియు బావి వద్దకు వెళ్ళు మార్గంలో మురుగునీరు నిల్వ ఉండ కుండా కనీసము 1 మీటరు ఎత్తుగల లీక్‌ప్రూఫ్ పేరాపిట్ గోడ నిర్మాణం జరగాలి.
7. బావిపైన ఒక సిమెంట్ పళ్ళెం నిర్మించడం మంచిది లేదా ఒక దోమ తెర వంటి తెరనైనా వుంచితే బావిలోనికి చెత్త మరియు ఇతర వ్యర్ధ పదార్ధములు చేరవు.
8. నీటిని తోడటానికి బకెట్ త్రాడు వినియోగించకుండా వుండేందుకు ఒక చేతిపంపును బిగించాలి.
9. బట్టలుతుకు ప్లాట్‌ఫాంలు, పశువుల తొట్టెలు మరియు ఇతర నీటి వినియోగ సౌకర్యములను బావికి దూరంగా నిర్మించినట్లయితే నీరు కాలుష్యము నుంచి కాపాడబడుతుంది.
10. ఒక వేళ బావికి మూత లేకుంటే వేసవి కాలములో బావిని శుభ్రపరిచి తీయాలి మరియు నెలకొకసారి క్లోరిన్ ద్వారా డిస్‌ఇన్ఫెక్షన్ చేయాలి.

**బోరుబావులు**

చేద బావులతో పోల్చినట్లయితే బోరుబావులలోని నీరు కలుషితమయ్యే అవకాశాలు తక్కువ.

1. వర్షపు నీటి భౌతిక కాలుష్యము భూమిచే వడగట్టబడుతుంది.
2. భూమి యొక్క అశ్వాసక్రియ స్థితులు బ్యాక్టీరియాల్ కాలుష్య స్థాయిని తగ్గిస్తాయి.
3. బోరుబావి యొక్క నీరు సాధారణంగా ఉపరితల జలముచే కలుషితం చేయబడదు. దిగువ కారణముల వలన బోరుబావులు కలుషితం కావచ్చు.
4. పంపు మరియు ఇతర భాగములు సరిగా బిగించకపోవడం మరియు బిగించిన తరువాత లేదా మరమ్మత్తుల తర్వాత డిస్‌ఇన్ఫెక్షన్ చేయకపోవడం.
5. కేసింగ్ మరియు బోర్‌వెల్ నడుమ గల వర్తులాకార స్థలములోని అంతరము వలన కలుషితమైన ఉపరితల జలం చేరడం ద్వారా.
6. బోర్‌వెల్ సమీపంలో లెట్రిన్ పిట్ వుండటం వలన బోర్‌వెల్ చుట్టూ ఉన్న స్థలము ద్వారా లేదా ప్రత్యక్షంగా కలుషిత ఉపరితల జలం చేరడం ద్వారా.

**ముందు జాగ్రత్తలు**

మురికి నీరు లేదా వర్షపు నీటి గుంటల పరిసరాలలో ట్యూబెవెల్ ఉంటే మనం అక్కడకు చేరడం కష్టం అవుతుంది. గ్రావెల్ సాకింగ్, బెన్‌టోనైట్ లేదా సిమెంటులతో 6 మీటర్ల లోతువరకు కేసింగ్ ఏన్నలర్

స్పేస్ సీల్ చేయబడాలి. మరిఅయు కేసింగ్ పైపును బెడ్‌రాక్‌లో అమర్చాలి. బురద గల ప్రదేశమలలో సానిటరీ సీలింగ్ లోతు 6 మీటర్లు వుండాలి.

**చేతిపంపు**

1. చేతిపంపు చుట్టూ కాంక్రీట్ ప్లాట్‌ఫాం మరియు వృధా నీరు పోవడానికి 10 మీటర్ల పొడవైన డ్రైన్ నిర్మించాలి.
2. ట్యూబ్‌వెల్ ప్లాట్‌ఫాం యొక్క వ్యాసము కనీసము 185 సెం.మీ. వుండాలి.
3. 1:2 పరిమాణములో నిర్మించబడిన తగిన వాలుకల మాసనరి ఎప్రాన్‌ను ట్యూబ్‌వెల్ చుట్టూ నిర్మిస్తే దాని చుట్టూ మురికి నీరు చేరకుండా నిల్వకాకుండా వుంటుంది.
4. మురుగు నీరు నిల్వకాకుండా డ్రయినేజి కాలువ నిర్మిస్తే పంపులోకి మురుగు నీరు ఇంకకుండా ఉంటుంది.
5. సాక్‌పిట్ కొరకు కనీసము 3 మీ. పొడవైన లీడ్ వేడ్రైన్‌ను నిర్మించాలి.
6. సాక్‌పిట్ వ్యాసము కనీసము 100 సం.మీ వుండాలి.
7. చేతి పంపు నుండి వచ్చే వ్యర్థ జలమును పెరటితోటకు మళ్ళించవచ్చు.

**చేపంపు పరిసరాల రక్షణ**

ఒక సాధారణ అంగీకారము మరియు సాంఘిక ఒత్తిడుల ద్వారా చేతిపంపులు, బావుల సమీపంలో మలమూత్ర విసర్జనను అరికట్టాలి.

గొట్టపు బావుల నుండి కనీసము 10 మీటర్లు వ్యాసార్థములో కంపోస్టు లేదా పెంట కుప్పలను అనుమతించకుడదు. కంపోస్టు, పెంటకుప్పలను గ్రామమునకు దూరంగా ఏర్పాటు చేసి వాటి వాడకాన్ని ప్రోత్సహించాలి.

గొట్టపు బావికి 10 మీటర్ల వ్యాసార్థములోపు బట్టలు ఉతకడం, స్నానం చేయడం. జంతువులకు నీళ్ళు పెట్టడం, కడగడం లాంటివి చేయకూడదు. ఇట్లు చేయుట వలన పంపు చుట్టూ చేరే వృధా నీరు నిలన ఉండడం తగ్గుతుంది.

**సబ్ సర్ఫేస్ వనరుల అభివృద్ధి**

ఊటలు, బావులు మరియు గాలరీలు సబ్‌సర్ఫేస్ వనరులు బావుల లోతు తక్కువగా లేదా లోతుగా వుండవచ్చు. లోతు తక్కువ బావులు తవ్వకపు బావి వలె లేదా, ఆగి ఉన్న లేదా కట్టుబడినవిగా ఉంటాయి. ఇవి గతంలోని షాలో పొరల నుండి కొద్దిపాటి నీటిని గ్రహించడానికి ఉపకరిస్తాయి. డీప్‌వెల్స్ లేదా ట్యూబ్‌వెల్స్ మొదటి ఇంప్రమేబుల్ పొరలుగా గణించబడుతాయి. ఇవి సంక్‌వెల్, బోర్డ్ లేదా డ్రిల్డ్ రకముగా వుంటాయి.

**ఉపరితల వనరులు**

ఉపరితల వనరులకు చుట్టూ కంచె వేయడం ద్వారా మానవులు, జంతువులు ఆ నీటి దగ్గరకు చేరకుండా రక్షించవచ్చు. ఈ వనరుల చుట్టూ చెత్త కుప్పలు వేయడం, మల విసర్జన చేయడం నిషేధం.

**డిస్ ఇన్ఫెక్షన్ మరియు బ్లిచింగ్ పౌడర్ కలిపే విధానం**

వివిధ జల వనరులను డిస్‌ఇన్ఫెక్ట్ చేయడానికి సాధారణంగా క్లోరినేషన్ విధానాన్ని అనుసరిస్తారు. క్లోరినేషన్ కొరకు బ్లీచింగ్ పౌడర్‌ను ఉపయోగిస్తారు. సహజంగా ఫీల్డ్‌లో ఉపయోగించే బ్లీచింగ్ పౌడరులో 25% క్లోరిన్ వుంటుంది. డిస్‌ఇన్ఫెక్ట్ చేయడానికి ముందుగా ఆ నీటివనరు యొక్క క్లోరిన్ డిమాండ్‌ను ధవీకరించుకోవాలి.

**బ్లిచింగ్ పౌడరు కలిపే విధానం**

తగిన పరిమాణం గల బ్లీచింగ్ పౌడరును ఎంపిక చేసుకున్న తరువాత దానిని ఒక బకెట్టులోనికి తీసుకోవాలి. దానిలో కొద్దిగా నీరు పోసి గాజుకడ్డీ సహాయంతో పేస్టుగా చేయాలి. తరువాత డగ్‌వెల్ నీటిని ఈ పేస్టులో పోయాలి. కొద్దిసేపు కదలచ్చకుండా వుంచాలి. బకెట్ అడుగుభాగమునకు లైమ్ చేరిన తరువాత పైన వున్న నీటిని వేరొక బకెట్‌లో పోసి దాని నుంచి బావిలోనికి పోయాలి. బావిలోని నీటిని బాగా కదిలించడం ద్వారా ఈ ద్రావణం నీటిలో కలుస్తుంది. 30 ని॥ల తరువాత డగ్‌వెల్ నీటిలోని అంతర్గత క్లోరిన్‌ను అంచనా వేసి అటు తరువాత ఆ నీటిని త్రాగవచ్చు.

## ఇతర డిస్ఇన్ఫెక్షన్ పద్ధతులు: పాట్ క్లోరినేషన్

**ఒక కుండ పద్ధతి**

6.8 మీ.మీ. మందము, 7-10 లీటర్ల సామర్థ్యము కలిగి అడుగున రంధ్రములు వున్న మట్టి లేదా ప్లాస్టిక్ కుండను తీసుకొని, దాని అడుగుభాగములో సగాన్ని 20-40 మి.మీ. కంకరతో నింపాలి. తరువాత 1:2 నిష్పత్తిలో బ్లీచింగ్ పౌడర్, ఇసుకలను కంకరపై వేయాలి. అటు తరువాత మిగిలిన కుండను మెడభాగం వరకు కంకరతో నింపి, కుండ మూతి తెరచి వుండేలా బావి అడుగుకు చేర్చాలి.

రోజుకు 1000-1200 లీటర్ల నీటిని తోడుకొనే బావిని 1.5 కిలోల బ్లీచింగ్ పౌడరు తగిన విధంగా క్లోరినేట్ చేయగలదు.

**రెండు కుండల విధానం**

ఒక ఇంటి కొరకు ఉపయోగించు బావికి ఒక్క కుండ విధానాన్ని పాటిస్తున్నారు. ఇందువలన కొన్ని సందర్భములలో నీటిలో క్లోరిన్ మోతాదు అధికం అవుతుంది. ఇటువంటి సందర్భములలో ఒక దానిలో ఒకటి అమర్చబడిన రెండు సిలెండర్ వంటి కుండలను ఉపయోగించే విధానం ఉపయోగకరం. లోపలి కుండలో 1 కిలో బ్లీచింగ్ పౌడరు 2 కిలోల ఇసుకల మిశ్రమాన్ని రంధ్రము వరకు నింపాలి. తరువాత దాని ఔటర్‌పాట్‌లో వుంచాలి. ఈ యూనిట్ త్రాడు సహాయంతో బావి అడుగుకు చేర్చాలి. All H & PH వారి సర్వే ప్రకారం ఒక రోజుకు 400-500 వరకు లీటర్లు నీరు తోడబడుతున్న ఇంటి బావులలో ఈ విధానం 2-3 వారాలకు సమర్థవంతంగా, పనిచేస్తుందని తేలింది.

**డ్రాప్ క్లోరినేషన్**

ఇందుకొరకు 6-8 మి.మీ. బ్రాస్‌టాప్ కలిగి 3-4 లీటర్ల సామర్థ్యం గల ఒక ప్లాస్టిక్ కంటైనర్, 1 కిలో బ్లీచింగ్ పౌడరు, ఒక మంచి జల్లెడ అవసరం.

వేరొక పాత్రలో బ్లీచింగ్ పౌడరును నీటితో కలిపి ద్రావణాన్ని తయారు చేసుకొని, దానిని జల్లెడ ద్వారా ప్లాస్టిక్ కంటైనరులోనికి వడకట్టాలి. తరువాత ఈ కంటైనర్‌ను ఒక నైలాన్ వల లోపల వుంచి త్రాడు సహాయంతో బావి అడుగు భాగానికి చేర్చాలి. బావి నుండి ప్రతిరోజు తోడే నీటి పరిమాణాన్ని బట్టి పంపు/స్టాపర్ ద్వారా కంటైనర్‌లోని ద్రావణ బిందువులను సర్దుబాటు చేయాలి. రోజుకు 100 లీటర్ల నీరును తోడే బావిలో ఈ యూనిట్ ద్వారా ఒక వారం రోజులకు సరిపడా క్లోరినేషన్ చేయవచ్చు.

పై విధంగా మంచినీటి ఉపయోగాలను గుర్తించి సమగ్రమైన విధానం అనుసరించి నీటి వనరుల సంరక్షణతో పాటు మంచినీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకొని వినియోగించుకోవలసి ఉంటుంది. దీనిని గ్రామ పంచాయితీలు పర్యవేక్షించవలసి ఉంటుంది. ■

# పారిశుద్ధ్యపు నిచ్చెన
# మల వ్యాప్తి కారకాలు - నిరోధకాలు



బహిరంగ మల విసర్జన చేయడం వలన మలం మరియు మల అవశేషాలు భూమి మీద బహిరంగంగా వదలి వేయడం జరుగుతుంది. మన గ్రామీణ ప్రాంతాలలో నేటికీ 70 శాతం నుండి 80శాతం ప్రజలు ఈ విధానాన్నే కొనసాగిస్తున్నారు. దీని వలన మలం ఎలా వ్యాప్తి చెందుతుందో తెలియ చెప్పేదే ఈ మల విస్తృతి పటం.

పై పటాన్ని గమనిస్తే మనకు క్రింది విషయాలు స్పష్టం అవుతున్నాయి.

1. బహిరంగ మల విసర్జన చేస్తున్న బాలుడు
2. మల విసర్జన చేస్తున్న ప్రదేశాలను ఆనుకుని ఉన్న నీటి వనరులు
3. పంట పొలాలు, పెంపుడు జంతువులు, ఈగలు, దోమలు వంటి ఎగిరే కీటకాలు, చేతులు, కాళ్ళకు మల వ్యాప్తి చెందుతున్నట్లు చూపిస్తున్న బాణం గుర్తులు
4. పై వాటి ద్వారా మల అవశేషాలు కలిసిన ఆహారం, పానీయాలు, వాటిని భుజిస్తున్న ఓ బాలిక.

దీనిని గమనిస్తే మనకేమి అర్థం అవుతుంది. బహిరంగ మల విసర్జన చేయడం వలన మల అవశేషాలు చేతులు, కాళ్ళు, పంట పొలాలు, నీటి వనరులతో కలిసి అవి మన ఆహారంలోనికి చేరడం, ఆ కలుషిత ఆహారాన్ని / నీటిని మనం భుజించడం జరుగుతుంది. అంటే మనం విసర్జించిన మలం మన ఆహారంలో చేరుతుండగా దానిని మనం భుజిస్తున్నాం అన్నమాట. ఇలా సగటున ఓ మనిషి రోజుకు 5 గ్రాముల మలం భుజిస్తున్నాం అంటే నమ్మగలమా? కానీ ఇది నిజం. ఇప్పుడు మీరు "ఛీ - నేను నా మలాన్ని, ఇతరుల మలాన్ని తింటున్నానా" అనిపిస్తుంది కదూ. కానీ నమ్మక తప్పదు మరి. మనం చేసిన పనికి ప్రతిఫలం మనమే అనుభవించాలి కదా.

### మల అవశేషాలను భుజించడం / త్రాగడం వలన ఏమి జరుగుతుంది?

మలం లేదా మల అవశేషాలులో సూక్ష్మజీవులు అనగా బాక్టీరియా, వైరస్ వంటి వ్యాధి కారకాలు అనేకం ఉంటాయి. దీని వలన ముఖ్యంగా వర్షాకాలంలో మలేరియా, పచ్చకామెర్లు, జ్వరం, జలుబు, దగ్గు, వాంతులు, విరేచనాలు సంక్రమిస్తాయి.

### మలం వ్యాప్తి చెందకుండా అడ్డుకోవడం ఎలా?

మల వ్యాప్తి జరుగకుండా చూడాలంటే ప్రధానంగా మలాన్ని బహిరంగంగా వదలకూడదు. అంటే బహిరంగ మల విసర్జనను తక్షణం నిలిపి వేయడమే మార్గం. బహిరంగ మల విసర్జనకు వెళ్ళకుండా మరి ఎలా? మరుగుదొడ్డి నిర్మించుకోవాలంటే పైసలు కావాలి. పైగా కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు ఏమైనా ప్రత్యామ్నాయ మార్గాలున్నాయా? ఇదే కదా మీ సందేహం. అక్కడే మనం పారిశుద్ధ్యపు నిచ్చెన గురించి చర్చిద్దాం.

### పారిశుద్ధ్యపు నిచ్చెన

ప్రస్తుతం అనుసరిస్తున్న ఆరుబయట మల విసర్జనను ఆపివేసి దానికి గల వివిధ ప్రత్యామ్నాయాలను చూపించేదే ఈ పారిశుద్ధ్యపు నిచ్చెన. పారిశుద్ధ్య నిచ్చెనలో 4 ప్రధాన దశలున్నాయి. వీటిలో ఏదో ఒక దశను ఆచరించడం వలన ద్వారా పాదాలు/ కాళ్ళు, నీళ్ళు, పొలాలు, ఈగలు, దోమలు వంటి వాటి ద్వారా మలం వ్యాప్తి చెందకుండా చూడవచ్చు. అవి :

**I. తాత్కాలిక గుంతల ఏర్పాటు**

ప్రస్తుతం బహిరంగ మల విసర్జన చేస్తున్న ప్రదేశాలలో గుంతను

నిర్మించి ఆ గుంతలోనికి మల విసర్జన చేసే విధంగా అమర్చుకుని, మల విసర్జన తదుపరి మట్టిని / బూడిదను గానీ మలంపై చల్లడం ద్వారా మల విస్తృతిని కొంత మేరకు అరికట్టవచ్చు. తదుపరి గృహాలలో (టాయిలెట్లు) / మరుగుదొడ్లు నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

**II. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు**

ఈ దశలో గుంత నిర్మాణం, బేసిన్ నిర్మాణం చేసుకుని, గోడలు, పైకప్పు, తలుపు, వంటి సౌకర్యాలు తాత్కాలికంగా ఏర్పరచుకోవచ్చు. అనగా తాటి ఆకులు, కొబ్బరి ఆకులు, రబ్బరు కొమ్మలు, వెదురు, ఈత ఆకులు, ప్లాస్టిక్ / గోనె సంచులు, పాత గుడ్డలు, రేకులు, వంటి వేటినైనా తాత్కాలికంగా మరుగుగా ఏర్పరచుకోవడం ద్వారా మరుగుదొడ్డి వాడకాన్ని ప్రారంభించవచ్చు.

**III. మరుగుదొడ్డి పూర్తి స్థాయిలో నిర్మాణం**

రెండవ దశ తదుపరి తాత్కాలిక నిర్మాణం స్థానే, పర్మినెంట్ ఆకృతిలో అనగా చుట్టూ గోడలు, తలుపు, పైన కప్పు వంటివి చేసుకోవడం అనగా ఇది పూర్తి స్థాయి ఆకృతిలో నిర్మించుకున్న మరుగుదొడ్డి.

**IV. వి.ఐ.పి. టాయిలెట్ (VIP- Ventilated Improved Pit)**

ఈ తరహా టాయిలెట్ల నిర్మాణంతో కీటకాలు, దుర్వాసనలనుండి దూరం చేయవచ్చు. దీనిలో వెలుతురు ధారాళంగా ప్రవేశించే వీలు, కీటకాలు ప్రవేశించకుండా మెస్ వంటి నిర్మాణం, దుర్వాసన పోవడానికి వీలైన గొట్టం ఏర్పాటు వలన ఇది చాలా సౌకర్యవంతమైన నిర్మాణం.

**V. చేతుల ద్వారా మల వ్యాప్తిని నివారించడం ఎలా?**

మల విసర్జన అనంతరం చిన్న పిల్లలకు లేదా ముసలి వారికి మల విసర్జన తదుపరి శుభ్రపరచిన తరువాత తప్పని సరిగా సబ్బుతో చేతులను కడుక్కోవాలి. ఇదే దీనికి ఏకైక పరిష్కారం.

పై పారిశుద్ధ్యపు నిచ్చెనను అనుసరించి వివిధ మార్గాల ద్వారా జరిగే మల వ్యాప్తిని అరికట్టవచ్చు. మన ఆర్థికస్థాయిని బట్టి పై వాటిలో మనకు అనుకూలమైన విధానాన్ని తక్షణమే అనుసరించాలి. అయితే చేతుల ద్వారా మల వ్యాప్తిని మరుగుదొడ్డి వాడకం ద్వారా నివారించలేము. కనుక దేనికేమి చేయాలో చూద్దాం.

## మల వాధి నిరోధకం ఆట / మల వ్యాప్తిని అడ్డుకోవడం ఎలా ? ఆట




పి. మాధురి, పాకల్టీ అపార్డ్





# మహిళలకు పోషకాహార అవసరం

**'స్త్రీ' ల జీవితాలు కుటుంబ భోజనావసరాలతో ముడిపడి ఉన్నాయనటంలో అతిశయోక్తి కాదు. చిన్నప్పటి నుంచీ వంట మీద శ్రద్ధ లేకుండా ఎక్కడపోతుందోనన్న ఆదుర్దాతో తల్లులు కూతుళ్ళ నొక కంట కనిపెడుతూనే ఉంటారు. ఆ తర్వాత ఇక ఎదురు తిరగడమనే ప్రసక్తే లేదు.**

నేటి యువకులు ఒక పక్క ఇంటిపని, ఇల్లాలితనాన్ని ప్రేమిస్తూనే, ఉద్యోగాన్ని, బైటపనులనీ చేసుకునే 'ఆదర్శపత్ని' ల కోసం ఎదురుచూస్తున్నారు.

పత్రికలూ, వ్యాపార ప్రకటనలు 'కుటుంబ ఆరోగ్యం' పేరుతో ఆహార పరిశ్రమల్ని పెంచేందుకు, వృద్ధిచెందుటకు ఆడవాళ్ళనే నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉంటాయి. వీటన్నింటితో మనం 'ఆదర్శ వినియోగదార్లు' కింద తయారవుతున్నాము.

ఆడవాళ్ళు రోజుకు మూడు పూటలూ, రోజు తర్వాత రోజూ బతికున్నంత వరకూ వంటనే ధ్యేయంగా అంగీకరిస్తారు. ఎటువంటి గుర్తింపూ పొందని, అంతూ పొంతూలేని పని ఇది. ఇంట్లో, వంటింట్లో ఎంత చాకిరీ చేసినా మన హోదా, ఆత్మవిశ్వాసం ఏమీ పెరగదు. కొంతమందికి ఈ ఆత్మవిశ్వాసం ఏ కొద్దిపాటో ఉన్న, ఎప్పుడూ చేస్తున్న వంటలకంటే ఇంకొంచం సులువుగా తయారు చేయటానికి చిట్కాలు నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాం. కొత్త ఐడియాలు, ఆలోచనలని నేర్చుకోవడానికి మనమున్నంత సిద్ధంగా ఏ ప్రొఫెషనల్ గ్రూప్ కూడా ఉండదు.

### ఆహార విధులు

- మన శరీరాన్ని ఆరోగ్యంగా, చురుకుగా వుంచడానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు (Energy giving), ప్రోటీన్లు, నూనె పదార్థాలు, విటమిన్లు, మినరల్స్ అన్నింటికీ మనం తినే భోజనమే ఆధారం. ఉదా:- Vitamin A - ఆకుకూరలలో సమృద్ధిగా ఉంటుంది. వీటిలో Vitamin A తోపాటు, పీచు (fibre), ఇనుము, 'బి' కాంప్లెక్స్ కలిసిన మిశ్రమం మనకు లభిస్తుంది.
- వెన్న, నూనెలో మాత్రం 100% కొవ్వే ఉంటుంది. మరే విటమిన్స్ ఉండవు. అయినా మనం నూనెని అలాగే త్రాగం కాబట్టి, వంటకు మాత్రమే ఉపయోగిస్తాం కాబట్టి ఒక మోతాదులో వాడే నూనెతో ప్రమాదం లేదు.
- మనం తినే భోజనంలో ఎక్కువ భాగం శరీరాన్ని సజీవంగా ఉంచటానికి, శరీరం బరువు, ఇతర విధుల నిర్వహించటానికి ఖర్చవుతుంది. ఈ కనీస ఆహారమే శరీరాన్ని సజీవ స్థాయిలో ఉంచటానికి, అంటే కనీసం మెటబాలిజమ్ కి కావలసిన శక్తి నిచ్చేది.

### హాస్టల్‌లో ఉండే స్త్రీల కోసం

చాలా వరకు నా కెరీర్‌లో నేను ఎదురైన Anaemic Patients లో 60% మంది తల్లితండ్రులకే దూరంగా ఉంటూ తమ తమ చదువులరీత్యా, ఉద్యోగ రీత్యా దూరంగా ఉన్న 18 - 25 ఏతి. మధ్య వయసున్న స్త్రీలు. వారి కోసం చిన్న చిట్కాలు ఇవిగో....

### ఆహారం ద్వారా అదనపు శక్తి తీసుకోవల్సిన వాళ్ళు

**ఎదిగే వయసు పిల్లలు:** వీరికి ఆటపాటలకీ, బరువు పెరగటానికి, పొడుగు అవడానికి ఆహారం అవసరం మరీ ఎక్కువగా ఉంటుంది.

- పిల్లలు బరువు పెరగాలంటే కావల్సింది 'కాలరీలు, ప్రొటీన్లు'.
- వీటికోసం పిల్లలకూ రోజూ తినే అన్నం, పప్పు కాకుండా, పాలు, గుడ్లు, మాంసం కూడా చాలా అవసరం.

**గర్భంతో ఉన్న స్త్రీలు:** కడుపులో పెరుగుతున్న పాపకోసం, పాలు తాగే పిల్లలున్న స్త్రీలకు సమృద్ధిగా పాలుండటం కోసం అదనపు ఆహారం తప్పనిసరి.

- పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లుల గర్భం మొత్తం సమయంలో 8-10 ఏస్త్రం వరకూ బరువు పెరగాలి.
- వీళ్ళు పోషకాలు ఎక్కువగా ఉన్న పాలు, కూరగాయలు, పప్పులు ఎక్కువగా తినాలి.
- గర్భిణీలుగా ఉండి బరువు పనిచేసే స్త్రీలకు అదనపు ఆహారమైనా ఇవ్వాలి లేదా ఆ మేరకు శ్రమను తగ్గించి, విశ్రాంతి తీసుకునే అవకాశమైనా కల్పించాలి. రెండూ ఇవ్వగలికితే మరే మంచిది.
- ఈ సమయంలో స్త్రీలు బరువు పెరగకపోతే, వాళ్ళ కండరాలలోని శక్తి శరీరంలో ఉన్న కొవ్వు కరిగి పాపకు ఆహారంగా అందుతుంది కానీ, అది తర్వాత తల్లి శరీరాన్ని కుంగదీసి అనారోగ్యాలకు గురిచేస్తుంది.

**అస్వస్థకు గురైన వాళ్ళు:** జబ్బు తగ్గడానికీ, ఆరోగ్యం కుదుట పడటానికీ ఎంత విశ్రాంతి తీసుకున్నా అదనపు ఆహారం తప్పని సరిగా తీసుకోవాలి.

**కార్బోహైడ్రేట్లు:**

- కార్బోహైడ్రేట్లు ధాన్యాలలో ఉండదు. బియ్యం, గోధుమ, జొన్న, రాగి, సజ్జ, ఇవన్నీ మన భోజనంతో ప్రధాన భాగాలు.
- శరీరానికి కావలసిన "శక్తి" చవకగా ధాన్యాలలో లభిస్తుంది.

ఆహారంలో ధాన్యం పరిమాణం తగ్గితే వెంటనే బరువు తగ్గుతారు. ఉదా: పిల్లలు చాలినంత తిన్నప్పుడే త్వరగా పొడుగు పెరుగుతారు మరియు బరువు పెరుగుతారు. చాలినంత భోజనం దొరకని పక్షంలో వాళ్ళు బలహీనమై, చిక్కిపోయి పొడుగు పెరగటం కూడా ఆగిపోతుంది. పోషకాహారం ఏ మాత్రం దొరకని పిల్లలు పీలగా అయిన కాళ్ళు, చేతులతో, ఉబ్బిన పొట్టతో కనిపిస్తారు. యూనిసెఫ్ లాంటి సంస్థల ఉపయోగించే ఫోటోలు కొన్ని ఈ విధంగా ఉండటం మన చూస్తుంటాం. ఈ పిల్లలు సాధారణంగా అనారోగ్యంగానే ఉంటారు. చాలినంత పోషకాహారం దొరక్కపోవడమే శరీరాన్ని అనారోగ్యానికి గురిచేస్తుంది.

- మన దైనందిన ఆహారం (Staple Diet) లో లోటు వచ్చినప్పుడు, శరీరంలో శక్తి తగ్గిపోయి విపరీతమైన అలసటకు గురవుతామని అర్థమవుతుంది.
- అలసటతోపాటు, పిల్లల్లో ఎప్పుడూ చీకాకు, ఏడవడం, ఆట పాటా మీద ఆసక్తి లేకపోవడం, తల్లి కొంగుపట్టుకొని తిరుగుతూ, తిండి మీద ఆసక్తి తగ్గిపోయి, తిండికి మొండికేస్తారు.
- అన్నం వండినప్పుడు గంజి వార్చేయడం, పప్పు వండిన నీళ్ళు ఒంపేయడం చేయకూడదు. ఈ నీళ్ళతోపాటు విటమిన్లూ, మినరల్సూ వృధా అయిపోతాయి.

**ఎంత ప్రొటీన్లు అవసరం? :**

- పెద్ద వాళ్ళకి రోజుకు శరీర బరువులో ప్రతి 1 kg కి 1 gm protein అవసరం.
- పిల్లల్లో మాత్రం అదే కిలోగ్రాముకు 2 gm protein అవసరం.

| పోషక పదార్థం | దొరికే ఆహార పదార్థం | కొరత వల్ల పరిణామాలు | ఎక్కువైతే కలిగే పరిణామం | కొరత వల్ల వచ్చే సమస్యకి చికిత్స |
|---|---|---|---|---|
| విటమిన్ డి | సూర్యరశ్మి ద్వారా ఆహారంలో కాలేయం, గుడ్లు పసుపు రంగు, చేప, పాలు వెన్న, నెయ్యి | పిల్లల్లో కాలి ఎముకలు విల్లులా వంగి, 'రికెట్స్' వ్యాధి కలుగును. పెద్ద వాళ్ళలో ముఖ్యంగా స్త్రీలలో ఎముకలు సరిగా ఏర్పడకపోవడం Oster-Melacic అంటారు. తుంటి ఎముకలు బలహీనంగా ఉండి ప్రసవం కష్టం అగును | మాసివ్ 'డి' మోతాదు దుష్ఫలితాలు కలుగును. మూత్రంలో కలిసే గుణం లేదు కనుక బైటికి పోయే అవకాశం కూడా లేదు. | పిల్లలకి తగినంత ఆహారంతో పాటు రోజుకు 1-2 గంటల సేపు సూర్యరశ్మి తగిలేలా బయట తిరగనివ్వాలి. |
| ఇనుము | అన్ని కూరల్లో, పప్పు ధాన్యము, కాలేయం, మాసంలో ఉండును. | బలహీనత, ఊరికే అలసట కలుగును. | రక్తంతో ఇనుము కావలసినంత రాగానే మానేయడం మంచిది అదనంగా ఉంటే శరీరంలో ఇమడదు. | ఇనుముకోసం మాత్రలు, టానిక్కులు, తాజా పండ్లు, ఆకుకూరలు తినాలి. |
| పిండి పదార్థాలు | బియ్యం, గోధుమ, జొన్న రాగులు | పిల్లలు బరువు తగ్గును పెరుగుదల ఉండదు. శక్తి, ఉల్లాసం ఉండవు. పొట్ట ఉబ్బి, కాళ్ళ, చేతులు సన్నగా అగును. | డాక్టర్లు ఆకలి పెరగడానికి రాసే 'హార్మోన్లు' హానికారం. అధిక వ్యయం కూడా. బలహీనం ఉన్న పిల్లలకి ఇవ్వరాదు. | డాక్టర్లు రాసే హార్లిక్స్, ప్రొటీన్ బిస్కెట్లు, టానిక్స్‌తో, కూరగాయలు, తాజా పండ్లు, భోజనం ఆకలి లేకున్న కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు తినాలి. |
| మాంసకృత్తులు | కందిపప్పు, శనగపప్పు | శరీరం సన్నగా ఎముకలు పొడిచినట్లు, జుట్టు ఎర్రబడి పల్చబడును | ప్రొటీన్ బిస్కెట్లు, సోయాబీన్స్, పల్లీలు, చక్కెరతో చేసిన పానీయాలు చాలా ఖర్చుతో కూడినది. | పాలు, పెరుగు, పల్లీలు, మజ్జిగ, పప్పులు తక్కువ ఖర్చు పని. |
| నూనె, కొవ్వు పదార్థాలు | పల్లీ నూనె, కుసుమ నూనె, పొద్దు తిరుగుడు పువ్వు నూనె, నెయ్యి, వెన్న, వనస్పతి, మీగడ, డాల్డా | బరువు తగ్గి, ఒసిక లేకపోవడం, చర్మం పాడౌబారడం | స్థూలకాయం | రోజుకి 20-25 గ్రామ్స్ ఒక వ్యక్తికి సరిపోతుంది. నెలకో మన కుటుంబానికి ఎంత వాడుతున్నామో లెక్కవేసుకోవాలి. |

- పిల్లలకి పాలు ఇవ్వడం ఎంతో అవసరం.
- పేద ప్రజలకి ఆహారాన్ని పోషకాహారం పేరుతో అమ్ముతారు. పేదవారు డబ్బుతో ఆహారం కొనలేక, అనారోగ్యం పాలు అయినప్పుడు, అదే ఆహారాన్ని టానిక్స్ డబ్బాల్లో దొరికే పోషకాహారాల రూపంలో మాయ చేసి వారికి అమ్ముతాయి ఈ పరిశ్రమలు.
- హార్లిక్స్ లాంటి పౌష్టికాహార పానీయాన్ని మందుల్లా అమ్ముతారు. ఈ ఖరీదైన అదనపు Protein కేవలం శరీరానికి అవసరమైన Carbohydrates సమకూర్చును కానీ, పౌష్టికాహార లోపాన్ని భర్తీ చేయవు. నిజం చెప్పాలంటే, హార్లిక్స్ కేవలం మనం తినే అన్నం, రొట్టెల పనే చేస్తుంది కానీ అదనపు protein మాత్రం ఉండవు.

## కొవ్వు - నూనె పదార్థం

**నూనెలు, కొవ్వు పదార్థాలు అని 2 రకాలు.**

- పల్లీనూనె, నువ్వులనూనె, పొద్దు తిరుగుడు నూనెల వంటి నూనెలు.
- మొక్క జొన్న నూనె, పామోలిన్ (సగం నూనె సగం కొవ్వు పదార్థం), నెయ్యి, వనస్పతి లంటా కొవ్వు పదార్థాలు అని రెండు రకాలు.
- చాలా మంది కొవ్వు పదార్థాల కంటే నూనెల మంచివి అనుకుంటారు కానీ, శక్తి ఇవ్వటానికి సంబంధించినంత వరకు 1 gm Dalda / 1 gm (Gee) నెయ్యికి 1 gm నూనెకి ఏమీ లేదు. వాటి Chemical Composition లో తేడా ఉంది అంతే.
- కొవ్వు పదార్థములు అధికంగా తింటే శరీరం లావు అవడమే కాకుండా, ధమనుల గోడులకు పేరుకుని, రక్తనాళ వాహికల్ని చిన్నవిగా చేసేసి, రక్తపోటుకు, గుండె పోటుకూ, చివరికి ఇతర క్యాన్సర్లకు దారి తీస్తుంది.

**విటమిన్లు - మినరల్సు:**

- Vitamins A, B, C, D, E, K అనే ఇంగ్లీషు అక్షరాల్తో ఉంటాయి.
- ఇనుము, కాల్షియం, రాగి, జింకు (తత్తునాగం) లను మినరల్సంటారు.
- ఇవి చాలా ముఖ్యమైన పోషక పదార్థాలు అయినప్పటికీ, వీటి అవసరం చాలా సూక్ష్మంగా ఉంటుంది.
- ఆరోగ్యంగా ఉన్నవాళ్ళు తినే ఆహారం అంటే ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పాలు, మాంసం, పండ్లు మిశ్రమంగా తినడం వలన ఏ (defficiencies) కొరతలూ ఏర్పడవు.
- వీటి కొరత వలన Vitamin A వలన - రేచీకటి, Vitamin B వలన - నాలుక మీద పుండ్లు, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటివి కలుగును.
- పండిన పండ్లు, ఆకు కూరల్లో - Vitamin A లభిస్తుంది. మరియు C, B లతోపాడు ఇనుము, కాల్షియం, జింకు మినరల్సుంటాయి.

పప్పులో ప్రధానంగా ప్రోటీన్లతోపాటు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, Vitamin B Complex, ఇతర పదార్థాలు జింకు, మాంగనీస్, కాపర్, సెలీనియం, మెగ్నీషియం మొదలగునవి (trace elements) లభించును. ఎర్రరక్తకణాల పెరుగుదలకు అవసరం. ఈ పదార్థాలన్నీ ఒక మోతాదులో కలిస్తేనే రక్తం తయారగును. ఇందులో ఏ ఒక్కటి ప్రత్యేకంగా తీసుకున్న ప్రయోజనం ఉండదని గ్రహించాలి. రక్త హీనత ఉంటే ఒక్క ఇనుము తీసుకుంటే లాభం లేదని గ్రహించాలి.

## విటమిన్ - మినరల్ కొరత లేర్పడడానికి కారణాలు

- అన్నింటికంటే పెద్ద కారణం ఆర్థిక పరిస్థితి. కూరగాయలు, పాలు, పండు, కొనగలిగే శక్తి లేక అన్నం, రొట్టెలు, అప్పుడప్పుడు పప్పుతినే స్త్రీలు, పిల్లలు ఈ కొరతలు ఏర్పడతాయి.
- అంతకంతకూ ఆధునికత పెరుగుతున్న మన సామాజిక సందర్భంలో
- పోషకాహారం లోపం అనేది ఆహార పరిశ్రమలు తయారు చేస్తున్న నిల్వ ఉండే ఆహార పదార్థాలతో ముడిపడి ఉంది.
- ఉదాహరణకు అన్నం వండినప్పుడు గంజి వార్చేయడంతో దానిలో విటమిన్లు, తవుడు కూడా పోతుంది.
- కూరగాయల్ని ఎక్కువ నూనెలో వేపడం మూలంగా కూడా అదే అనర్థం ఉంటుంది.

ఇవన్నీ కాకుండా ఆహార పదార్థాల్ని విపరీతంగా శుభ్రం చేసి, ఎక్కువ నీళ్ళలో వండి నీళ్ళని వంపడం వలన, అందులో ఉన్న విటమిన్లు కొట్టుకుపోవును.

- తాజాగా దొరికే పండ్లతో ఇంట్లో పండ్లరసం చేసుకోలేక రస్నా లాంటి మీద ఆధారపడకూడదు. కృత్రిమంగా తయారు చేసిన నిల్వ పదార్థాల కంటే సంప్రదాయంగా ఇంట్లో చేసినవి నూరు శాతం శ్రేయస్కరం.
- వంటలో చక్కర బదులు చెల్లం వాడాలి. (సీట్లు, పాలు, టీలో)
- వీలైనంత వరకు బ్రౌన్‌బ్రెడ్ (Whole Wheat) గోధుమలతో

**పోషకాహారం లోపాలను ఎలా ఎదుర్కొవాలి?**

- సమతుల్య ఆహార పద్ధతి శ్రేయస్కరం.
- మందులు, టానిక్కులు పెద్ద ప్రయోజనం ఉండదు.
- కొన్ని విటమిన్లు అధిక మోతాదులో తీసుకుంటే చెడు జరిగే అవకాశం.
- B-Complex vitamins ఎక్కువ తీసుకుంటే 6-8 గంటలలో యూరిన్ ద్వారా విసర్జించబడును. (B-Complex మాత్రలు వాడినప్పుడు మూత్రం పసుపుగా వచ్చును).
- కానీ Vitamin A, D, E, C కనుక ఎక్కువ మోతాదులో తీసుకుంటే, అవి నీరులో కలవనందున, కాలేయంలో నిలువ ఉండి, విషపూరితం అగును.
- అందుకే ఆహారంతో సమృద్ధిగా కాయగూరలు, పళ్ళు, పాలు, పప్పు ధాన్యాలు తీసుకున్నట్లైతే మన శరీరానికి కావలసిన పోషక విలువలు అందును.

## పోషకాహారాలు, సమృద్ధిగా, తేలికగా చేసే కొన్ని వంటకాలు

- పొంగలి, కాచిడి, పులగం (పెసరపప్పు, బియ్యం 1:3 పాళ్ళలో వాడడం) ఉడికేప్పుడు జిరా, మిరియాలపొడి, వడ్డించే ముందు నెయ్యి, ఖాజు వాడటం.
- మిగిలిపోయిన కూరలతో పప్పు పరాఠాలు చేస్తే రుచిగా ఉండను. గోధుమ పిండిలో నీరు బదులు, మిగిలిన కూరలతో వాడవచ్చు.
- చక్రపొంగలి - పెసరపప్పు, బియ్యం, పాలు, బెల్లం, నెయ్యి, జీడిపప్పు ఎంతో మంచి పోషక విలువలు ఉన్నవి.
- బొంబాయి రవ్వతో చేసే ఉప్మాలో నీరుకు బదులు పాలు వాడాలి.

**డా॥ నాగమణి, బి.ఎ.ఎమ్.ఎస్.**

# సోషలిస్టు యోధుడు – రామమనోహర్ లోహియా

**సోషలిస్టు మేధావిగా, కర్మయోగిగా పేరుపొందిన రామమనోహర్ లోహియా మార్చి 23, 1910లో హీరాలాల్, చాందా దంపతులకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఫైజాబాద్ జిల్లాలో గల అక్బర్‌పూర్‌లో జన్మించారు. తండ్రి హీరాలాల్ ఉపాధ్యాయులుగా పనిచేశారు. రామమనోహర్ తల్లి ఆయన జన్మించిన రెండున్నర సంవత్సరాలకే చనిపోయింది. వైశ్యకులంలో పుట్టిన ఆయన తాత తండ్రులు ఇనుము (లోహం) వ్యాపారం చేస్తుండేవారు. అందువల్లనే వారిని లోహియాలు అని పిలిచేవారు.**

డాక్టర్ లోహియా పరిపూర్ణ దేశభక్తుడు. సంకుచిత జాతీయవాది మాత్రం కాదు, సాంఘిక సమానత్వాన్ని లోహియా గట్టిగా సమర్థించిన వ్యక్తి. మౌలికంగా ఆయన ఆలోచనాశీలి, రచయిత కూడా. భారతావనిని అన్ని విధాలా ప్రగతిపథంలో నడపాలని ఆ వైపుగా తన కృషిని కొనసాగించిన క్రియాశీల రాజకీయవేత్త.

పుట్టిన దాదిగా చైతన్యశీలియైన లోహియా 1920లో దేశభక్తుడైన 'తిలక్' మరణం ఆయనలో కొంత పరివర్తన తీసుకొచ్చిన మాట వాస్తవం. కేవలం తనకు పదేళ్ల వయసులో లోహియా గాంధీజీ సత్యాగ్రహంలో జేరారు. 1921లో నెహ్రూని కలిశారు. 1924లో కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్నారు. 1925లో మెట్రిక్యులేషన్, 1929లో బి.ఎ. ఆనర్స్ ఫస్టుక్లాసులో పాసు కావడం గొప్ప విశేషం. అటుపై పెద్ద చదువులు చదివేందుకు బొంబాయి, వారణాసి, కలకత్తాలలో గడిపారు. మొత్తం ప్రపంచం గురించి, ప్రపంచ ప్రజల స్థితిగతుల నేపథ్యంలో వారి ఆలోచనలు సాగుతుండేవి.

లోహియా కూడా ఉన్నారు. దీనికి అనుబంధంగా అప్పుడు 'కాంగ్రెస్ సోషలిస్ట్' పత్రిక సంపాదకులుగా కూడా ఆయన పనిచేయాల్సి వచ్చింది. 1939లో రెండో ప్రపంచ యుద్ధం మొదలయ్యింది. దానిలో భారతీయులెవ్వరూ పాల్గొనవద్దని లోహియా పిలుపునిచ్చారు. ఆ కారణంగా మే 24న ఆయన అరెస్టు కాక తప్పలేదు.

1942లో క్విట్ఇండియా ఉద్యమంలో డాక్టర్ రామమనోహర్ లోహియా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఉషామెహతాతో కలిసి ఒక అజ్ఞాత రేడియో స్టేషన్ నెలకొల్పి దానికి 'కాంగ్రెస్ రేడియో' అని నామకరణం చేసిన ఘనుడు. తిరిగి 1944లో ఆయనను ఆనాటి దొరల ప్రభుత్వం అరెస్టు చేసి నానాహింసలు పెట్టింది. ఆయనతో బాటు లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్‌ను కూడా ఆగ్రా జైలుకు తరలించారు. అప్పుడే లోహియా తండ్రి హీరాలాల్ లోహియా మరణించడంతో పెరోల్ మీద విడుదలై బైటికొచ్చారు. 1946 జూన్ 10న గోవా వెళ్లారు లోహియా. ఇదే నెల 18న బహిరంగ ప్రసంగం చేయాల్సి ఉండగా ఆనాటి ప్రభుత్వం ఆయనను నిర్బంధించింది.

లోహియా దేశవిభజన విషయంలో వ్యతిరేకంగానే ఉండేవారు. ప్రపంచ పౌరసత్వం కావాలని ఆయన కోరిక. ప్రపంచమంతా స్వేచ్ఛగా వీసాలు, పాస్‌పోర్టులు లేకుండా ప్రయాణించే పద్ధతి ఉండాలని ఆయన కోరుకునేవారు. ప్రపంచ పార్లమెంట్, ప్రపంచ ప్రభుత్వం నెలకొల్పాలని ఆశించేవారు.

1949లో (దేశ స్వాతంత్ర్యం వచ్చాక) ప్రపంచ ప్రభుత్వ సదస్సుకు ఆయన భారతదేశపు ప్రతినిధిగా ఎన్నిక కావడం ఆనందించదగిన విషయం. స్వాతంత్ర్య సమరంలో 650 సంస్థానాలను విలీనం చేసి రెండు రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన రామమనోహర్ లోహియాగారిదే!

ఒక్క మహాత్మాగాంధీని మినహాయిస్తే, స్త్రీ పురుష సమానత్వ విషయంలో ఇంత పట్టుదలతో వ్యవహరించిన మరో నాయకుడింకొకరు అగుపించరు. రాజకీయాల్లోనే కాదు, జీవితపు అన్ని రంగాల్లోనూ స్త్రీలు క్రియాత్మకంగా పాల్గొనాలని ఆయన ప్రోత్సహించారు.

విదేశాలలో చదువుకోడానికి 1929లో ఆయనకు ఆర్థిక సహాయం లభించింది. లోహియా జర్మనీలోని బెర్లిన్ యూనివర్శిటీలో చదవడానికి నిశ్చయించుకుని, ముందుగా జర్మన్ భాష నేర్చుకున్నారు. జెనీవాలో 'నానాజాతి సమితి' సమావేశం జరుగుతున్నది. ఆనాటి భారతావనిని పాలిస్తున్న తెల్లదొరలు బికనీర్ మహారాజును భారత్ ప్రతినిధిగా ఆ సమావేశానికి పంపించారు. అతడు అక్కడకు రావడానికి అనర్హుడని రామమనోహర్ అలజడి తీసుకొచ్చారు. జర్మనీలోని భారతీయుల్ని ఆయన సంఘటిత పరిచారు. 1932లో ఆయన అదే విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి చేసి, 1933లో ఇండియాకి తిరిగివచ్చారు. వచ్చినప్పట్నుంచీ రామమనోహర్ స్వాతంత్ర్యోద్యమంలో నిర్భయంగా పాల్గొన్నారు. తన జీవితకాలంలో ఆయన 20 పర్యాయాలు జైలు జీవితాన్ని అనుభవించినట్లు చరిత్ర పరిశీలకులు చెబుతున్నారు.

1934 మే 17వ తేదీన 'కాంగ్రెస్ సోషలిస్టు' భావాలు కలిగిన కార్యకర్తల సమావేశం జరిగింది. ఆచార్య నరేంద్రదేవ్ ఆ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అదే సమయంలో 'కాంగ్రెస్‌లోనే సోషలిస్ట్ పార్టీ' నెలకొల్పాలనే ఆలోచన కలిగింది ఆయనకి. అదే ఏడాది అక్టోబర్ 21, 22 తేదీలలో సంపూర్ణానంద అధ్యక్షులుగా 'కాంగ్రెస్ సోషలిస్ట్' పార్టీ ఆవిర్భవించింది. అందులో కార్యవర్గ సమితి సభ్యుడుగా రామమనోహర్

ముఖ్యంగా ఆయన అధికార వికేంద్రీకరణకు ప్రాధాన్యమిచ్చే వ్యక్తి. రైతుల అభ్యున్నతిని ఎల్లప్పుడూ కోరుతుండే మనిషి. భారీ పరిశ్రమల కన్నా మానవవనరుల వినియోగానికే ఆయన పెద్ద పీట వేసేవారు. సిద్ధాంతపరంగా జవహర్‌లాల్ నెహ్రూకు సన్నిహితంగా మెలిగినా, ఆచరణ విషయంలో గాంధీ మార్గాన్నీ అనుసరించేవారు లోహియా.

ఎప్పుడూ దేశసమగ్రాభివృద్ధికి కులవ్యవస్థ మనదేశంలో అడ్డంగా వుందని రామమనోహర్ అభిప్రాయపడేవారు. సాంఘిక విప్లవానికి మహిళా సాధికారికత ముఖ్యమని ఆయన భావించేవారు.

1967 అక్టోబర్ 12న ఆయన అంతిమ శ్వాస విడిచారు. మాజీ కేంద్రమంత్రి రాజ్‌నారాయణ్ ఈయన శిష్యుడే. మధులిమాయే లాంటి పెద్దలే భారత నిర్మాణంలో డాక్టర్ రామమనోహర్ లోహియా పాత్ర మహాత్మాగాంధీ తర్వాత రెండో స్థానాన్ని ఆక్రమించిందనడం సముచితమైన అంశం.

మానవతా దృక్పథంతో సోషలిస్టుగా ఆయన ముస్లిం మైనారిటీల పట్ల ముఖ్యంగా వారిలో వెనుకబడ్డ వర్గాల వారిపట్ల, వారి సంక్షేమం కోసం చైతన్యంగా పనిచేశారని చెప్పొచ్చు. మతపరమైన రక్తపాతాన్ని, అమాయకుల హత్యల్ని చూసి చలించిపోయే మృదుస్వభావి ఆయన.

*– డా॥ మంతెన సూర్యనారాయణరాజు*

# మేలిముసుగును అధిగమించి గ్రామ సర్పంచ్‌గా....






**అది ఒక కుగ్రామం. ఆచారాలకు, సాంప్రదాయాలకు ప్రజలు చాలా విలువనిస్తారు. ఆ గ్రామంలో స్త్రీలు ఎల్లప్పుడూ మేలి ముసుగు వేసుకునే తమ పనులన్నింటినీ నిర్వర్తిస్తుంటారు. మేలిముసుగు తొలగించడమంటే ఘోర నేరం క్రింది పరిగణిస్తారు. అటువంటి కుగ్రామం నుండి మేలిముసుగు పరదాలను, కట్టుబాట్లను దాలి నేడు దేశ విదేశాలలో ఒక మహిళ తన ఉనికిని చాటుతోంది. అంతేకాదు మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.**

**ఎవరా మహిళ ? ఏదా గ్రామం ? ఆ మహిళ "చవి రజావత్"**

ఆ గ్రామం "సోడా", రాజస్థాన్ రాష్ట్రంలోని టోంక్ జిల్లాలో గల ఒక అట్టడుగు స్థాయి గ్రామం. "సైనిక్ గ్రామ్" గా కూడా పిలువబడేది, ఎందుకుంటే భరత మాత సంరక్షణకై ఎందరో వీరులను దేశానికి అందించిన ఘనత గలదీ గ్రామం. 1965 సం॥రంలో జరిగిన "ఖేమకరణ్" యుద్ధంలో విశేష ప్రతిభ చూపించి "మహావీర చక్ర" అవార్డును," "సావియర్ ఆఫ్ పంజాబ్" టైటిల్‌ను దక్కించుకున్న బ్రిగేడియర్ రఘుబీర్ సింగ్. మరెవరో కాదు, ఈ చవి రజావత్ తాతగారే. ఈయన సర్పంచ్‌గా ఉన్న ఆ కాలంలోనే చవి రజావత్ తల్లికి కట్టుబాట్లను అధిగమించి జీవించేటందుకు అవసరమైన స్వాతంత్ర్యాన్ని కల్పించారట. ఇది చూసి ఆశ్చర్య పోవటం గ్రామస్థుల వంతైనప్పటికీ, ఏ ఒకరూ పెదవి విప్పే సాహసం చెయ్యలేదట.

సనాతన ఆచారాలకు, సాంప్రదాయలపై గల మూఢ నమ్మకాలకు ఆరోజుల్లోనే అడ్డుకట్ట వేసిన మహామనీషి శ్రీ రఘుబీర్‌సింగ్. ఆయన మనుమరాలు కూడా తాతగారి అడుగు జాడల్లో నడుస్తూ తన గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో 20 సం॥రంలో రాజస్థాన్‌లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో సోడా గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించింది.

చవి రజావత్ బెంగుళూరులోని రిషీవ్యాలీ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించి, ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ సంస్థ అయినటువంటి లేడీ శ్రీరామ్ మహిళా కళాశాలలో ఉన్నత విద్యను పొంది, పూణేలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడరన్ మేనేజిమెంటునందు మేనేజిమెంటు డిగ్రీ సాధించింది.

30 ఏళ్ళ ఈ రాజస్థానీ అమ్మాయి, చదువు పూర్తయిన తర్వాత 5 సం॥రాల పాటు ఒక కార్పొరేట్ సంస్థలో పని చేసి, తన హోదాను ఆర్థిక లాభాన్ని చూసుకోకుండా తన గ్రామాన్ని అభివృద్ధి చెయ్యాలనే ధృడ సంకల్పంతో, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించింది. బహుశా యం.బి.ఏ చదివి, సర్పంచ్‌గా ఎన్నికైనటువంటి మహిళ, దేశంలో ప్రప్రథమంగా ఈ అమ్మాయే అంటే అతిశయోక్తి కాదేమో.

**ఆమె మాటల్లో చెప్పాలంటే.**

"నా మేనేజిమెంటు డిగ్రీ యే ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి

ఎంతగానో సహకరిస్తోంది. అంతే కాకుండా నారక్తంలో అంతర్భాగమైన సమాజసేవ కూడా నన్ను ఈ దిశగా నడిపించాయి. నేను ఉద్యోగం వదలి రావడం గురించి పెద్దగా ఆలోచించ లేదు ఎందుకంటే ఈ గ్రామానికి నా అవసరం చాలా వుంది. నా విజయం నా కులస్థుల ఓట్లతో కాకుండా మిగతా గ్రామస్థులందరి సమిష్టి కృషి వల్ల లభ్యమైందనీ, దీనిని బట్టి చూస్తే గ్రామస్థులు మార్పును ఎంతగా కోరుకుంటున్నారో అర్థం అవుతుందని" జీన్స్ ప్యాంటు, టీ షర్టు ధరించి గుర్రంపై తిరుగుతూ గ్రామానికి కావలసిన అవసరాలను కని పెట్టే ఈ రాజస్థానీ అమ్మాయి చెపుతోంది.

సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామంలోని ముఖ్య అవసరాలను గుర్తించి గ్రామస్థుల సహకారంతో మాస్టర్ ప్లాన్ తయారు చేసిందీ చలాకీ అమ్మాయి. ఎందకంటే ఒక నిమిషంలో పిల్లలతో క్రికెట్ ఆడుతూ, మరునిమిషంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద గ్రామంలోని మహిళలు త్రవ్వుతున్న చెరువుపనులను పర్యవేక్షిస్తూ కనపడుతుంది.

ఒక ఇంటర్వ్యూ సందర్భంగా తాను ఎన్నికైననాటి నుండి సోడా గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు ప్రభుత్వపరంగా జరగలేదనీ, ఇందుకు ప్రజలు, అధికారుల అలసత్వధోరణి, సమయపాలన లేక పోవటం, పనుల మంజూరీలో విపరీతమైన జాప్యం, అందివచ్చిన అవకాశాల ద్వారా కూడా పనులు జరుగ కుండా అడ్డుపడటం, గత కాలపు ప్రజా ప్రతినిదులలో ప్రశ్నించే తత్త్వం లేకపోవటం ఇవన్నీ ప్రముఖంగా కొనసాగుతున్నాయనీ వివరించారు.

తాను మాత్రం వారిలా కాకుండా తన గ్రామ అభివృద్ధికి అవసరమైన వనరులను సమకూర్చే ప్రయత్నంలో వచ్చే అన్ని అడ్డంకులను ఎదుర్కొంటానని, కారణమైన వారిని ఖచ్చితంగా ప్రశ్నించి తీరుతానని తెలియజేసారు. అంతేకాకుండా గ్రామ అభవృద్ధి సాధించాలంటే ముందు గ్రామస్థులలో అవగాహన తీసుకురావాలనీ, అందుకు తాను ప్రయత్నిస్తున్నానని తెలియజేస్తూ, గ్రామానికి అవసరమైన మంచినీటి సౌకర్యం కొరకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందనందున, తాను స్వయంగా రూ. 20 లక్షల రూపాయలు సమకూర్చి కొంత వరకు పనులు జరిగేటట్లు చూడ గలిగాననీ, ఎంతో ధైర్యంగా చెబుతోంది జీన్స్ ప్యాంట్ అమ్మాయి.

ఇటీవల 2011 సంవత్సరం మార్చి 24, 25 తీదీలలో మన్‌హటన్‌లో దారిద్ర్య నిర్మూలనపై జరిగిన పదకొండవ ప్రపంచ సదస్సుకు హాజరై ఆహుతులందరినీ అబ్బురపరచిందీ చలాకీ అమ్మాయి. ఆ సదస్సులో ఈ అమ్మాయిని సోడా గ్రామ సర్పంచ్‌గా పరిచయం చేసినప్పుడు ఆశ్చర్యపోవడం అక్కడ వున్నటువంటి మంత్రులు, గౌరవ ప్రతినిధుల వంతైంది. ఆ సదస్సులో ఆమె చాలా నిర్భయంగా సమాజం అనుసరించవలసిన విధానాల గురించి మాట్లాడింది.

మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భారతదేశం 65 సం॥రాలుగా ప్రదర్శిస్తున్న పనితీరులో పనిచేస్తే కష్టమనీ, అందుకుగాను నూతన మార్గాను అన్వేషించాలనీ, ఈ సర్వీసులను ఉపయోగించు కోవాలనీ, లేకపోతే ప్రజలకు కనీసఅవసరాలైనటువంటి మంచినీరు, కరెంటు, మరుగుదొడ్లు, పాఠశాలలు మరియు ఉపాధి కల్పనలో విఫలమవుతామనీ తెలియజేసింది.

మనం వేగంగా మార్పును సాధించగలమనే నమ్మకం తనకుందనీ, కేవలం 3 సంవత్సరాలోనే తన గ్రామాన్ని అభివృద్ధి చేస్తాననీ, అందుకు తనకు డబ్బు అవసరం లేదనీ, ప్రాజెక్టులను చేపట్టే సంస్థలు, మనుష్యులు వుంటే చాలనీ, ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టులు, విఫలమవడానికి సరైన మానవ సంబంధాలు లేకపోవడమేననీ, ఆ లోటును తానుభర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నానని తెలియజేసింది. అంతే కాకుండా తన గ్రామంలో మిలీనియం అభివృద్ధి లక్ష్యలను సాధించటానికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వేతర సంస్థలు, కార్పొరేట్ సంస్థలు అందించటానికి ముందుకు వచ్చాయనీ తెలిసింది.

సోడా గ్రామంలో మొట్టమొదటి బ్యాంకును ఏర్పాటు చేయడంలో సహకరించిన యుఎన్‌ఓపి సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇక్కడినుండే మార్పు ప్రారంభమైందని చెబుతూ, ప్రతి ఒక్కరూ ఆనందంగా కొనసాగించే జీవితాన్ని ఈతరం వారు అందుకునే విధంగా తీసుకురావలసిన మార్పులను వేగంగా తీసుకురావడానికి ఈ ప్రపంచసదస్సే నాంది కావాలని కోరింది.

"గ్రామీణ రాజకీయాల్లోకి చదువుకున్న మహిళల ప్రవేశానికి నాందిగా రజావత్‌ను అభివర్ణిస్తూ, ఇంకా ఎందరో మహిళలు ముందుకు రావటానికి ఈమె ప్రేరణ" కాగలదని అప్పటి కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖామంత్రి వర్యులు రజావత్‌ను ప్రశంసించారు.

ఒక సర్పంచ్‌గా ఆమె తన గ్రామ అభివృద్ధికి కృషిచేస్తూ, కుటుంబ పోషణ నిమిత్తం జైపూర్‌లో ఒక హోటల్‌ను, ఈనెస్ట్‌రైడింగ్ స్కూలును నిర్వహిస్తూ కుటుంబానికి తనవంతు చేయూత నందిస్తున్నారు. ఇప్పటి వరకు సర్పంచ్ అంటే ఒక సంతకంచేసే అధికారం గానే మిగిలిపోయిందనీ, ఈ భావం ఖచ్చితంగా మారాలని ఆమె కోరుకుంటోంది.

ప్రస్తుతం సర్పంచ్‌లుగా ఉన్నటువంటి ప్రతి ఒక్కరు తమ స్వార్థాన్ని వీడి, తమ చేతనైనంతలో తను గ్రామాభివృద్ధికి కృషి చేస్తే రజావత్ కోరుకునే మార్పును మనం చిరకాలంలోనే సాధించవచ్చు. పార్టీలు ఏవైనా గ్రామాభివృద్ధే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలి. అలా పని చేసిన నాడే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారమవుతుంది.

**గంధం సత్యవాణి**

**ఫ్యాకల్టీ, అపార్డు.**

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**



రంగారెడ్డి జిల్లా చీదేడు గ్రామంలో రక్షిత అటవీ ప్రాంతంలో
విత్తనాలు నాటుతున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



మహబూబ్‌నగర్ జిల్లా దూస్‌కల్ గ్రామంలో భారత్ నిర్మాణ్
వాలంటీర్లతో చర్చిస్తున్న అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి


కృష్ణాష్టమి
శుభాకాంక్షలు